# కుందెన

## సాహిత్య వ్యాసాలు

సాగర్ల సత్తయ్య

# కుందెన

(సాహిత్య వ్యాసాలు)

## సాగర్ల సత్తయ్య

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితం. పుస్తకంలోని అభిప్రాయాలు రచయిత సొంతం. వాటితో విశ్వవిద్యాలయానికి ఎటువంటి బాధ్యత లేదు.

**Kundena** (Literary Essays)
by **Sagarla Sathaiah**

**© Sagarla Sathaiah**

**First Edition : November, 2019**

**Copies : 500**

**Rs. 150.00**

**ISBN**
**978-93-5391-817-0**

**For Copies:**

**Sagarla Sathaiah**

VATTIMARTHY (village)

CHITYALA (Mandal)

**NALGONDA (dist) - 508254**

**Cell No. 9966549991, 7989117415**

**and**

**Leading Book Stores**

**Printed at:**

Leapakshi Printers, Hyderabad

# అంకితం



పాఠశాల జీవితంలో
మాపై తనదైన ముద్ర వేసిన
అరుదైన
మహోపాధ్యాయులు
నన్ను
ఉపాధ్యాయ వృత్తివైపు
మళ్లించి
బతుకు తోవను చూపిన
అక్షరాక్షర గురువు
**శ్రీ కొండకింది అంజిరెడ్డిగారికి**
వినమ్రంగా...

– సాగర్ల సత్తయ్య

# విమర్శ రంగంలోకి ఆహ్వానం

**సా**గర్ల ఇంటి పేరు ఎట్ల వచ్చిందో గని సత్తయ్య సాగరం కావాలన్నది నా ఆశ. సత్తయ్య అప్పుడెప్పుడో 2007లో అనుకుంట నా విద్యార్థి. విద్యార్థులెందరో ఉంటరు. కొందరే గుర్తుంటరు. కొందరే అధ్యాపకులని గుర్తు పెట్టుకుంటరు. అట్లాంటి విద్యార్థి సత్తయ్య. అందుకు నిత్య విద్యార్థి కావడం, పత్తి హృదయం కావడం కారణమనుకుంట. నా ఆత్మీయులల్ల చేరిండు.

ఆ ఆత్మీయతతోనే ఈ పుస్తకానికి ముందుమాట రాయమన్నడు. ఇది సాహిత్య విమర్శ పుస్తకం. నా విద్యార్థుల్ల ఎక్కువ మంది కవులు. సత్తయ్య విమర్శ మార్గాన్నెంచుకున్నడు. విమర్శకుల కొరత శాన ఉంది. ఆ మార్గంల వెలుగు కావడం మంచిదేగద. విమర్శకుడికి ఒక ఐఏఎస్ కంటే, ఒక ముఖ్యమంత్రి కంటే, ఒక ప్రధానమంత్రి కంటే ఎక్కువ జ్ఞానం ఉండాలె. ఈ లక్షణాలను సత్తయ్య క్రమక్రమంగా సంతరించుకుంటున్నడనడానికి ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాలు నిదర్శనంగా నిలుస్తున్నవి.

సాగర్ల వ్యాసం రాసేంతవరకు రావిరాల బుచ్చయ్య ఎవరికీ తెలియదు. వ్యాసం జిల్లాస్థాయి, తాలూకా స్థాయి సూక్ష్మ చరిత్రల ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. "రాధేయ కవిత్వంలో ఆర్తి, ఆవేశం, ఆలోచన జీవ లక్షణాలై ప్రవహిస్తాయి. చైతన్య శీలత అంతర్నిగూఢంగా ప్రవహిస్తుంది" అనే వాక్యం సత్తయ్య పరిశీలనా శక్తికి నిదర్శనం. "ఏ రచయిత అయితే తన మూలాలను మరచిపోకుండా సాహిత్యంలో నిబద్ధతతో రాస్తాడో ఆ రచయిత రాసిన సాహిత్యం పదికాలాలపాటు నిలబడుతుంది". "రాజకీయ నిబద్ధత కంటే హృదయ నిబద్ధత గొప్పదని భావించిన వారు"(కాళోజీ) లాంటి వాక్యాల వల్ల సత్తయ్య సూత్రీకరణ చేసే స్థాయికి చేరుకుంటున్నట్టు తెలుస్తుంది.

"తెలుగు సాహిత్యంలోనే తొలిచిందు నవల" లాంటి మాటలు సత్తయ్య తెలుగు సాహిత్యాన్ని మొత్తం Fallow అవుతున్న వైనాన్ని తెలుపుతవి.

ఇట్లా ఇంకా లోతైన పరిశీలనతో గొప్ప వ్యాసాలు రాసి మంచి విమర్శకుడిగా ఎదగాలని కోరుతూ సాహిత్య ప్రపంచంలోకి ఆహ్వానిస్తున్న.

**– డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి**

నల్లగొండ.
09.10.2019

# అవసరమైన సందర్భంలో అందివచ్చిన విమర్శకుడు సత్తయ్య

వివరించె యజుర్వేదము
కవియగు విప్రుండు, శుచి జగంబుల నేత
త్ర్వ విమల కావ్యము మిక్కిలి
పవిత్రమగు కపిల గోవు పాలతెరగున్

ఈ పద్యం అర్థం ఏమిటంటే 'యజుర్వేదం విప్రుడే కవి అని పేర్కొంది కాబట్టి, విప్రుడు కాని కవి రాసింది కావ్యం కాదు' ఈ విషయాన్ని 17వ శతాబ్దానికి చెందిన కాకునూరి అప్పకవి తన 'అప్పకవీయము' అనే చంధో గ్రంథములో రాసిండు. ఇప్పటికీ కొంత ప్రత్యక్షంగా, మరికొంత పరోక్షంగా వివిధ నియంత్రణ పద్ధతుల ద్వారా 'దళిత, బహుజన సాహిత్యం'పై 'బాన్' కొనసాగుతుంది. 'బాన్'-నిషేధం వివిధ రకాల్లో, భిన్న రూపాల్లో ఉంటుంది. దళిత బహుజనులు ఎంత మంచి రచన చేసినా బ్రాహ్మణులు విస్మరిస్తారు. వీలయితే విద్వత్తు లేదని తేల్చేస్తారు. అట్లాగే తమ కులం వారు ఎంత చెత్త రచన చేసినా ఏదో ఒక పాయింట్‌ని అంది పుచ్చుకొని అద్భుత రచనగా అందల మెక్కిస్తారు. ప్రోత్సాహ మెకానిజం ద్వారా 'తమ'వారిని చేరదీస్తారు. దీనికి వారికి అనుకూలమైన 'పండిత వర్గం', ఆదరించే పత్రికలు కావాల్సిన ప్రచారాన్ని ఫ్రీగా చేస్తాయి. అయితే దీనికి విరుగుడుగా 'సోషల్ మీడియా'లో బహుజనులు రాస్తున్నప్పటికీ అది 'శోషిత మీడియా'గానే 'ప్రామాణికులు' తీర్పులిస్తున్నారు. ఆ 'ప్రామాణికుల' తీర్పులే 'ఆమోదం' పొందుతున్నాయి. అవార్డుల కమిటీల్లో మెజారిటీ వారిదే కావడంతో 'ఆమోదనీయుల'కే అవి దక్కుతున్నాయి. ఇందు కోసం ప్రణాళిక బద్ధంగా బహుజనులు చేసే 'విమర్శ'కు విలువ లేకుండా చేస్తారు. బ్రాహ్మణీయ, మనువాద భావజాలం ఉన్న వాళ్ళు బహిరంగంగా ప్రగతిశీల, అభ్యుదయ రచనలకు ఎక్కడా మద్దతు ప్రకటించకపోయినప్పటికీ అంతర్గతంగా అది రాసిన వాడు ఏ భావజాలానికి చెందిన వాడైనా తమ కులం వాడైతే చాలు వారిని గొప్ప రచయితగా గుర్తిస్తూ అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తారు.

విమర్శ విషయ నిపుణుల పని. విషయ నిపుణులకే విజ్ఞులని పేరు. ఈ విజ్ఞులెవరంటే పండితులు. మళ్ళీ పండితులెవరంటే వేదాలు, పురాణాలు వల్లె వేసిన బ్రాహ్మణులని ఇన్నేండ్లు సాహిత్యంలో ప్రచారంలో ఉన్నది. విషయాన్ని 'ప్రామాణీకరిం'చేదీ వాళ్ళే. అందుకే సాహిత్య సృజన, విమర్శ, ప్రతి విమర్శ కేవలం

బ్రాహ్మణ కులాలకే పరిమితమని పండితులు తేల్చి చెప్పింద్రు. ఎత్తుకునేది వాళ్ళే, తొక్కేసేదీ వాళ్ళే!

‘ఉపమ కలిగిన శయ్యల నొప్పియున్న
నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు
పాయసంబైన సంసార పక్వమైన
గాక జుష్టంబు హవ్యంబు గానియట్లు’

అని బ్రాహ్మణేతరులు సృజించిన సాహిత్యాన్ని అప్పకవి కాకి ముట్టిన పాయసంతో పోల్చిండు. ఇక్కడ ‘అంఘ్రిభవుడు’ అంటే అప్పకవి దృష్టిలో శూద్రుడే! అంటే శూద్రుడి రచన ఎంత గొప్పగా ఉన్నా, అన్ని వ్యాకరణ సూత్రాల్లో ఇమిడి ఉన్నప్పటికీ దాన్ని మంచి రచనగా పరిగణించకూడదని చెప్పిండు.

అయితే బసవేశ్వరుడి కాలంలో ఆయన బోధన ప్రభావంతో దళిత, బహుజన సృజనకారులు సైతం సాహిత్యాన్ని సృజించారు. భక్తి ఉద్యమాలకు ఊతమిచ్చారు. అంతకుముందు కూడా కొంత మంది బహుజనులు సాహిత్యం సృజించినా అది ఉద్యమంగా సాగలేదు. అయితే భక్తి ఉద్యమం తర్వాత తెలుగులో ప్రబంధ సాహిత్యం రంగం మీదికి వచ్చింది. ముద్దుపళని లాంటి  ఒకరిద్దరిని మినహాయిస్తే శృంగార ప్రధాన రచనలు చేసిన వారందరూ బ్రాహ్మణులే! ఈ ప్రబంధ కాలంలో వివిధ రూపాల్లో ప్రజా జీవితానికి సంబంధం లేని రచనలే గొప్ప సాహిత్యంగా ప్రచారానికి నోచుకున్నాయి. చేమకూర వేంకటకవి లాంటి ఒకరిద్దరు బీసీ కవులున్నా వారిని గుర్తించ నిరాకరించారు. బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించిన వేమన పద్యాలు సిపి బ్రౌన్ పూనుకొనే వరకు వెలుగులోకి రాలేదు. పోతులూరి వీరబ్రహ్మం గారి రచనలు 1970ల తర్వాత గానీ విరివిగా ప్రచారంలోకి రాలేదు. అలాగే ఇప్పటికీ సుంకరనేని ఫణికుండలుడు, దార్ల సుందరమ్మ లాంటి బహుజన రచయితలు, రచయిత్రుల గ్రంథాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇదంతా ఎందుకు జరిగిందంటే సాహిత్య రంగంలో బ్రాహ్మణులు, ఆ తర్వాత అక్కడక్కడా కట్టమంచి, కె.వి.రమణారెడ్డి లాంటి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాళ్లు ఆధిపత్యం చలాయించడంతో దళిత, బహుజన రచయితల రచనలకు న్యాయమైన గౌరవం, గుర్తింపు దక్కలేదు. వివిధ రచయితల సంఘాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, ప్రచురణ సంస్థలూ అన్నింటిలోనూ అగ్రకులాల వారిది ముఖ్యంగా బ్రాహ్మణుల ఆధిపత్యమే కొనసాగడంతో మామిండ్ల రామాగౌడ్, మల్యాల దేవిప్రసాద్ యాదవ్, కపిలవాయి లింగమూర్తి ఇంకా అనేక మంది తెలంగాణ బహుజనుల రచనలు ఎన్నడూ ప్రచురించలేదు. ప్రచారంలోకి తేలేదు.

అయితే ఈ లోటును ప్రధానంగా 1990ల తర్వాత వచ్చిన వివిధ అస్తిత్వ ఉద్యమాలు కొంతమేరకు పూడ్చినాయి. దళిత సాహిత్యం గురించి కొంత లోతైన చర్చ జరిగింది. చిక్కనవుతున్న పాట, బహువచనం లాంటి కవితా సంకలనాల ద్వారా బహుజన భావజాలాన్ని బలంగా చెప్పగలిగింద్రు. ఆ తర్వాత వెలువడ్డ 'వెంటాడే కలాలు.. వెనుకబడిన కులాలు' సంకలనం చిధ్రమవుతున్న బీసీల జీవితాలను చిత్రించాయి. ఈ దశలో బీసీల రచనల గురించి విస్తృతంగా చర్చలు జరిగాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తనను తాను తెలుసుకుంటూ, తమ ప్రతిభ, ఘనతను ప్రపంచానికి తెలంగాణ రచయితలు తెలియజెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంత గొప్పగా తెలంగాణ సాహిత్యాన్ని బహుజన దృక్కోణంలో రికార్డు చేస్తున్నారు. ఇట్లా స్థానిక ప్రతిభను, విస్మరణకు గురైన సాహిత్యాన్ని, ప్రధానంగా బహుజన సాహిత్యాన్ని ఇటీవలి కాలంలో ఎక్కువగా వెలుగులోకి తెస్తున్నది బీసీలే! తెలంగాణ రాష్ట్ర అస్తిత్వ స్ఫూర్తితో, స్థానిక సాహిత్యంపై ఆర్తితో విమర్శా రంగంలోకి అడుగుపెట్టి రువ్వడిగా బహుజన సోయితో నడుస్తున్న విమర్శకుడు సాగర్ల సత్తయ్య. సత్తయ్య టీచర్‌గా తెలుసు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన కొత్తలో పాఠ్యపుస్తక ప్రణాళిక సంఘం సమావేశాలు, క్యాంప్‌లు జరిగినప్పుడు అక్కడ పరిచయం. ఆ కమిటీలో కూడా మెజారిటీ బ్రాహ్మణులదే అయినప్పటికీ సత్తయ్య లాంటి కొంతమంది బీసీలు కూడా ఉన్నారు. కేవలం ప్రతిభ ద్వారా మాత్రమే అందులో సత్తయ్య స్థానం సంపాదించుకున్నారు.

ఇప్పుడు సాగర్ల సత్తయ్య 'కుందెన' పేరిట 35 విభిన్నమైన విమర్శా వ్యాసాలను మన ముందుకు తెస్తున్నాడు. భవిష్యత్‌లో మంచి విమర్శకుడిగా ఎదగడానికి పటిష్టమైన పునాదులు ఈ పుస్తకం ద్వారా పడ్డాయంటే అతిశయోక్తి కాదు. ఎనుకట మిల్లులు లేని కాలంలో ధాన్యాలను దంచేప్పుడు అవి చిల్లం కల్లం కాకుండా కాపాడుకునేందుకు 'రోలు'పై 'కుందెన' ఉంచేవారు. సాహిత్యంలో కూడా సత్తయ్య తాలుని ఏరేసి సత్తువ ఉన్న ఇత్తుల్ని జల్లెడబట్టి మనకందించిండు. ఏ 'రోటి'కాడి పాట ఆ 'రోటి' కాడ పాడే వాళ్ళు చాలా మంది ఉన్నరు. అది విమర్శకన్నా పరామర్శగానే ప్రసిద్ధి. అందుకు విరుద్ధంగా సత్తయ్య ఇందులోని రచనలన్నింటినీ సమదృష్టితో పరిశీలించి, విశ్లేషించి వ్యాఖ్యానించాడు. రాళ్ళు, తాలుతో కూడిన వాటిని చెరిగి మనకందించిండు. అందుకు అభినందనలు. తెలంగాణ రాష్ట్రంలో బిరుదురాజు రామరాజు, సురేంద్ర రాజు, ఎన్.గోపి, జయధీర్ తిరుమలావు, బిఎస్ రాములు, కాలువ మల్లయ్య, పులికొండ సుబ్బాచారి, లక్ష్మణరావు పతంగే, పిల్లలమర్రి రాములు, నలిమెల భాస్కర్, సిద్ధార్థ,

ఎస్వీ సత్యనారాయణ, ననుమాసస్వామి, కె.పి.అశోక్ కుమార్, పగడాల నాగేందర్, ఎస్.రఘు, వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్, ఏశాల శ్రీనివాస్, భీంపల్లి శ్రీకాంత్, బెల్లి యాదయ్య, రూప్‌కుమార్ డబ్బీకార్, చింతం ప్రవీణ్, పత్తిపాక మోహన్ తదితరుల బాటలో బీసి అస్తిత్వ స్పృహతో కొత్తగా అడుగులు వేస్తూ విమర్శకుల్లో పరిగణనలోకి తీసుకోవాల్సిన వాడు సత్తయ్య. 'కుందెన'లోని 34 వ్యాసాలను చూస్తే ఈ విషయం అర్థమైతది. ఇందులో మెజారిటీ వ్యాసాలు బహుజనుల రచనలపై చేసినవి కావడం విశేషం. ఇంకో విశేషమేమిటంటే ఒకే ప్రక్రియకు సంబంధించిన అంశంపై గాకుండా దాదాపు ఆధునిక తెలుగు సాహిత్యంలో వెలువడుతున్న బహుళ సాహిత్య ప్రక్రియలపై ఇందులో వ్యాసాలున్నాయి. ఇట్లా విభిన్న ప్రక్రియలపై విమర్శ రాయడం చాలా కష్టమైన పని. ఎందుకంటే విమర్శ చేయడానికి ఎక్కువ విషయాలు తెలిసి ఉండాలి. అందులో లోతైన జ్ఞానముండాలి. ఇంకా చెప్పాలంటే ఆ విషయంలో నిపుణత సాధిస్తే గాని విమర్శ వన్నెకు రాదు. నిపుణత అనేది నిరంతర అధ్యయనం ద్వారా వస్తుంది. ఆ అధ్యయనానికి సృజనకారుడి కన్నా ఎక్కువ శ్రమపడాల్సి ఉంటుంది. శ్రమతో కూడుకున్నదే గాకుండా విమర్శ ఖర్చుతో కూడుకున్నది కూడా! అధ్యయనానికి అవసరమైన పుస్తకాలు చదవడమనేది నిరంతరమైన పని. పుస్తకాలు చదవడమంటే పుస్తకాలు కొనడంగానే భావించాలి. అందుకు తగ్గ సమయం కూడా కేటాయించాల్సి ఉంటుంది. సమయం, పైసలు వెచ్చించి, అధ్యయనం చేసి ఒక పుస్తకం/రచనపై విమర్శ చేయడమంటే అనుభవం, అధ్యయనం రెండింటిని కలబోసి తీర్పు ఇవ్వడమే! ఇన్నేండ్లు బహుజనుల రచనలపై, వారు సృజించిన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన లేకపోయినప్పటికీ అగ్రకులాల వారే అక్కడక్కడా విమర్శ చేసేవారు. తుదితీర్పులిచ్చేవారు. ఇప్పుడు అందుకు భిన్నంగా బహుజన దృక్కోణంలో విమర్శ బలంగా వస్తోంది. అందుకు ఈ పుస్తకమే నిదర్శనం.

విమర్శకుడు ఒక పుస్తకాన్ని పూర్తిగా చదివిన తర్వాత తన జ్ఞానంతో అందులోని మంచి చెడ్డలు తేల్చి చెబుతాడు. ఇంతకు ముందే రాసినట్లు విషయానికి సంబంధించిన పూర్తి అవగాహన అవసరం. విషయంపై పూర్తి అవగాహన అధ్యయనం ద్వారా సత్తయ్య అలవర్చుకున్నాడనే విషయం ఇందులోని వ్యాసాలు చెబుతున్నాయి. పరిశోధన లేకుండా విమర్శ లేదని కూడా అర్థమయితది. అందుకు 'కన్నెగంటి గజళ్లు'పై చేసిన విమర్శ ఒక రుజువు. అందులో గజల్ పుట్టుక మొదలు దాని నిర్మాణం, నడక ఎలా ఉ ంటుందో రాసిండు. ఇది ఒక కొత్త విషయంపై పూర్తి అవగాహన ఏర్పడడానికి తోడ్పడుతుంది. మందెచ్చుల సాహిత్యంపై వ్యాసం మరో 'మెచ్చు'తునక.

ఈ విమర్శా వ్యాస సంపుటిలో తెలుగు సాహిత్యానికి ఇంతవరకు పరిచయంలో లేని తన స్వగ్రామం వట్టిమర్తికి చెందిన రావిరాల బుచ్చయ్య జీవితం– సాహిత్యం పై విశ్లేషణాత్మక రచన మొదటి వ్యాసం. 70వ దశకంలో కవిగా ఎదిగినవాడు అందరికీ తెలియాలి. కానీ ఆయన గురించి నల్లగొండ జిల్లా సాహిత్యంపై ప్రత్యేక అధ్యయనం చేసిన 'పండితుల'కు కూడా తెలియదు. కవి, కథకుడు, నవలాకారుడైన రావిరాల బుచ్చయ్యపై ఒక ఎంఫిల్ థీసిస్‌కు సినాప్సిస్ లాగా ఈ వ్యాసమున్నది. రావిరాలపై భవిష్యత్‌లో పరిశోధన జరగడానికి ఉపకరించే విధంగా ఈ వ్యాసమున్నది. రచనపై విమర్శ చేయడమే గాదు, మరుగునపడ్డ రచయితను పరిచయం చేయడం, ఆయన రచనలపై విశ్లేషణ రెండూ కలగలిసిన ఈ వ్యాసంలో అచ్చుకు నోచుకోని 'చిందు రామక్క' లాంటి నవల గురించి కూడా చెప్పిండు. అట్లాగే మరో చోట గడ్డం మోహనరావు రాసిన 'ఆత్మకథాత్మక నవల' 'కొంగవాలు కత్తి'ని తొలి చిందు నవలగా సత్తయ్య రాసిండు. ఈ రచనలో 'ఆత్మకథాత్మక' అని చెప్పడం ద్వారా మొత్తం నవల మూలాలను బయలు చేసిండు. నిజానికి 'బయలు' అంటే అచల బోధనలో 'ఎరుక', 'జ్ఞానం' అనే విషయాన్ని తండు సాయన్న తత్త్వాలను విశ్లేషిస్తూ చెప్పిండు. తత్త్వాలకు ఆధునికతను అద్ది రాస్తున్న దోరవేటి రచనలపై ఇందులో రెండు వ్యాసాలున్నాయి. 'జీవనది' పేరిట మొత్తం దోరవేటి సాహిత్యాన్ని లెక్కగట్టిండు. కేవలం లెక్కగట్టడమే కాదు అందులో ఏ రచన ఎలా ఉన్నది? వాటి బలాబలాలేమిటి అనేదీ చెప్పిండు. మరో రచన 'ఆచార్య దేవోభవ కథలు'. దోరవేటి లాగా సత్తయ్య కూడా టీచర్ కావడంతో కథలుగా మలచబడ్డ ఉపాధ్యాయుల జీవితాల్లోని మంచి చెడ్డలను స్వీయానుభవంతో విశ్లేషించిండు.

నల్లగొండలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తండు కృష్ణకౌండిన్య, ఆయన తండ్రి తండు సాయన్న ఇద్దరి రచనలపై ఇందులో విమర్శా వ్యాసాలున్నాయి. తండ్రి కొడుకుల సాహిత్యంపై ఒకే పుస్తకంలో విమర్శ వెలువడడం కూడా ఇందులోని విశేషంగా చెప్పొచ్చు. 1978లో మాస్టార్జీ రాసిన అంబేద్కర్ గీతమే ఇప్పటికి ఆయనపై వచ్చిన తొలి పాటగా ప్రచారంలో ఉన్నది. అయితే అంబేద్కర్‌ని స్ఫూర్తిగా తీసుకొని అందరూ చదువుకోవాలని బోధిస్తూ రాచమల్ల దేవయ్య 'రాధేయ' పేరుతో రాసిన విషయాన్ని 'దళిత చైతన్య ప్రవాహం రాధేయ కవిత్వం' అనే వ్యాసంలో పేర్కొన్నాడు. నిజానికి అనంతపురంలోని కవి ఉమ్మడిశెట్టి 'రాధేయ' చాలా మందికి తెలుసు. సత్తయ్య రచన ద్వారా 'నల్లగొండ' 'రాధేయ' కూడా తెలిసొచ్చిండు. అంబేద్కర్ జీవితాన్ని చాలా మంది వచన రూపంలో రాసిండ్రు. ధనంజయ కీర్, వసంతమూన్ లాంటి వారు రాసిన జీవిత చరిత్రలు తెలుగులోకి కూడా తర్జుమా అయ్యాయి. అట్లాగే ఎంతోమంది

అంబేద్కర్‌పైన గీతాలు, కవిత్వం రాసిండ్రు గానీ ఆయన జీవితాన్ని కవిత్వ రూపంలో 'మణిపూసలు' పేరిట శివాజీ రవీందర్ రికార్డు చేసిండు. పెరుగుతున్న అంబేద్కర్ భావజాలానికి ఈ రచనలు నిదర్శనాలు. వీటిని విస్మరణకు గురికాకుండా చరిత్రకెక్కించిన సత్తయ్య అభినందనీయుడు. అట్లాగే గత సంవత్సరం చనిపోయిన బాలసాహితీవేత్త 'పెండెం జగదీశ్వర్' రచనలపై కూడా రెండు విమర్శ వ్యాసాలున్నాయి. అందులో ఒకటి 'గజ్జెల దెయ్యం' అనే కథల పుస్తకంపై కాగా మరొకటి బాల సాహిత్యంలో భాషా సౌందర్యం పేరిట జగదీశ్వర్ రచనల్లో చోటు చేసుకున్న తెలంగాణ పదాలను ఎత్తి చూపిండు. గురువు, గ్రంథాలయోద్యమకారుడు కూరెళ్ళ విఠలాచార్యపై కూడా ఇందులో రెండు రచనలున్నాయి. అయితే ఒకటి కూరెళ్ళ గ్రంథాలయోద్యమానికి సంబంధించినది కాగా రెండోది విఠలేశ్వర శతకంపై పరిశోధన. ఈ పుస్తకంలో ఒక్క 'ఆవుల పిచ్చయ్య' రచనలు తప్ప మిగతాయన్నీ ఆంధ్రప్రదేశ్ /తెలంగాణ రాష్ట్రాల్లో ప్రచురితమైనవే! ఆవుల పిచ్చయ్య కథలు 1948కి ముందు హైదరాబాద్ రాజ్యంలో మీజాన్ పత్రికలో ప్రచురితమయ్యాయి. తెలుగు, తెలుగు భాష సౌందర్యాలపై కూడా చర్చ చేసిండు. రావిరాల బుచ్చయ్య, దోరవేటి, రాధేయ, కాళోజి, భూతం ముత్యాలు, కూరెళ్ళ విఠలాచార్య, షబ్నవీస్ వెంకటరామనరసింహారావు, వేణు సంకోజుల జీవితం–సాహిత్యంపై సాధికారికమైన విశ్లేషణ చేసిండు. వీరందరి రచనలపై ఒక అంచనాకి రావాలంటే దాదాపు అన్ని రచనలూ చదవాల్సి ఉంటుంది. ఆ పని కూడా సత్తయ్య చేసిండు.

ఈ 'కుందెన' ప్రత్యేకత ఏమిటంటే అన్ని రకాల ప్రకియలకు సంబంధించిన రచలనపై విమర్శ, విశ్లేషణ ఇందులో ఉన్నది. జీవితం–సాహిత్యం, ఉద్యోగ విరమణ సంచిక, కవిత్వం, ఆశ్రిత కుల సాహిత్యం, కథలు, పాటలు, సమగ్ర రచనలు, నవలలు, నానీలు, భాష, బాల సాహిత్యం, గజళ్లు, తత్త్వాలు, అనువాదం, పరిశోధన, ఏక కవిత, జీవిత చరిత్ర, ఆధునిక పద్య కావ్యం, బాల కథా సంకలనం ఇట్లా వివిధ ప్రక్రియల్లో వెలువడ్డ రచనలపై సాధికారికమైన విమర్శ చేసిండు.

సిద్దిపేటకు చెందిన సిద్దెంకి యాదగిరి కవితా సంపుటిని విశ్లేషిస్తూ 'సామాజిక స్పృహతో, నిబద్ధతతో రాస్తున్న కవిగా' సిద్దెంకిని సరిగ్గానే గుర్తించిండు. సిద్దెంకి యాదగిరి కూడా ఉపాధ్యాయుడు కావడంతో ఆయన మీద మరింత మమకారాన్ని కురిపించాడు. 'బాబా సాహెబ్ అంబేద్కర్' జీవితాన్ని 'మణిపూసలు' పేరిట కొత్త ప్రక్రియలో శివాజీ రవీందర్ అక్షరబద్ధం చేసిండు. ఇది తెలుగు సాహిత్యానికి కొత్త చేర్పు. తెలంగాణ నుంచి నల్లగొండ నుంచి చేరిన మేలైన చేర్పు. ఈ మణిపూసలు ప్రక్రియను వడిచర్ల

సత్యం మొదట ప్రచారంలోకి తీసుకొచ్చిండని దాని పుట్టు పూర్వోత్తరాలతో సహా వివరాలందించిండు. భూవిజ్ఞాన శాస్త్ర ఆచార్యుడైన నందిపాటి సుబ్బారావు 37కవితలను 'అమరావతి' పేరిట వెలువరించిండు. దీన్ని సత్తయ్య విశ్లేషిస్తూ 'భారతావని దీన రోదన'ను కవి అక్షరీకరించిన తీరు చెప్పిండు. నల్లగొండకుచెందిన 'కవిశ్రీ' బిరుదాంకితుడు మందపాటి వెంకటరాజు 'మంచువాన' పేరిట వెలువరించిన కవిత్వ సంపుటిని విశ్లేషిస్తూ సామాజిక చైతన్యంతో రాసిన కవితగా పేర్కొన్నాడు. తెలంగాణ ఉద్యమంలో 'మాకొద్దీ ఆంధ్రదొరతనము' అనే పాటను రాసి, పాడి ప్రచారం చేసిందీ, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిపై ఉయ్యాల పాట రాసిందీ తండు కృష్ణ కౌండిన్య అనే విషయం ఈ పుస్తకం ద్వారా తెలుస్తుంది. నిజానికి తెలంగాణ ఉద్యమంలో అనేక మంది అనేక విధాలుగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. సాహిత్య సృజన చేసింద్రు. అందులో పాటలది ప్రధాన భూమిక. ఇప్పటికీ ఈ పాటలన్నీ ఒక్క దగ్గరకు తీసుకొచ్చే ప్రయత్నం జరగలేదు. భవిష్యత్‌లో ప్రయత్నము జరిగినట్లయితే ఈ వ్యాసం కచ్చితంగా ఉపయోగపడుతుంది. వలసాంధ్రుల చేతుల్లో దగాపడ్డ తెలంగాణ గుండె చప్పుడును 'రణగీతం' పేరిట రికార్డు చేసిన దాసోజు జ్ఞానేశ్వర్ కవిత్వ ఎసెన్స్‌ని హృద్యంగా చిత్రించిండు. భువనగిరికి చెందిన సీనియర్ కవి, ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేసిన లక్ష్మీనారాయణ కవితా సంపుటి 'కాగితపు పడవ'లో షికారు చేయించిండు. వీటితో పాటుగా ఇటీవల సోషల్ మీడియాలో నాన్న గొప్పతనాన్ని ఆర్తిగా చిత్రించిన కవిత 'నాన్న పచ్చి అబద్ధాల కోరు' అనే కవిత. ఈ కవిత ఎవరు రాసింది సోషల్ మీడియాలో ప్రచారం కాలేదు. నాన్న తన సర్వస్వం కొడుకు కోసం త్యాగం చేసిన తీరుని ఇందులో కండ్లు చెమర్చే విధంగా చిత్రించాడు. ఇట్లా ఒక్క పోయెమ్ అయినప్పటికీ అద్భుతంగా చిత్రించిన రొడ్డ సురేందర్‌ని పరిచయం చేసిండు.

ఇక పోతే ఇందులో ఆవుల పిచ్చయ్య తెలంగాణ పోరాట కథలు, దోరవేటి 'ఆచార్య దేవోభవ' ఉపాధ్యాయ కథలు, గడ్డం మోహన్ సొంతంగా రాసిన 'కొంగవాలు కత్తి', కడియం డేవిడ్‌తో కలిసి రాసిన 'అతడు అబ్రహం' నవలలు, రాపోలు సీతారామరాజు 'దక్షిణాఫ్రికా నానీలు', నల్లగొండ అన్నమయ్య శ్రీమన్మదుంబై పురుషోత్తమాచార్యులు రాసిన ఆధునిక పద్య కావ్యం 'రహస్య భూతము', రెబ్బ మల్లికార్జున్ పరిశోధక రచన 'విఠలాచార్య విఠ్ఠలేశ్వర శతకం', ఏనుగు నరసింహారెడ్డి 'ట్రాజెడి ఆఫ్ హైదరాబాద్' అనువాదం 'హైదరాబాద్ విషాదం', కన్నెగంటి వెంకటయ్య గజళ్లు, తండు సాయన్న దాసు 'తత్త్వాలు', పెరుమాళ్ళ దేవమ్మ 'ఉద్యోగ విరమణ ప్రత్యేక సంచిక', పాటల వాల్కెనో విమలక్క (సంపాదకుడు: మోతుకూరి శ్రీనివాస్), బెల్లి

యాదయ్య 'రెక్కల మనిషి' పేరిట రాసిన డ్రైవర్ జీవిత కథ, 'తీయని పలకరింపు' పేరిట గరిపల్లి అశోక్ తదితరుల పూనిక మేరకు వెలువడ్డ బాల కథా సంకలనం అన్నీ కూడా భిన్న ప్రక్రియల్లో వెలువడ్డాయి. ఇట్లా భిన్న ప్రక్రియల్లో వెలువడ్డ రచనలను సత్తయ్య సూక్ష్మమైన పరిశీలనతో, పరిశోధనతో విశ్లేషించిండు. ఇందులో మెజారిటీ రచయితలు టీచర్లు కావడం విశేషం. అట్లాగే సామాజికంగా దళిత, బహుజన కులాలకు చెందిన వారు. ఈ పుస్తకంలో 34 వ్యాసాలుంటే అందులో నాలుగైదు తప్ప మిగతావన్నీ దళిత బహుజనులు రాసినవి లేదా దళిత, బహుజన జీవితాలను చిత్రించినవి కావడం విశేషం.

ఈరోజుచాలా మంది కవులు రాస్తున్నారు. అక్కడక్కడా కథకులు, నవలాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. అయితే వాళ్లు రాసేది బంగారమా? రోల్డ్ గోల్డా? లేదా ఇనుమా? ఇంకేదన్ననా? అని తేల్చి చెప్పేది విమర్శకుడే! కవులు, రచయితల తొవ్వలో ఉన్న ముండ్లను ఏరేసి దారిని సుగమం చేసేవాడు విమర్శకుడు. ఆ పనిని చేపట్టడానికి చాలా మంది వెనుకాడుతారు. ఆ బాటలో అందరూ నడుస్తారు కానీ ఎవ్వరూ దారి వేసిన/చేసిన వారిని యాద్జేసుకోరు. అయినప్పటికీ సాగర్ల సత్తయ్య అవసరమైన దారి ముఖ్యంగా బహుజనులకు అత్యావశ్యకమైన దారిని ఎంచుకున్నందుకు అభినందనలు.

ఈ పుస్తకానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇందులోని దాదాపు అన్ని రచనలూ ఉమ్మడి నల్లగొండ జిల్లా రచయితలకు సంబంధించినవి. కాళోజి, సిద్దెంకి యాదగిరి, దోరవేటి, కన్నెగంటి, నందిపాటి సుబ్బారావు, సురేంద్రరొడ్డ మినహా దాదాపు అందరూ ఒకప్పటి నల్లగొండ జిల్లా వారే! తెలంగాణ రాష్ట్రం సాకారమైంది కాబట్టే జిల్లా స్థాయి కవి/రచయితలను పట్టించుకోగలుగుతున్నాము. ఈ పట్టింపు మరింత మంది విమర్శకులకు మార్గదర్శం కావాలి.

ఒక అవసరమైన పనిని, అవసరమైన సందర్భంలో ఆర్తితో చేస్తున్న బహుజన విమర్శకుడు సాగర్ల సత్తయ్యకు అభినందనలు. బహుముఖ ప్రక్రియల్లో విమర్శను రాస్తున్నందుకూ అభినందనలు. 'కుందెన'ను పూదిచ్చి మన ముందుకు తీసుకొస్తున్నందుకు, అందులో మెజారిటీగా దళిత, బహుజనుల రచనలపై విమర్శ చేసినందుకూ శనార్థులు. ఇక ముందు కూడా ఇదే పరంపరలో సత్తయ్య రువ్వడిగా ముందుకు సాగాలని కోరుకుంటున్న.

**– సంగిశెట్టి శ్రీనివాస్**

హైదరాబాద్
25, అక్టోబర్, 2019

# ఆశీరభినందనలు

**అ**ధ్యాపక వృత్తిలో కొనసాగేవారికి సమాజంతో ప్రత్యక్ష సంబంధం అనివార్యమవుతుంది. సమాజంలోని చర్యలకు మనసుని స్పందింపచేస్తే ఆ వ్యక్తి కవిగానో, రచయితగానో మారడం తథ్యం. అలా స్పందనలకు అక్షర రూపం ఇస్తూ కవిగా, రచయితగా రూపుదిద్దుకుంటున్న రూపమే సాగర్ల సత్తయ్య.

సాగర్ల సత్తయ్య నా వద్ద "దోరవేటి సమగ్ర సాహిత్యం - అధ్యయనం" అనే అంశంపై పి.హెచ్.డి పరిశోధన చేస్తున్న పరిశోధక మిత్రుడు. ఇంతకు మునుపే సాగర్ల కవి, విమర్శకుడు, అధ్యాపకుడు. ఈ పూర్వ జ్ఞానమే కాకతీయ విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన పి హెచ్ డి ఎంట్రెన్స్ టెస్ట్ లో టాప్ మెరిట్ లో సీటు సంపాదించేందుకు ఉపయోగపడిందని భావిస్తున్నా.

సాగర్ల నామధేయం సాగరం, అపరిమితం, అనంతం అనే అర్థాలను సూచిస్తుంది. ఇతనికి అనుభవైక జ్ఞానం ఈ రకంగా ఎదగడానికి దోహదం చేసింది. ఈ స్వయత్నం సాగర్ల విమర్శకుడిగా చేస్తున్న తొలి ప్రయత్నం. కుందెన శీర్షికలో 35 విమర్శ వ్యాసాలతో ఈ సంపుటం తీసుకురావడం అభినందించదగ్గ విషయం.

కుందెన పేరుని గాని, భౌతిక రూపాన్ని గాని నేటి తరంలో వినిన, వీక్షించినవారు అరుదు. ఆ అరుదును మినహాయించగా మిగిలిన వారందరికీ ఈ శీర్షికతోనే కొత్తదనాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నారు సాగర్ల. ఈ సంపుటిలో నల్లగొండ ఆణిముత్యాలను (మిగిలిన ప్రాంతం వారు ఉన్నప్పటికీ ఎక్కువగా నల్లగొండ వారే ఉన్నారు) సాహితీలోకానికి తన విమర్శ ద్వారా మరోసారి పలకరించడం ఈ సంపుటిలో చూస్తాం. ఇందులో కొత్త వారి పరిచయం కూడా గమనించవచ్చు.

నేను "తెలంగాణ తెలుగు కథావికాసం" శీర్షిక పై యూజీసీ న్యూ ఢిల్లీ వారి సహకారంతో మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు చేస్తున్నప్పుడు నల్లగొండ జిల్లా కథా రచయితలు అందరినీ గ్రంథస్థం చేశాను. దాదాపుగా వారందరి పేర్లు ఈ సంపుటిలో కనపడతాయి. కొంతమంది కొత్త రచయితలను కూడా ఈ వ్యాస సంపుటిలో చూడవచ్చు. ఇది విమర్శకుడి సునిశిత పరిశోధనకు మచ్చుతునక. ఇందులో దాదాపుగా ప్రతి వ్యాసం ఒక ఆంగ్ల కొటేషన్ తో మొదలవడం గమనార్హం. బాల సాహిత్యం, శతక సాహిత్యం, జానపదం, ఆధ్యాత్మిక తత్వ గీతాలు, బడుగుల జనజీవితం, సామాజిక రుగ్మతలు, స్త్రీవాదం, గ్రంథాలయ నేపథ్యం, మానవీయ విలువలు, సామాజిక చైతన్యం, తెలుగు భాష, గజల్లు,

హైదరాబాద్ విషాదచరిత్ర, రుధిరాక్షరాల అక్షర తేజం కాళోజి , బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి విభిన్నమైన అంశాలు వేటికవే ప్రత్యేకతను కలిగి ఉండేటట్లు విమర్శ చేయడం రచయిత పదునైన సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం. ఇది విమర్శకుడి విస్తృత పరిధికి అద్దం పడుతుంది. అవసరమైన సమగ్రమైన వివరణ (గజల్స్, నానీలు) ఇవ్వడంతో పాటు తెలంగాణ యాసను కూడా ఇందులో చూడవచ్చు. దోరవేటికి సంబంధించిన రెండు వ్యాసాలు, పెండెం జగదీశ్వర్ నేపథ్యంలో రెండు వ్యాసాలు ఏక మాత్రేన వచ్చినప్పటికీ ఆక్షేపణీయం కాదు.

ఒక్కొక్క పువ్వును జతచేసి రంగురంగుల పూల బతుకమ్మను పేర్చినట్లు విభిన్నమైన అంశాలతో కుందెనను తయారు చేసినట్లుగా ఈ సంపుటిని పాఠకులు వీక్షించవచ్చు. సాగర్ల సాహితీ లోకంలో సప్రమాణత కలిగిన పరిశోధకుడిగా ఇంతింతై వటుడింతైన చందంగా ఎదగాలని మనస్ఫూర్తిగా అభిలషిస్తూ ఆశీరభినందనలతో...

**– డాక్టర్ వేలూరి శ్రీదేవి**

అసోసియేట్ ప్రొఫెసర్,

తెలుగు విభాగం,

కాకతీయ విశ్వవిద్యాలయం

# నల్లగొండ సాహితీ దర్పణం

**చు**ట్టూ ఉన్న చీకటిని తిడుతూ కూర్చునేవాళ్ళు కొందరు. ఆ చీకటిలో మౌనంగా చిరుదీపం వెలిగించేవాళ్లు మరికొందరు. రెండో కోవకు చెందిన సాహితీ సౌజన్యమూర్తి సాగర్ల సత్తయ్య.

పౌరుషానికి, పోరాటతత్వానికి, విద్యకు, విజ్ఞతకు, శ్రమ జీవనానికి, మిశ్రమ సాహితీరూపాలకు, సగర్వంగా తలెత్తుకుని నిలబడే కొండలాంటి జిల్లా నల్లగొండ. పూర్వపు నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రక్రియలలో విరాజిల్లిన/ విరాజిల్లుతున్న కొంత మంది సాహితీ కృషీవలతకు అద్దంపట్టిన పుస్తకం 'కుందెన'. మొత్తం 35 వ్యాసాలున్న ఈ పుస్తకంలో కొద్దిమంది మినహా అందరూ నల్లగొండకు చెందిన సాహితీవేత్తలే. వీరిలో ముందుతరాలకు సంబంధించిన ఆవుల పిచ్చయ్య, తండు సాయన్నదాసు మొదలు శివాజీ రవీందర్ వరకు, తత్వాలు మొదలుకొని అత్యాధునిక ప్రక్రియ మణిపూసలు వరకు వైవిధ్యభరితమైన వ్యాసాలున్నాయి.

ఏ వ్యాసానికైనా లోతైన పరిశీలన, వివేకవంతమైన విశ్లేషణ, సహజ సుందరమైన భాష, ధారాశుద్ధి, వన్నెతెస్తాయి. సాగర్ల సత్తయ్య వ్యాసాల్లో ఈ నాలుగు లక్షణాలకు తోడు 'సహృదయత' అనే పంచమ లక్షణం చేరి సనార్ద్రతనద్దినాయి. వ్యాసాల నిండా ఆత్మీయాభిమానం పరచుకుని, పఠితలను అతనికి, అతని సాహిత్యానికి అభిమానులుగా మారుస్తాయి.

ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ వివిధ పత్రికలలో అచ్చైనవే. అది వ్యాసాల స్థాయితో పాటు, వైవిధ్యతను, ఆదరణను చెప్పకనే చెబుతున్నది. దీంతోపాటు వ్యాసకర్తకు వివిధ ప్రక్రియల పట్ల గల అవగాహన, అభినివేశం అవగతమవుతున్నది. అంతేకాదు, ఈ పుస్తకంలోని సాహితీవేత్తలలో చాలామందితో ఆయనకున్న ఆత్మీయతానుబంధానికి అవి ప్రతీకలుగా నిలుస్తాయి.

నిరంతరధ్యయనం, అనుశీలనం, కృషి సాగర్లను సాహితీరంగంలో వజ్రంగా మారుస్తుండడం ముదావహం. దానికి తోడు వినయభూషణుడైన ఈ విద్వన్మణి ఎవరి హృదయాలనైనా ఇట్టే జయించగల దిట్ట. అందుకే సిద్ధాంతాలకు– సంప్రదాయాలకు

– తిరుగుబాటుకు – పోరాటానికి – తత్వానికి – వ్యక్తిత్వానికి – సమాజానికి – కట్టుబాట్లకు – భక్తికి – అభ్యుదయ రక్తికి – భాషకు – కవిత్వానికి – బాలసాహిత్యానికి – ప్రౌఢ జీవనానికి – ప్రాచీన కవిత్వానికి – ఆధునిక ధోరణులకు సమప్రాధాన్యాన్నిచ్చి తామరాకు మీది నీటిబొట్టులా ఇజాల బేషజాలంటకుండా వస్తు, సాహిత్య విశ్లేషణ గావించినాడు. ఇది ఆయన గొప్ప విమర్శకుడుగా ఎదుగుతున్న వైనానికి సంకేతం.

తమ జిల్లాలోని పిల్లలు మొదలు పెద్దల వరకు (మరి కొందరు ఇతర జిల్లాలు – ప్రాంతాల వాళ్ళు ఉన్నారు) వాళ్లు చేస్తున్న సాహితీ వ్యవసాయానికి కర్మసాక్షిలా నిలిచి హంసలా మంచిని గ్రహించి మనకు అందించడం సత్తయ్య చేసిన కృషి. నిజానికి అతనికి సాహిత్యం విషయంలో ప్రాంతాలు, ప్రాంతీయతలు, కులాలు, వర్గాలు అనే పరిమితులు లేవు. యాదృచ్ఛికంగానే అయినా 80% స్థానిక జిల్లా(ల)కు సంబంధించినవి కావడంతో పాఠకులను ఆ కోణంలో ఆలోచించేటట్లు చేస్తాయి. ఏమైతేనేం ఇదీ ఒకందుకు మంచిదే. మరికొంత సమగ్ర ప్రయత్నం చేస్తే నల్లగొండ జిల్లా సాహిత్య సర్వస్వంగా 'కుందెన' రూపుదిద్దుకునే అవకాశమున్నది.

ఎత్తుగడ మొదలుకొని ముగింపుదాక పాఠకుడిని ఏకబిగిన చదివించగల మహత్తర శక్తి ఈ వ్యాసాలకున్నది. ఇందులో వ్యాసకర్త ప్రముఖుల అభిప్రాయాలకు తన ఆలోచనలను జోడించి సవ్యదృష్టితో సాహిత్యాన్ని అవలోకించడం ప్రయోజన కరమన్న 'సత్యాన్ని' చెప్పకనే చెప్పినాడు.

'యద్భావం – తద్భవతి' అన్నట్లు చూసే దృష్టిని బట్టే సృష్టి గోచరిస్తుంది. కుందెనలో ఉన్నది సవ్య దృష్టి మాత్రమే కాదు. ఇది సమ్య దృష్టి. ఈ దృష్టే కవిని గానీ మానవుడ్ని గాని మహోన్నత శిఖరాలకు చేరుస్తుంది. ఆ మహాప్రస్థానానికి ఈ గ్రంథం నాందీ వాచకం కావాలని మన:పూర్వకంగా కోరుకుంటూ సత్తన్న లేఖిని నుండి వైవిధ్యభరితమైన రచనలకు మనసు పడుతూ...

హైదరాబాద్ ప్రేమతో...
1.10.2019 **దోరవేటి**

# మేలిమి సాహిత్య వ్యాసాల 'కుందెన'

ఒక రచనపై రాసే విమర్శావ్యాసం ఆ సదరు రచయిత ఉనికిని తెలియజేస్తుంది. ఆ రచనను చదవాలనే కోరికను కలగజేస్తుంది. సాహిత్యావగాహనను పెంచడమే విమర్శ ఉద్దేశ్యం. విమర్శకులు ఎక్కువగా ప్రాచుర్యం పొందిన రచనలనే విశ్లేషిస్తూ ఉంటారు. ప్రసిద్ధికి రాని రచనలను కూడా విశ్లేషించి తగిన గుర్తింపునివ్వడం విమర్శకుల బాధ్యత.

విశ్వజనీన భావం అనేది అమాంతంగా ఊడిపడేది కాదు. ప్రాదేశిక జ్ఞానం, ప్రాంతీయాభిమానం నిండుగా కలిగి ఉన్నప్పుడు మనసు మెల్లగా ప్రపంచం వైపు మళ్ళుతుంది. తన ప్రాంతంపై అభిమానం, తన సామాజిక నేపథ్యం బాగా తెలిసినవారే అక్కడి సాహిత్యకారులపై మరింత స్పష్టమైన అభిప్రాయాల్ని వెలిబుచ్చగలుగుతారు. ఒక కవి తాలూకు వ్యక్తిగత జీవిత విశేషాలు తెలిసినప్పుడు, ఆ కవి కవిత్వంపై మరింత చక్కని విశ్లేషణ చేయగలిగే అవకాశం ఉంటుంది. అయితే విమర్శలో కవి కాకుండా కవిత మాత్రమే ముఖ్యమన్న ప్రాథమిక సూత్రం మరువరానిది. ఈ రెండు లక్షణాలను పుణికిపుచ్చుకొని తన విమర్శా వ్యాసాలను ఒక సంపుటిగా చేసి 'కుందెన'తో మన ముందుకొస్తున్నాడు సాగర్ల సత్తయ్య.

సాహిత్యచరిత్రను భద్రపరచుకోవడంలో మనమెప్పుడూ అలసత్వంతోనే ఉన్నామని చెప్పుకోవాలి. ఆ క్రమంలో ఎంతో విలువైన సాహిత్యాన్ని కోల్పోయాం. సాహిత్యకారుల విశేషాలను కోల్పోయాం. అంతేకాకుండా వివిధ కారణాలవాల్ల ఎందరో సాహిత్యకారులు వెలుగులోకి రాకుండానే కనుమరుగయ్యారు. విస్మృతికి లోనయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాక ఎందరో పండితులు, పరిశోధకులు, కవులు, రచయితలు ఆ లోటును భర్తీ చేయడానికి కృషి చేస్తున్నారు. ఇంకా మరెంతో జరగాలి. ఆ కృషీవలుర వరసలోకి సాగర్ల సత్తయ్యని చేర్చవచ్చు. తెలంగాణపై అందునా తన ప్రాంతంపై విపరీతమైన అభిమానమున్న సత్తయ్య తన సమీప ప్రాంతంలోని సాహిత్యకారులపైనే దృష్టిపెట్టి వారి రచనలను లోకానికి ఎరుకపరిచే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలోని భాగమే ఈ 'కుందెన' వ్యాససంపుటి.

35 సాహిత్యవ్యాసాల సంపుటిది. కవిత్వం, కథ, చరిత్ర, జీవితచరిత్ర, బాలసాహిత్యం, నవల, తత్వాలు మొదలగు విభిన్న ప్రక్రియలపై వచ్చిన పుస్తకాలపై లేదా ఆయా సాహిత్యకారులపై రాసిన విమర్శావ్యాసాలు ఇందులో ఉన్నాయి. అయితే ఈ సంపుటిలో అగ్రస్థానాన్ని అలంకరించింది మాత్రం కవిత్వం మీద రాసిన వ్యాసాలే. ముందే అనుకున్నట్లు ప్రసిద్ధిలోకి రాని సాహిత్యకారులు, వారి సాహిత్యం మీద రాసిన వ్యాసాలు ఎక్కువ ఉండడంవల్ల విమర్శకుడికి కేవలం విమర్శనాత్మక దృక్పథం ఉంటే సరిపోదు. పరిశోధనా దృక్పథమూ అవసరం. ఈ రెంటికి తోడు తనదైన తాత్విక దృక్పథమూ ఉండాలి. వీటన్నిటిలో ఈ విమర్శకుడు కృతకృత్యుడయ్యాడనే చెప్పాలి. తనకున్న వనరుల పరిమితికి లోబడి వీలైనంత సమాచారాన్ని రాబట్టి, విశ్లేషించి పఠితకు అందంగా అందజేశాడు.

మొదటి వ్యాసమే తన గ్రామానికి చెందిన కవి రావిరాల బుచ్చయ్య గురించి రాశాడు. అతని కవిత్వాన్ని విశ్లేషిస్తూనే అతని జీవితగమనాన్ని సైతం లీలామాత్రంగా దర్శింపజేస్తాడు. దానివల్ల ఆ గ్రామ పరిసర ప్రాంతవాసులు లేదా ఆ జిల్లావాసులు వ్యాసంలో లీనమై తద్వారా కవి ప్రతిభని తెలుసుకుంటూ ఉత్తేజపూరితలవుతారు. ఈ పంథా చాలా వ్యాసాల్లో కొనసాగింది. ఈ సంపుటిలో విమర్శకుడు విమర్శ చేసిన ఎక్కువ మంది రచయితలు అంతగా ప్రాచుర్యంలో లేకపోవడంవల్ల, వాళ్ళకి ప్రాచుర్యం కల్పించే మంచికార్యంలో ఈ రకమైన విశ్లేషణా పద్ధతి చాలా బాగుంది.

ఈ వ్యాససంపుటిని తరచి చూస్తే సత్తయ్యకి కేవలం సాహిత్యావగాహన, సాహిత్యపరిశీలనతో పాటు పరిశోధన చేయాల్సిన అవసరం కూడా ఏర్పడిందనిపిస్తుంది. ఉదాహరణకు 'జానపదుల సాహితీపరిమళం మందెచ్చుల సాహిత్యం'. యాదవుల ఆశ్రితకులమైన మందెచ్చుల జీవనవిధానం, వారి (జానపద) సాహిత్యాన్ని కూలంకషంగా విశ్లేషించిన తీరు విజ్ఞానదాయకంగా ఉంది. ఇదే కోవకు చెందిన మరో వ్యాసం 'తెలంగాణ వైతాళికుడు షబ్నవీసు'. తెలంగాణ తొలితరం పత్రిక 'నీలగిరి' కొద్దిమందికే తెలుసు. అది స్థాపించిన మహనీయుడు 'షబ్నవీసు వెంకటరామ నర్సింహారావు' అని బహుకొద్దిమందికే తెలుసు. ఇలాంటి సమయంలో ఆ మహనీయుని సేవాతత్పరతను, గ్రంథాలయోద్యమ రూపంలో, పత్రికారూపంలో తెలుగుభాషావ్యాప్తికి, సంఘసంస్కరణకు కృషి చేసిన తీరును విశ్లేంచిన అరుదైన వ్యాసమిది. షబ్నవీసు చరిత్ర పదిమందికి తెలియాలని రాసిన ఈ వ్యాసం ఆ వైతాళికుడికి అర్పించిన ఘనమైన నివాళి.

కథాసంపుటులను, నవలని విశ్లేషిస్తున్నప్పుడు అవి పఠితలు ఏ కోణంలో అర్థం చేసుకోవచ్చో, జీవితానికి ఎలా అన్వయించుకోవచ్చో చెప్పిన విధానం బాగుంది. సత్తయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయుడవడం వల్లేమో బాలసాహిత్యకారులు, వారి రచనలని విశ్లేషిస్తున్నప్పుడు అరటిపండు ఒలిచి పెట్టిన చందంగా సాగింది.

'తెలంగాణ తొలితరం కథకుడు ఆవులపిచ్చయ్య' వ్యాసంలో ఆవుల పిచ్చయ్యని స్మరించడమే కాకుండా ఆయన కథలు అప్పటి తెలంగాణ జనజీవితాన్ని ఎలా ప్రతిఫలింపజేశాయో వివరంగా విశ్లేషించాడు సత్తయ్య.

ఒక అంశానికే కట్టుబడిఉన్న రచనలు కాకుండా వస్తువైవిధ్యం ఉన్న రచనలను తన విమర్శకు వస్తువులుగా తీసుకోవడం సత్తయ్యలోని ప్రత్యేకత. తమ వ్యాసాల ద్వారా విస్మృత సాహిత్యకారులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయాలనుకునేవారికి సత్తయ్య 'కుందెన' ఒక దిక్సూచిలాంటిది.

**– రాపోలు సీతారామరాజు**

జోహానెస్‌బర్గ్,
దక్షిణాఫ్రికా
10.10.2019

# కృతజ్ఞతలు

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు...

నేను సాహితీ విమర్శ వైపు వెళ్లడానికి పీజీ లోనే పునాదులు వేసి విమర్శ రంగంలోకి ఆహ్వానం అంటూ ఆశీర్వదించిన మా గురువు, ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకులు, చరిత్రకారులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి గారికి...

అవసరమైన సందర్భంలో అందివచ్చిన విమర్శకుడిగా నన్ను అభినందిస్తూ ఎంతో విలువైన ముందుమాటను అందించిన ప్రముఖ పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ గారికి...

కాకతీయ విశ్వవిద్యాలయంలో నా పిహెచ్.డి పరిశోధనకు గైడ్‌గా నన్ను వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న మా గురువు డాక్టర్ వేలూరి శ్రీదేవి గారికి...

నల్లగొండ సాహితీ దర్పణం అంటూ ముందుమాట రూపంలో ఆశీస్సులను అందివ్వడమే కాకుండా, నా రచనా వ్యాసంగాన్ని ఎంతగానో ప్రోత్సహించే అన్నయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, అభినవ దాశరథి దోరవేటి గారికి...

ముఖ పరిచయం లేకపోయినా, సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమై, నా వ్యాసాలను ఆసాంతం చదివి, ఎంతో ఓపికగా సవరణలు చేసి, తుదిరూపం ఇచ్చి, 'మేలిమి వ్యాసాల కుందెన' పేరిట చక్కని ముందుమాటను అందించిన కవి, విమర్శకులు శ్రీ రాపోలు సీతారామరాజు (దక్షిణాఫ్రికా) గారికి...

ఎల్లప్పుడూ విద్యార్థుల ఉన్నతికి తపించే ఆదర్శ ఉపాధ్యాయులు, పాఠశాల స్థాయి నుండి నేటి దాకా నాకు మార్గదర్శనం చేస్తున్న గురువులు, ఈ పుస్తకాన్ని స్వీకరించడానికి దయతో అంగీకరించిన శ్రీ కొండకింది అంజిరెడ్డి గారికి...

ఈ వ్యాసాలను సెల్‌ఫోన్‌లో టైప్ చేయడానికి నాతో సమానంగా శ్రమించిన నా జీవన సహచరి ధనలక్ష్మికి...

నిర్మొహమాటంగా నా రచనల్లోని తప్పొప్పులను ఎత్తిచూపే సద్విమర్శకురాలు, రచయిత్రి, సోదరి శ్రీమతి ఉప్పల పద్మకు...

ఈ పుస్తకంలో నేను సమీక్షించిన పుస్తకాల రచయితలు, సంపాదకులు అందరికీ...

అనునిత్యం నన్ను ప్రోత్సహించే సాహితీవేత్తలు దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి, వేణు సంకోజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, దాసోజు జ్ఞానేశ్వర్, డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య,

ప్రముఖ చిత్రకారుడు బొల్లెద్దు కిశోర్‌కుమార్, మాదగాని శంకరయ్య, మునాసు వెంకట్, దొడ్డి రామమూర్తి, అష్టావధాని ఐతగోని వెంకటేశ్వర్లు, బండారు శంకర్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, కనకటి రామకృష్ణ గార్లకు...

చిట్యాల సాహితీవేత్తలు శ్రీ కందిమళ్ల రామిరెడ్డి, ఎల్లోజు బ్రహ్మచారి, పాటి మోహన్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుకుడాల గోవర్ధన్, పగిడిపాటి నరసింహ, తదితరులకు...

అహల్య సాహితీ సంగమం (హాలియా) కవులు శ్రీమతి సరిత నరేష్, రజియా, నయమా, శ్రీ కళా రామమూర్తి, నాగెల్లి సైదులు, ఇటుకుల సైదులు తదితరులు అందరికీ...

మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అబ్బిరెడ్డి వేమారెడ్డి, ఉపాధ్యాయ మిత్రులు గడ్డం శ్యాం ప్రసాద్, యం.డి. పాషా, పురం వెంకటయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, ఈగల లింగయ్య, దూసరి మధు, లింగాల శ్రీనివాస్, సుజాతలకు...

నా వ్యాసాలను ప్రచురించిన నవ తెలంగాణ, మన తెలంగాణ, నమస్తే తెలంగాణ, నేటి నిజం, ఆదాబ్ హైదరాబాద్ తదితర పత్రికల సంపాదకులకు...

ఈ గ్రంథానికి ఆర్థిక సహాయాన్ని అందించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారికి...

అందంగా కవర్ డిజైన్, పేజీ డిజైన్ చేసిన మిత్రులు డాక్టర్ జయప్రకాష్ గారికి...

ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించిన లేపాక్షి ప్రింటర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి...

శనార్థులు..!

**– సాగర్ల సత్తయ్య**

# విషయసూచిక


| | పుట |
|---|---|
| 1. సామాజిక చైతన్యశీలి – రావిరాల బుచ్చయ్య | 25 |
| 2. మానవీయ సంబంధాల పతాక 'అవని – అక్క – ఆకాశం' | 29 |
| 3. బడుగు జీవుల బతుకుపాఠం – సిద్దెంకి కవిత్వం | 32 |
| 4. జానపద సాహితీ పరిమళం మందెచ్చుల సాహిత్యం | 35 |
| 5. తెలంగాణ తొలితరం కథకుడు ఆవుల పిచ్చయ్య | 38 |
| 6. జనం గొంతుకకు అక్షర నీరాజనం | 40 |
| 7. సాహిత్య సవ్యసాచి దోరవేటి | 42 |
| 8. అతడు అబ్రహం | 44 |
| 9. దళిత చైతన్య ప్రవాహం రాధేయ కవిత్వం | 47 |
| 10. ఎల్లలు దాటిన తెలుగు సాహితీ సౌరభం 'దక్షిణాఫ్రికా నానీలు' | 49 |
| 11. గురువుల ఔన్నత్యాన్ని చాటే 'ఆచార్యదేవోభవ' | 52 |
| 12. చిందు బతుకుల జీవన చిత్రణ 'కొంగవాలు కత్తి' | 54 |
| 13. సామాజిక చైతన్య పతాక – కాళోజీ | 57 |
| 14. తెలుగు వెలిగేదెలా? | 60 |
| 15. బడుగు జీవుల బతుకు చిత్రణ భూతం ముత్యాలు సాహిత్యం | 63 |
| 16. కథల మాంత్రికుని 'గజ్జెల దయ్యం' | 66 |
| 17. బాబాసాహెబ్‌కు అక్షర మణిహారం | 68 |
| 18. ప్రజాపక్షం వహించే కన్నెగంటి గజళ్ళు | 70 |
| 19. సామాజిక చింతనాతత్త్వం 'కాగితపు పడవ' కవిత్వం | 73 |
| 20. మానవతా విలువల నిధి తండు సాయన్నదాసు | 76 |
| 21. బాలసాహిత్యంలో తెలంగాణ భాషా సౌందర్యం | 78 |
| 22. ఉప్పొంగిన భావలహరి 'అమరావతి' | 81 |
| 23. ఊరూరా గ్రంథాలయ ఉద్యమస్ఫూర్తి 'కూరెళ్ళ' | 84 |

24. సామాజిక తత్త్వం – మందపాటి కవిత్వం 87
25. చరిత్రకు సజీవ సాక్ష్యం – హైదరాబాద్ విషాదం 89
26. తెలంగాణ వైతాళికుడు షబ్నవీసు 91
27. సామాజిక రుగ్మతకు అక్షరచిత్రం 'రహస్య భూతము' 94
28. సప్రమాణ పరిశోధన గ్రంథం
'విరలాచార్య విఠ్ఠలేశ్వర శతకం' ఒక పరిశీలన 97
29. మానవతా పరిమళం కౌండిన్య కవిత్వం 99
30. జీవన విలువల సారం – సురేంద్ర కవిత్వం 103
31. అలుపెరగని ఉద్యమ కవి వేణు సంకోజు 107
32. తెలంగాణ గుండె చప్పుడు 'రణగీతం' 110
33. కష్టజీవికి అరుదైన గౌరవం 112
34. పిల్లల సృజనాత్మకతకు పట్టాభిషేకం 114
35. వినూత్న ఆలోచన 117
రచయిత పరిచయం 120

1

# సామాజిక చైతన్యశీలి - రావిరాల బుచ్చయ్య

"Poetry is the sister of sorrow. Every man that suffers and weeps is a poet; every tear is a verse, and every heart a poem" అని ఆండ్రీ మహాశయుడున్నట్లు, బాధను అనుభవించినవాడే కవి. బాధ నుండే కవిత్వం పుడుతుంది. బాధనుండి ఉబికివచ్చే ప్రతి కన్నీటి చుక్క కవిత్వమవుతుంది. బాధామయమైన వ్యక్తి హృదయమే పద్యమవుతుంది. చలం అన్నట్లు ప్రపంచపు బాధను తన బాధగా భావించి కవిత్వం రాసినవాడు శ్రీశ్రీ. తరువాత శ్రీశ్రీ బాటలో నడుస్తూ పీడిత ప్రజల పక్షాన వకాల్తా పుచ్చుకొని ప్రజల బాధలకు గొంతుకనిచ్చిన కవులు విప్లవ, అభ్యుదయ కవులు. ఈ కోవలోని వారే నల్లగొండ జిల్లా వట్టిమర్తి గ్రామానికి చెందిన రావిరాల బుచ్చయ్య. అభ్యుదయ భావాల పురిటిగడ్డ అయిన వట్టిమర్తి ఆది నుండి కమ్యూనిస్టులకు కంచుకోట. కమ్యూనిస్టు కురువృద్ధుడు, ప్రజానేత నర్రా రాఘవరెడ్డి జన్మస్థలం. రావిరాల బుచ్చయ్య తాను పుట్టి పెరిగిన గ్రామ పరిసర ప్రభావం చేత సహజంగానే కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారు. రాఘవరెడ్డి గారి మార్గదర్శనం తోడయింది. గ్రామంలో 1960 లోనే ప్రారంభించబడిన గ్రంథాలయం ఆకర్షించింది. చారిత్రక భౌతికవాదాన్ని, వర్గ చైతన్యాన్ని చిన్ననాడే నూరిపోసింది. మార్క్సిం గోర్కి 'అమ్మ', టాల్‌స్టాయ్ 'యుద్ధం-శాంతి' వంటి గ్రంథాలు ఈ గ్రంథాలయంలోనే చదువుకున్నారు. బాల్యం నుండి సామాజిక దృక్పథాన్ని అలవర్చుకున్న బుచ్చయ్య తన 12వ ఏటనే కలం పట్టారు. వట్టిమర్తి సమీప గ్రామమైన నేరడలో కామ్రేడ్ మర్రి ఎట్టారెడ్డిని కాంగ్రెస్ వారు హత్య చేసినప్పుడు ఎట్టారెడ్డిపై తొలి ఎలిజీ రాశారు. ఇది వారి తొలి రచన. ఆ రోజుల్లో ప్రముఖ అభ్యుదయ కవి కాంచనపల్లి చిన వెంకటరామారావు తరచుగా వట్టిమర్తికి వస్తుండేవారు. వారి ఉపన్యాసాలు రావిరాల బుచ్చయ్యపై బలమైన ముద్రవేశాయి. తన అన్న రావిరాల గోపాల్, గ్రామ సర్పంచ్ నర్రా రాఘవరెడ్డిల ప్రోత్సాహం సాహిత్యరంగంలో ముందుకు నడిపింది. రావిరాల బుచ్చయ్యకు సాహిత్యంతో పాటు నటనా రంగంలోనూ ఆసక్తి మెండు. తన చిన్ననాడే గ్రామంలో ఆడే వీధి భాగవతంలో చిన్ని కృష్ణుడి వేషం వేశారు. సత్యహరిశ్చంద్ర

నాటకంలో 'లోహితుడు'గా పద్యాలు ఆలపించి పలువురి మన్ననలు పొందారు. ఈ ప్రోత్సాహమే తాను జీవితంలో మంచి నటుడిగా ఎదుగుదలకు కారణమయిందంటారతను. నల్లగొండ కమ్యూనిస్టు కార్యాలయంలో ఉంటూ హైస్కూలు విద్యనభ్యసించిన బుచ్చయ్య ఉన్నత చదువుల కోసం హనుమకొండ బాటపట్టారు. తన అన్న గోపాల్ పర్యవేక్షణలో హనుమకొండలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. హనుమకొండలో ఉన్నప్పుడు తన అన్న బహుమతిగా ఇచ్చిన మహాప్రస్థానం, త్వమేవాహం తదితర గ్రంథాలు అధ్యయనం చేశారు. హనుమకొండలోనే కాళోజి అధ్యక్షతన జరిగిన ఒక కవిసమ్మేళనంలో తొలిసారిగా కవిత చదివారు. ఆ రోజుల్లో మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగే సాహిత్య కార్యక్రమాల వైపు క్రమంగా ఆకర్షితులయ్యారు. ఈ సమావేశాల ద్వారానే వరవరరావు, కోవెల సుప్రసన్నాచార్య, బిరుదురాజు రామరాజు, అనుముల కృష్ణమూర్తి, గజ్జల దక్షిణామూర్తి తదితర ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. హనుమకొండ కళాశాల వార్షికోత్సవాలకు దాశరధి, శ్రీశ్రీ తదితర పెద్దలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఓరుగల్లు సాహితీ స్నేహమే బుచ్చయ్య విప్లవ సాహిత్యం వైపు మొగ్గడానికి కారణం అని చెప్పవచ్చు. 1970లో ఖమ్మంలో జరిగిన విరసం ప్రథమ మహాసభలో ప్రతినిధిగా పాల్గొని విరసం సభ్యుడయ్యారు. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాట నేపథ్యంలో వెలువడిన 'సమరం', 'సమర పదే బంగ్లా' తదితర సంకలనాల్లో తన కవిత్వాన్ని ప్రకటించారు. రాజేశ్వరరావు సంపాదకత్వంలో వెలువడిన 'ఓరుగల్లు' పక్ష పత్రికకు ఒక సంవత్సరం పాటు ఉప సంపాదకుడిగా సేవలందించారు. 1974లో 'విముక్తి పథంలో' కవితా సంపుటిని వెలువరించారు. చైతన్య సమాఖ్య నల్లగొండ ద్వారా వెలుగుచూసిన ఈ కవితా సంపుటి ఆ రోజుల్లో సంచలనానికి కేంద్రబిందువు అయ్యింది. అద్భుతమైన అభివ్యక్తితో ఈ సంపుటిలోని కవితలు ఆలోచింపచేశాయి. 'బిగించిన పిడికిట్లో' అనే కవితలో "ఆకలితో అల్లాడే నన్ను / సాయంత్రం నీరెండలు పబ్లిక్ పార్కుల పచ్చదానాలు/ అమ్మాయిల అందచందాలు మల్లెపూల సౌరభాలు చూసి / ఆనందించమంటారేం?" అంటూ భౌతికమైన అందచందాలు కాదని ప్రజల బాధలు కవితా వస్తువులు కావాలని ఆకాంక్షిస్తారు. "ఈ నా బిగించిన పిడికిట్లో / నా వెనుక ఎన్ని తరాల / బానిసత్వంలో నలిగిన / బడబానలముందో" అంటూ ఆవేదన చెందుతారు. 'లావానై' అనే కవితలో "దగాకోరులు సృష్టించిన / గాడాంధకారంలో కొవ్వొత్తినై / కరుగుతూ వెలుగుతూ వెలిగిస్తాను"

అంటూ కవి కర్తవ్యాన్ని గుర్తు చేస్తారు. "సామ్రాజ్యవాద గుట్టలో / కసితో మసిలే లావానై ప్రవహిస్తూ" అంటూ ఆనాటి సామాజిక పరిస్థితులను చూసి రగిలిపోయిన కవి హృదయాన్ని ఆవిష్కరిస్తారు. 'అరుణోదయం' అనే కవితలో "ఈ చీకటి వ్యవస్థ కూకటివేళ్లతో / కుప్పలుగా కూలిపోతుంది / తెప్పలుగా పడిపోతుంది / అరుణోదయం ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది" అంటూ భావి సమాజం పట్ల ఆశావహ దృక్పథాన్ని కనబరుస్తారు. 'ప్రగతి పథంలో' అనే కవితలో "చంద్రమండలంలో మనిషి / నివాసం ఏర్పరచడానికి యత్నం /... పొరుగు దేశాలు ప్రగతిపథంలో /రాకెట్‌లా దూసుకుపోతుంటే / మరనాగళ్లు చూడనివాళ్ళున్నారే / అంటరానితనం లేదంటూ/ ప్రత్యేక వాడలు నిర్మిస్తున్నారే" అంటూ తిరోగమన భారతాన్ని చూసి ఆవేదన చెందుతారు. ఈ విధంగా బలమైన అభివ్యక్తితో సామాజిక చింతనతో గొప్ప శిల్ప శ్రద్ధతో రావిరాల బుచ్చయ్య గారి కవిత్వం పాఠకులను ఆలోచింపచేసేదిగా ఉన్నది. రావిరాల బుచ్చయ్య కవిగానే కాక రచయితగా గొప్ప కథలను సాహిత్యలోకానికి అందించారు. వీరు రాసిన 'ఒకనాటి బాగోతం', 'పాడి గేదె', 'గువ్వలచెన్న', 'ఆమె నవ్వు', 'జోస్యం' తదితర కథలు వివిధ ప్రముఖ పత్రికలలో అచ్చు అయినాయి. వీరి 'గువ్వల చెన్న'ను నాటకంగా మార్చి అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అభ్యుదయ పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'పాడి గేదె' ప్రథమ బహుమతిని పొందింది. రావిరాల బుచ్చయ్య గారిలో మరో కోణం నటన. నటుడిగా 'అఖండ దీపం', 'ఆగమనం', 'తూర్పు పడమర' తదితర టీవీ సీరియల్స్‌లో నటించారు. 'నీదిరో – ఆర్టీసీ మనదిరో' అనే టీవీ నాటకంలో నటించారు. 'అఖండ దీపం' సీరియల్‌కు 23 ఎపిసోడ్స్‌కు మాటలు రాశారు. తెలంగాణ మాండలికం అద్భుతంగా పండించగల బుచ్చయ్య ఆనాటి సీరియల్‌లో తెలంగాణ మాండలికంలోనే తన సంభాషణలు చెప్పి మెప్పించారు. 'ఆర్టీసీ బస్సు' అనే వీధి నాటకాన్ని రాసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దాదాపు 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. విరసం, అరసం తదితర సంస్థలలో పనిచేస్తూ కవిగా, కథకుడిగా, నటుడిగానే కాక ఒక నవలను కూడా రాశారు. ఇది అముద్రితం. బుచ్చయ్య రాసిన నవల 'చిందు రామక్క'. ఈ నవలలో 1960 నాటి నల్లగొండ గ్రామీణ వాతావరణాన్ని అత్యంత సహజసుందరంగా చిత్రించారు. నాటి చిందు కళాకారులలో మహిళలను దేవదాసీలుగా మార్చిన వైనం, పటేల్ పట్వారీల దుర్మార్గాలు కళ్ళకుకట్టినట్లుగా ఆ నవలలో ఉన్నాయి. ఇప్పటికైనా ఈ నవల అచ్చులో వెలుగు చూడవలసిన అవసరం ఉన్నది. ప్రచారానికి ఆమడ దూరంగా ఉండే బుచ్చయ్య నేటి సాహితీలోకంలో ఎదిగిన

కొద్దీ ఒదిగి ఉండే వినమ్రుడుగా కనిపిస్తాడు. వీరి కృషిని గుర్తించి మారోజు శంకరాచారి, చల్లగాలి వెంకటరాజు ఇటీవల వెలువరించిన తెలంగాణ పౌరాణిక, పద్య నాటక, నటరత్నాలు అనే సంకలనంలో వీరిని గురించి చక్కని వ్యాసం రాశారు. కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, నాటకకర్తగా, రంగస్థల నటుడిగా, టీవీ ఆర్టిస్టుగా బహుముఖ ప్రజ్ఞావంతుడు అయిన ఈ సాహితీవేత్తను నల్లగొండ సాహిత్యకారులు విస్మరించడం ఒకింత విస్మయాన్ని కలిగిస్తోంది. ఎట్టకేలకు వీరి సాహిత్య కృషిని జన్మభూమి వట్టిమర్తి గుర్తించింది. వట్టిమర్తి ఉద్యోగుల సంఘం ఇటీవల ఘనంగా సత్కరించింది. రావిరాల బుచ్చయ్య కథా సంపుటి, నవల త్వరగా ముద్రణ రూపం దాల్చాలని ఆకాంక్షిద్దాం. వీరి కలం నుండి మరిన్ని రచనలు వెలువడాలని ఆశిద్దాం.

**09.05.2018 అంకురం**

**నవ తెంగాణ**

2

# మానవీయ సంబంధాల పతాక
# 'అవని - అక్క - ఆకాశం'

**స**మున్నత వ్యక్తిత్వం, పరోపకారశీలత, త్యాగగుణం, సంకల్పం, కార్యశీలత మనిషిని మనీషిగా మారుస్తాయి. అక్షర జ్ఞానానికి అందనంత దూరంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన వ్యక్తి కష్టాల సుడిగుండాలను లెక్కచేయకుండా ఎదురీదుతూ కుటుంబంతో పాటు తన తమ్ముళ్లను, చెల్లెళ్ళను ఉన్నతస్థాయికి తీసుకురావడానికి పడిన శ్రమ మాటలకందనిది. అటువంటి త్యాగశీలి అక్క స్ఫూర్తిగాథ 'అవని - అక్క - ఆకాశం'. ఈ శీర్షికలోనే సంచిక స్వరూపం ఇనుమడింపబడింది. భూదేవి అంతటి సహనంతో ఆకాశమంతటి ఉన్నతంగా ఎదిగిన అక్క జీవితమది. ఇటీవల పదవీ విరమణ పొందిన శ్రీమతి పెరుమాళ్ల దేవమ్మ గారి ఉద్యోగ విరమణ విశేష సంచిక 'అవని - అక్క - ఆకాశం'. ఈ సంచికకు గౌరవ సలహాదారులు ప్రముఖ కవి, రచయిత వేణు సంకోజు. డా. తండు కృష్ణ కౌండిన్య, దాసోజు జ్ఞానేశ్వర్, సాగర్ల సత్తయ్య సంపాదకులుగా వ్యవహరించారు. సంచిక కన్వీనర్ పెరుమాళ్ల ఆనంద్. 'అవని - అక్క - ఆకాశం'లో కేవలం దేవమ్మ గారి జీవితమే కాకుండా విశ్వజనీనమైన అక్క, కుటుంబ సంబంధాలు అనే భావనలతో కూడిన కవిత్వం, వ్యాసాలు ఉన్నాయి. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య రాసిన 'ఆదర్శమూర్తికి అభినందనలు' అనే ముందుమాట సంచిక నేపథ్యాన్ని చక్కగా ఆవిష్కరించింది. పెరుమాళ్ళ ఆనంద్ రాసిన వ్యాసం 'మా ఊరు - మేము - మా అక్క'లో 1960ల నాటి సూర్యాపేట, ఎర్రపాడు, పాతర్లపాడు గ్రామాల స్థితిగతులు, చదువుకోవడానికి ఆనాడున్న ఇబ్బందులు, నాటి గ్రామీణ సమాజంలో దొరస్వామ్యం, కూటికి కరువైన దీనస్థితులు కళ్లకుకట్టినట్టున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నాలుగు దశాబ్దాల క్రితం చరిత్రను రికార్డు చేసిన సంచిక ఇది. పెద్ద చదువులు చదవకపోయినా 'ప్రియమైన అక్కకు' అనే వ్యాసం రాసిన నామ జయమ్మ తన హృదయాన్ని ఆవిష్కరించినట్టున్నది. కుటుంబ సంబంధాలు, అక్క చెల్లెళ్ళ అనుబంధం, తండ్రిని కోల్పోయిన కుటుంబం దీనస్థితి పాఠకులకు కన్నీరు తెప్పించేటంతటి ఆర్ద్రమైన శైలిలో రాసింది. కోదాటి రమేష్, మాధవిల వ్యాసాలు ఈ

గ్రంథానికి వన్నె తెచ్చేవే. ఈ సంచికలో కుటుంబ సంబంధం, అక్క త్యాగశీలత ఇతివృత్తంగా 14 కవితలకు చోటు కల్పించారు. తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే గొప్ప కవిత్వం ఇందులో ఉంది. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య 'ఒక భరోసా' అనే కవితలో అక్కను తల్లికి బాసటగా, తండ్రికి ఊరటగా వ్యాఖ్యానిస్తూ "ఆమె అంటేనే తల్లిలా కొండంత నమ్మకం / ఆమె అంటేనే తండ్రిలా ఆకాశమంత సంబరం / ఆమె అంటేనే అమ్మానాన్నలకు ఒక భరోసా" అంటారు. అక్క తమ్ముళ్ళ కోసం తన చదువును, జీవితాన్ని త్యాగం చేయడం నేటికిని పేద కుటుంబాల్లో చూస్తున్నాం. అందుకే బోధనం నర్సిరెడ్డి 'అక్క మాయమ్మ' అనే కవితలో అక్క తనను కాలికి మన్నంటకుంట పెంచింది అంటారు. వీపు మీద ఉప్పుకట్ట మోసిన జ్ఞాపకాన్ని తలుచుకుంటారు. "మనం జర బుద్దిగా చూసుకుంటే / అమ్మ రుణం గింత తీరుతుందేమో గాని అక్క రుణం తీరనిది / అన్నీ తానై అక్క మా అమ్మయింది".

అక్క పెళ్లి తర్వాత అత్తారింటికి వెళ్లడం సహజం. అయినా తన పుట్టిల్లుపై మమకారం రెట్టింపవుతుంది గాని తగ్గదు. ఇదే అంశాన్ని దాసోజు జ్ఞానేశ్వర్ తన 'పురిటిగది పరిమళాలు'లో "అక్కలదైన చెల్లెళ్లదైన పావురం గల్ల పుట్టుక / మెట్టినింటికి వెళ్లేటప్పుడు పుట్టినింటి దర్వాజకు / విప్పలేని ప్రేమ పాశం ముడేసి వెళ్తుంటరు" అని ఆడపడుచులకు అమ్మగారింటి పట్ల ఉండే మమకారాన్ని అద్భుతంగా అక్షరీకరించారు.

"అమ్మకు పర్యాయపదము / కమ్మని మనసున్న యట్టి కరుణామయివై / తమ్ముల గాచితి నిరతము / ఇమ్మహిలో నీవె నాకు ఇల వేల్పువుగా!" అంటూ సాగర్ల సత్తయ్య అక్కను ఇంటికి దేవతగా అభివర్ణించారు. ప్రవీణ్ రెడ్డి 'తొవ్వకు వెలుగు' అనే కవితలో అక్కను నిండు గౌరమ్మగా, ఇంటి బతుకమ్మగా ఇంట్లో కొలువైన శక్తి స్వరూపిణిగా కీర్తించారు. నిత్య సౌభాగ్యానికి చిహ్నం అక్క రూపం. "మా కంటి చూపు మా తొవ్వకు వెలుగు/ అక్కంటే పవిత్రమైన 'పసుపు కుంకుమ'" అంటూ మంగళప్రదాయినిగా అక్కను పేర్కొన్నారు. ఆనాటి కుటుంబ సంబంధాలు నేడు మృగ్యమౌతున్నాయని, మానవీయ సంబంధాలు కృత్రిమంగా మారుతున్నాయని 'కుటుంబం' కవితలో రాధారపు బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఏబూషి నరసింహ గారి 'మా ఇంటి మహామంత్రి' కవితలో భూమికి మొక్క ఎంతటి ప్రధానమైనదో ఇంటికి అక్క అంతటి స్థానాన్ని కలిగి ఉందంటారు.

"నిద్ర మెట్టినింటిలో అయినా / కలలన్ని పుట్టింటివే కంటుంది / మా ఇంటికి అమ్మానాన్న రాణి రాజు అయితే / మహామంత్రి మాత్రం మా అక్కే / అమ్మగారి ఇంటి

మీద అంత ప్రేమ ఎందుకంటే / మాయి ముంత సంబంధం మాయగదా అంటుంది". ఇలా అక్క ఔన్నత్యాన్ని సమున్నతంగా వ్యక్తీకరించారు. పెండెం జగదీశ్వర్ 'అక్క' కవితలో అలసిన మనసుకు సాంత్వన కూర్చే అమృతమూర్తిగా అభిప్రాయపడ్డారు. పాటి మోహన్ రెడ్డి 'గుండె విలపించిన వేళ' కవితలో తండ్రీ కూతుళ్ల అనురాగాన్ని ఆర్ద్రంగా వ్యక్తీకరించారు. హాస్టల్‌లో తన కూతురును విడిచి వచ్చే తండ్రి తన మనోగతాన్ని కరుణరసాత్మకంగా ఆవిష్కరించారు. "నిజానికి పాఠశాల హాస్టల్‌లో నేను వదిలి వచ్చింది నిన్ను కాదమ్మా / నా గుండెకు ప్రాణవాయువును అందించే ప్రధాన కవాటాన్ని" అంటూ తన కూతురు ఎడబాటు తన హృదయానికి కఠిన కారాగార శిక్షగా భావిస్తారు. పొక్కిలిపడ్డ వాకిళ్ళపై ఆత్మీయతా లేపనాన్ని అద్దే ఆధారం అక్క అంటూ మండల స్వామి 'రక్తసంబంధం' కవితలో తన అనుభూతిని వ్యక్తీకరించారు. ఇంకా సంతపురి నారాయణరావు, సహచరి, బాసరాజు యాదగిరిలు రాసిన కవితలు కుటుంబ సంబంధాలకు అక్క త్యాగబుద్ధికి నిలువెత్తు సాక్ష్యాలుగా ఉన్నాయి. 'అవని – అక్క – ఆకాశం' సంచికకి చక్కటి ముఖచిత్రాన్ని అందించారు ప్రముఖ చిత్రకారులు కళాశంకర్. అద్దంలో ప్రతిబింబంలా అత్యంత సహజంగా చక్కని చిత్రాన్ని అందించిన కళాశంకర్ అభినందనీయులు. తెలుగు సాహిత్యంలో నేటివరకు అమ్మపై, నాన్నపై అనేక సంపుటాలు, విశేషమైన కవిత్వం వచ్చింది. కానీ 'అక్క' అనే అంశంపై పుస్తకం రావడం బహుశా సాహితీ చరిత్రలో ఇదే ప్రథమం కావొచ్చు. ఇంతటి చక్కటి సంచికని రూపకల్పన చేసిన కన్వీనర్ పెరుమాళ్ళ ఆనంద్, వారి కుటుంబ సభ్యులు అభినందనీయులు. తెలుగు సాహితీ చరిత్రలో ఈ సంచిక చిరస్థాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షిద్దాం.

**06.09.2017 అంకురం**

**నవతెలంగాణ**

# 3

# బడుగు జీవుల బతుకు పాఠం - సిద్దెంకి కవిత్వం

"Poetry is the spontaneous over flow of powerful feelings"అని కవిత్వాన్ని నిర్వచించాడు వర్డ్స్‌వర్త్. తనలో కలిగిన భావావేశపు వెల్లువయే కవి కలం నుండి కవిత్వమై ప్రవహిస్తుంది. కవి తన అంతర్గత మానసిక చిత్రాన్ని, కోరికలను, భావాలను, పారవశ్యాన్ని, కల్లోలాన్ని ప్రతీకాత్మకంగా వ్యక్తీకరించేదే కవిత్వం. కవి తన సామాజికమైన ఆలోచనలను కవిత్వీకరించినప్పుడు ఆ కవిత్వం శాశ్వతత్వం పొందుతుంది. ఆధునిక వ్యవస్థ నిర్మాణం కోసం పీడిత కులాల పట్ల ఉన్న వివక్షను ప్రశ్నిస్తూ సామాజిక ఉద్యమం పునాదిగా రాసే కవిత్వం అజరామరం. ఒక సామాజిక స్పృహతో, నిబద్ధతతో ఇటువంటి కవిత్వాన్ని సృజిస్తున్న నికార్సైన తెలంగాణ కవి సిద్దెంకి యాదగిరి. బడిలో పిల్లలకు బతుకు పాఠాలు నేర్పుతున్న ఉపాధ్యాయుడు. అక్షరాయుధాల్ని బోధించి ఆత్మగౌరవ బీజాక్షర మంత్రాన్ని నిత్యం ఉపదేశించే గురువు. ప్రవృత్తి రీత్యా అక్షర కణాల్ని పిడికిట్లో బంధించి భూమ్మీద వెదజల్లుతున్న కవి, రచయిత. చెప్పులు ముడిచిన, మోట గొట్టిన, అంటరానితనం అంటగట్టబడిన కుటుంబం నుండి అక్షర పతాకమై లేచినవాడు. అందుకే యాదగిరన్న కవిత్వం నిండా నెనరు తొణికిసలాడుతుంది. తెలంగాణ ప్రపంచం కండ్ల ముందర కనబడుతుంది. అవ్వ ఆత్మీయతను, అనురాగాన్ని ఎవరెస్టు మీద నిలబెట్టిన కవిత 'మా అవ్వ కొంగు'. 'అవ్వకొంగు'ను తినుభండారాల చిరు భాండాగారంగా, పొర్లుతున్న దు:ఖానికి ఆనకట్టగా, సద్దుల గంపకింద సుట్ట బట్టగా, ఏడుపు మత్తడి దుంకినప్పుడు ఆత్మగల్ల చుట్టంగా, అన్ని కాలాల్లో తోడుగా, విసనకర్రగా, గాయానికి కట్టుగా వర్ణించడం కవికి తల్లిపట్ల గల మమకారాన్ని తెలియజేస్తుంది. ఈ కవితలోని ప్రతి వాక్యం ఒక భావచిత్రాన్ని పాఠకుల కళ్ళముందు ఉంచుతుంది. సిద్దెంకి యాదగిరి కవిత్వంలో ఓ సందేశం ఉంటుంది. వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసే మాటలు ఆయన కవిత్వంలో కోకొల్లలు. ఆత్మహత్యలు చేసుకోవడం పిరికితనం అని చెపుతూ "ఎంచుకున్న లక్ష్యం కోసం తెగించి కొట్లాడక సచ్చి సాధించేదేముంది? ఉన్నవాళ్లను కన్నీళ్ళలో చంపడం తప్పు" అంటూ ఆత్మహత్య చేసుకోవడం వివేకి లక్షణం కాదంటారు. "చెడు మెడలు

వంచడానికి / మంచితనం పంచడానికి / ఓటమితో గెలుపు జీవితం ప్రారంభించాలి" అంటూ సందేశం ఇస్తారు. కవిత్వంలో ప్రజల బాధలే తన మేనిఫెస్టోగా ప్రకటించుకున్న ధీశాలి సిద్దెంకి. జనమే ఎజెండాగా, సమానత్వమే మాగ్నాకార్టాగా, అక్షరాల న్యాయ సమరంలో అహర్నిశలు పరిభ్రమిస్తూ, అసమానతలపై అక్షరాల పంజా ఎత్తి అజ్ఞానంపై అక్షర దాడి చేస్తున్న అక్షర యోధుడు. ఊపిరి ఉన్నంతవరకు అక్షరాలే జీవితంగా ప్రకటిస్తున్నాడు. స్త్రీ అబల కాదు సబల అని ధైర్యంతో అన్ని పరిస్థితులను ఎదుర్కోవాలనే ఆత్మస్థైర్యాన్ని నూరిపోసే కవిత 'హెచ్చరిక'. "ఒళ్ళును నాగజెముడు ముల్లుగా మలుచుకోండి / శిరస్త్రాణ ధైర్యం ఆపాదమస్తకం ధరించి / వెంటాడే నీడల్ని వేటాడండి" అంటూ మహిళలకు ధైర్యాన్ని నూరిపోస్తున్నాడు. ఉప్పిడి ఉపవాసం ఉండి కూడా మానవ హక్కులకై జీవితాంతం పరితపించిన బాలగోపాల్ ఆశయసాధనకు కృషి చేయాలని, అభివృద్ధి సెజ్‌ల పేరిట పేదల్ని ముంచే సర్కారును ప్రశ్నించే జనప్రళయం రావాలని కవి కోరుకుంటున్నాడు. ప్రజాస్వామ్యం హత్య చేయబడుతూ కనబడని సామ్రాజ్య విస్తరణ విషం చిమ్ముతుంటే నా మనసు కవిత్వ నిప్పుకణికలై రగులుతుంటది అంటూ అన్యాయం పట్ల తన తిరుగుబాటు బావుటాను ఎగురవేస్తాడు. సాధారణంగా పాఠశాలలో విద్యార్థులు బడికి రాలేదని హోంవర్క్ చేయలేదని ఏకపక్షంగా దండించే ఉపాధ్యాయులను చూస్తుంటాం. ఆ పిల్లలతో ఓ స్నేహితుడిలా, ఆత్మీయుడిగా పలకరిస్తే వారి పేదరికపు చీకటి కోణాలను దర్శించగలం. ఈ రోజుల్లో కూడా కూటికెల్లక పిల్లలను పత్తి చేలకు తోలుకుపోయే తల్లిదండ్రులు పల్లెల్లో ఉన్నారు. ఒక మానవీయ కోణంలో పిల్లలను అర్థం చేసుకోవాలని చెప్పే కవిత 'బతుకు పాఠం'. "తిట్టినా సరే కొట్టినా సరే / ఇజ్జత్ తీయకండి సార్" అన్న ఈ రెండు వాక్యాలు ఉపాధ్యాయుల శిక్షలు విద్యార్థుల ఆత్మగౌరవాన్ని ఎలా దెబ్బతీస్తాయో, గుండెల్ని పిండేసేలా ప్రతిబింబిస్తాయి. సిద్దెంకి కవిత్వంలో నోస్టాల్జియా అద్భుతమైన ప్రతీకలతో ఆవిష్కృతమై ప్రతి పాఠకుణ్ణి తన బాల్యస్మృతులలోకి తీసుకెళ్తుంది. "కప్పతల్లి ఆటల్ల కాముని దానంల / నీళ్లు గోగుపువ్వు రంగుల్లో తనువెల్ల తానం చేసే మూడు బజార్ల తొవ్వ / కులమతాలకు లేని కుతి పొగాకు సుట్టకు పంచుకుంటూ / ఆత్మగల్ల మాటలతో ఆకు తీగ పందిరోలె కలిసి పోదురు జండాకాడికి రండి" తెలంగాణలో ప్రతి పల్లెలో ఈ దృశ్యాలు కళ్ళముందు మెదలుతాయి.

పల్లె జీవనాన్ని కళ్ళకుకట్టిన కవిత ఇది. ప్రపంచీకరణ మాయలో పల్లె విధ్వంసమవుతున్న స్థితిని కళ్లకుకట్టి చూపుతాడు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలు తీవ్ర అన్యాయానికి

గురవుతున్నారనేది కాదనలేని సత్యం. దీనిని గురించి ప్రస్తావిస్తూ "చరిత్రలో చెప్పులు ఏలిన రాజర్కం / ఇప్పుడు తప్పుడు నేతలు ఏలుతున్నారు / అదే తిరుగుబాటు చెప్పుల వర్షంల రాలిపోతరు" అని హెచ్చరిస్తారు. తెలంగాణలో చేనేత హస్తకళకు ప్రపంచంలోనే ఒక గొప్ప గుర్తింపు ఉంది. అటువంటి నేతన్నలు నేడు ఆకలి చావులు చస్తున్నారు. దీనిపై కవి హృదయం స్పందించిన తీరిది. "ఒక్కొక్క దారం ఒక్కో ఆధారమై ఇజ్జత్ కాపాడే నేత కళ / పాలకులకు పట్టని వ్యవహారమై పాడే మీద ఊరేగుతుంది" (నేత) చేతి వృత్తుల పట్ల నేటి రాజకీయ నాయకులకు ఒక దృక్పథం ఉండాలనే ఆకాంక్ష ఈ కవితలో కనిపిస్తుంది. కర్మ సిద్ధాంతం పేరుతో తరతరాలుగా దళిత జాతిని అణగద్రొక్కుతున్న మనువాద సిద్ధాంతాన్ని చీల్చిచెండాడుతున్నాడీకవి. "మా మూలాలను పరిశోధన పాతాళగరిగెతో / మీ పురాణాల ఫుల్ట్యాంకుల్లో దేవుతున్నం / ఈ దేశపు పునాది నాది / అసలు మూలవాసులం / జంబూద్వీప పరిపాలక వారసులం / జాంబవులం" అంటూ మనువాదంపై తన ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్నాడు. 'విశ్వమానవ విపంచి', 'జాంబవ జ్ఞానం', 'జెల్లికంచెల', 'అట్టితునకల కూర' మొదలైన కవితలు బలమైన దళిత అస్తిత్వవాదాన్ని చాటుతున్నాయి. 'తెగారం', 'ప్రజలే ఉరితాళ్లు', 'తెలంగాణ మార్చ్', 'లైఫ్ లాంగ్ మార్చ్', 'ఎల్ల గొడతాం' మొదలైన కవితలు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని తేటతెల్లం జేసినయ్. 'మాకోసం వస్తున్నవా' కవితలో "నీరు మీరు ప్రోగ్రాం / మీది నీరు మీరే మలుపుకుంటిరి / సీమాంధ్ర జన్మభూమికి కదిలిపోతూ / వస్తున్నా మీకోసం అంటే మేం ఎట్ల నమ్మాలె?" అంటూ శబ్ద చమత్కారంతో వ్యంగ్యంగా నాటి పాలకుల ద్వంద్వ నీతిని ఎండగట్టారు. ఇలా చెబుతూ పోతే సిద్దెంకి యాదగిరి 'బతుకు పాఠం'లో ప్రతి కవితా ఉటంకణార్హమే. ప్రతి కవితలోనూ బహుజనుల బతుకును దర్శించవచ్చు. ఒక కమిట్మెంట్తో, శిల్ప శ్రద్ధతో రాస్తున్న ఈ కవి కలం నుండి ఇంకా గొప్ప కవిత్వం రావాలని మనసారా ఆకాంక్షిద్దాం.

**13.09.2017 అంకురం**

**నవతెలంగాణ**

4

# జానపద సాహితీ పరిమళం మందెచ్చుల సాహిత్యం

**ఆ**దిమకాలంలో మానవుడు సంఘజీవిగా మారుతున్న క్రమంలో భాష పుట్టింది. లిపి పుట్టకముందే మనిషి తన ఆనందాలను, ఉద్వేగాలను రాగాలాపనలతో వ్యక్తం చేశాడు. అదే జానపద సాహిత్యం అయింది. జనపదం నుండే జానపదం ఉద్భవించింది. జనపదం అనగా పల్లెటూరు. నేటికీ జానపద సాహిత్యానికి ప్రధాన కేంద్రాలు పల్లెటూర్లే. పల్లెల్లో స్థూలంగా చూసినప్పుడు అంతా ఒకే సంప్రదాయం, ఆచారవ్యవహారాలు, విశ్వాసాలు కలిగి ఉన్నట్లు కనిపించినా సూక్ష్మ పరిశీలన చేస్తే ఎన్నో భేదాలు కనిపిస్తాయి. అనేక వృత్తుల వారికి వారి పూర్వ చరిత్రను తెలిపే జానపద సాహిత్యం ఉంది. ఆ సాహిత్యాన్ని గానం చేసే ఆశ్రిత కులాలు ఉన్నాయి. ఉదాహరణకు పద్మశాలీయులకు సాధనా శూరులు. రెడ్డి కులస్తుల ఆశ్రిత కులం పిచ్చుక గుంట్లు. మాదిగ కులస్తులకు ఆశ్రిత కులం చిందు భాగవతులు. విశ్వకర్మలకు ఆశ్రిత కులం రుంజ కళాకారులు. బ్రాహ్మణులకు ఆశ్రిత కులం విప్రవినోదులు. రజకుల ఆశ్రిత కులం మడేలయ్యలు. మాలల ఆశ్రిత కులం మాలమాష్టి గుర్రం మల్లయ్యలు. ముదిరాజుల ఆశ్రిత కులం పాండవులవాళ్ళు. అలాగే యాదవులకు ఆశ్రిత కులం మందెచ్చులు. ఈ విధంగా ఈ ఆశ్రితకులాలు ఆయా కులాల వారిని యాచిస్తూ ఆయా వృత్తి చరిత్ర పురాణాలను వినిపిస్తూ జానపద సాహిత్యానికి జీవం పోస్తున్నారు. ఈ నేపథ్యంలో యాదవుల అశ్రిత కులమైన మందెచ్చుల సాహిత్యం గురించి ఈ వ్యాసంలో స్థూలంగా ప్రస్తావిస్తాను. యదు వంశస్తులే యాదవులు. శుక్రాచార్యుని కూతురైన దేవయాని, యయాతి మహారాజుల కుమారుడే యదువు. ఈ వంశంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. మహాభారతాది ఇతిహాసాలు, బ్రహ్మాండాది పురాణాలు యాదవుల చరిత్రను, వైభవాన్ని తెలుపుతున్నాయి. యాదవులను తెలంగాణలో గొల్లలు అని పిలుస్తున్నారు. వీరి ప్రధాన వృత్తి గోపాలన. ఈ గోపాలన శబ్దం నుండి గొల్ల శబ్దం వచ్చి ఉండవచ్చు. లేదా గొఱ్ఱెల కాపరులు కనుక గొర్ల అనే శబ్దం నుండి గొల్ల అనే శబ్దం వచ్చి ఉండవచ్చు. ఈ గొల్లల ఆశ్రిత కులమే మందెచ్చులు.  వీరిని పొడపోతుల వారు అని కూడా అంటారు. గొల్లల గొఱ్ఱెల మంద హెచ్చుగా ఎదగాలని దీవిస్తూ కథలు చెప్తారు. కాబట్టి వీరికి మందెచ్చులు అనే పేరు వచ్చింది. వీరు కథలు చెప్పినందుకు కానుకలుగా గొఱ్ఱెపోతులు, మేకపోతులు దానంగా ఇస్తారు. కాబట్టి పొడపోతుల వారు అనే పేరు వచ్చింది. వీరు గ్రామానికి

సంవత్సరానికి ఒకసారి వస్తారు. యాదవ రాజ్యపాలన, యుద్ధాల గురించి తెలియజేసే విషయాలను కథారూపంలో గానం చేస్తారు. ఈ కథాగేయాలలో అనేక చారిత్రక, సాహితీ విలువలు మనం గమనించవచ్చు. మందెచ్చుల వారు తెలంగాణలో ప్రధానంగా నల్లగొండ, మెదక్, వరంగల్ జిల్లాల్లో కనిపిస్తారు. కుటుంబమంతా ఈ కళనే నమ్ముకుని జీవిస్తారు. కుటుంబ పెద్ద అయిన పురుషుడు ప్రధాన కథకుడుగా ఉంటాడు. యాదవ పెద్దలను పొగుడుతూ పాటలు పాడుతారు. అతని వెనుక అతని భార్య, పిల్లలు తాళం వేస్తూ వంత పాడుతారు. కథాగమనం ఒగ్గు కథను పోలి ఉంటుంది. వీరరసాన్ని వ్యక్తీకరించే సమయంలో హావభావాలు తగిన విధంగా ప్రదర్శిస్తారు. ఒక చేత కర్ర, మరొక చేత చిడతలు లేదా ఢమరుకం పట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని కథ చెప్తారు. నడుముకు కట్టుకున్న శాలువా స్త్రీ పాత్రను వర్ణించే సమయంలో కొంగుగా మార్చుకుంటారు. వీరు గ్రామంలోకి రాగానే కుల పెద్దలు అందరినీ సమావేశపరిచి తమకు ప్రతి యాదవ కుటుంబం ఎంత ధనం ఇవ్వాలో నిర్ణయం చేస్తారు. దీనిని త్యాగం అంటారు. త్యాగం నిర్ణయమైన తర్వాత ప్రతి రోజు ఒకరి ఇంటి వద్ద భోజనాలు చేస్తారు. పెద్దలు నిర్ణయించిన కూడలిలో రాత్రివేళ కథలు చెప్తారు. కథ చెప్తున్నట్లు సంకేతంగా ప్రజలంతా గుమికూడడానికి కొమ్ముబూర ఊదుతారు. రాత్రి నుండి తెల్లవారుజాము వరకు కథాగానం నడుస్తూనే ఉంటుంది. మందెచ్చులు చెప్పే కథల్లో ముఖ్యమైనవి 1) పెద్దిరాజు కథ 2) కాటమరాజు కథ 3) ఆవుల మీది కథ 4) సింహాద్రిరాజు కథ 5) వలరాజు కథ మొదలైనవి. మందెచ్చులు చెప్పే కథల్లో ప్రధానమైనది 'కాటమరాజు' కథ. తెలుగులో అతిప్రాచీనము, ప్రసిద్ధి చెందిన వీరగాథ ఇది. శ్రీశైలం ప్రాంతంలో ఆవుల్ని మేపుతున్న కాటమరాజు తీవ్రమైన కరువు వలన తన ఆవుల మందలను దక్షిణ దేశమైన నెల్లూరు ప్రాంతానికి తరలిస్తాడు. నెల్లూరు భూముల్ల నెలకు మూడు వర్షాలు కురుస్తాయని అక్కడ పశువులకు మేత లభిస్తుందని అక్కడకు వెళ్తాడు. అప్పుడు నెల్లూరు పాలకుడు నల్లసిద్ధి ఖడ్గతిక్కన సహాయంతో ఆవులను మేపుకోవడానికి ఒప్పందం చేసుకుంటాడు. నల్లసిద్ధి ఉంపుడుగత్తె కన్నమదేవి యొక్క చిలుక ఆవులమందలను బెదిరిస్తుంది. కాటమరాజు వద్ద ఉన్న గోపాలురు ఆ చిలుకను చంపుతారు. దానికి ప్రతీకారంగా కన్నమదేవి కాటమరాజు ఆవులను చంపిస్తుంది. దీనితో వైరం ప్రారంభమై యుద్ధంగా మారుతుంది. నల్లసిద్ధితో కాటమరాజు భీకర యుద్ధం చేస్తాడు. కాటమరాజు విజేయుడై శ్రీశైల ప్రాంతానికి వెళతాడు. ఈ విధంగా యాదవ రాజుల వీరత్వాన్ని వర్ణిస్తుంది కథ. మందెచ్చుల కథ గంగాదేవి ప్రార్థనతో ప్రారంభమవుతుంది. "తాగేది గంగ / తలకు పోసుకునేది గంగ / తొక్కేది గంగ / మొక్కేది గంగ / సకల చండాలము బాపుసత్యవీర గంగా / గంగ లేకపోయిన

ఈ జగము గడియాగదమ్మ / నీరు లేకపోయిన ఈ జగము నిమిషముండబోదమ్మా" అంటూ గంగను ప్రార్థిస్తారు. డోలు వాయిద్యం తాళానికగుణంగా కదం కదుపుతుంటే, రిథమిక్‌గా సాగుతున్న గజ్జెల సవ్వడి, ఢమరుకం మోతతో శ్రోతలలో ఉత్సాహాన్ని నింపుతారు. గంగరాజు కథ, కఠ్రావు కథ, పోలురాజు కథ, భక్తిరన్న కథ, బొల్లావు కథ, కళ్యాముల రాజు కథ, మండోదరి కథ, భూనాంచారి కథలను కూడా వీరు సందర్భానుసారం ఆలపిస్తారు.

## మందెచ్చుల బొమ్మల కొలువు

మందెచ్చులు గ్రామాలలో ఐదు కథలు చెప్పిన తర్వాత గ్రామ పెద్దగొల్ల ఇంటి ముందు బొమ్మల కొలువు నిర్వహిస్తారు. యాదవుల చారిత్రక వీర పురుషుల బొమ్మలు సుమారు 62 నిలబెడతారు. ఒక్కొక్క బొమ్మను నిలుపుతూ ఆయా చారిత్రక గేయాన్ని ఆలపిస్తారు. ప్రధానంగా యాదవుల కులదైవమైన గంగాదేవి బొమ్మను నిలబెట్టేటప్పుడు బోనం సమర్పిస్తారు. బొమ్మలు నిలిపిన రోజు యాదవులంతా ఇంటి దగ్గరే ఉంటారు. నిష్ఠగా కొబ్బరికాయలు, బియ్యం, పసుపు కుంకుమలు సమర్పిస్తారు. వీరావేశంతో మందెచ్చులు చెప్పే కథలకు శివసత్తులకు పూనకాలు ఆవహిస్తాయి. గంగాదేవిని నిలిపేటప్పుడు జనమంతా తన్మయంలో మునిగిపోతారు. బొమ్మలు నిలిపిన తదుపరి రోజు నుండి ఆ గ్రామంలో సంవత్సరంలో చనిపోయిన యాదవుల స్మృత్యర్థం కథలు చెప్తారు. వారికి గుర్తుగా ఆవుదూడను, పిల్లగొర్రెను కానుకలుగా తీసుకుంటారు. పొడపోతుల కుటుంబాల వాళ్లు ఊర్లు పంచుకుంటారు. ఒకరికి కేటాయించిన ఊరికి ఇంకొకరు వెళ్లరు. ఆ గ్రామంపై వంశపారంపర్య హక్కును కలిగి ఉంటారు. ఆశువుగా నిరాఘాటంగా కథలు చెప్పడంతో వీరు సిద్ధహస్తులు. "కుమ్మ రాముల పెంట ఎల్లదోడిన వాడు లేడు / వాగుల ఇసుకను ఎల్లదోడిన వాడు లేడు / యాదవుల కథను ఎల్ల జెప్పిన వాడు లేడు" అనే మాటలను బట్టి ఎంత చెప్పినా తరగని చరిత్ర యాదవులదని తెలుస్తుంది. ఈ విధంగా సాహిత్యంలోనే కాక మందెచ్చులు వేటలోనూ, ఆయుర్వేద వైద్యంలోనూ నిపుణులే. యాదవుల గొర్రెలకు వచ్చే రోగాలకు పసరు మందులతో పాటు భూతవైద్యం కూడా చేస్తారు. అనాదిగా చరిత్రను, సంస్కృతిని పరిరక్షిస్తూ వస్తున్న మందెచ్చులు క్రమంగా అంతరించిపోతున్నారు. నేటితరం ఈ కథలపై ఆసక్తి చూపకపోవడం, టీవీ, సినీ మాధ్యమాల ప్రభావం వీరి వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ మందెచ్చులపై మరింత పరిశోధన జరిగితే చారిత్రకమైన ఎన్నో అంశాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

**20.09.2019, అంకురం**

**నవతెలంగాణ**

5

# తెలంగాణ తొలితరం కథకుడు ఆవుల పిచ్చయ్య

**తె**లంగాణ సాయుధపోరాటం గడ్డిపోచలను సైతం గడీలపైకి ఉసిగొలిపే చైతన్యాన్ని తెలంగాణ సమాజానికి అందించింది. ఆ పోరాట స్ఫూర్తితో కథలు రాసిన వారు ఆవుల పిచ్చయ్య. 1919లో సూర్యాపేటలో జన్మించారు. నాటి నిజాం దొరల, దేశ్‌ముఖ్‌ల అన్యాయాలను, దౌర్జన్యాలను ఎదిరించారు. జైలు జీవితాన్ని అనుభవించారు. తాను చూసిన సమాజాన్ని కథలుగా రికార్డు చేశారు. పిచ్చయ్య రాసిన కథలు నాటి సుప్రసిద్ధమైన మీజాన్ లాంటి పత్రికల్లో అచ్చయ్యాయి. ఆవుల పిచ్చయ్య రాసిన కథలను ప్రముఖ పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ 'తెలంగాణ పోరాట కథలు' పేరుతో ఐదు కథలతో ఒక సంపుటిని ప్రచురించారు. ఆవుల పిచ్చయ్య పెద్దగా విద్యావంతుడు కాదు. వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేశారు. తెలంగాణ సాయుధ పోరాటం, కమ్యూనిస్టుల రాజ్యం, కమ్యూనిస్టు పార్టీలోనూ ఉన్న లోపాలపై స్పష్టత కలిగినవారు. భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటంలో పాల్గొని మే 1947 నుండి జూన్ 1949 వరకు సుమారు రెండేళ్లు జైలుశిక్ష అనుభవించాడు. తెలంగాణలో నిజాం కాలంలో అధికారులు ఊళ్లోకి వస్తున్నారంటే గ్రామ పట్వారి నుండి సాధారణ ప్రజల వరకు అందరూ భయంతో వణికిపోయేవారు అనడానికి ప్రబల సాక్ష్యం 'దౌరా' కథ. వచ్చిన అధికారులకు తగు విధంగా ఏర్పాట్లు చేయడానికి ప్రజలందరూ మూకుమ్మడిగా పని చేయాలి. అన్ని వృత్తుల వారు తగు విధంగా అధికారులకు సేవలు చేయాలని, వచ్చిన ప్రతిసారి గొల్లవాళ్లు వంతుల చొప్పున గొఱ్ఱెను ఇవ్వాలి. ఇంత చేసినా కనికరం లేకుండా పంటలు ఎండిపోయినా బలవంతంగా లెవీగల్లా భూమిశిస్తు వసూలు చేసిన దౌర్జన్యపు స్థితిగతులను 'దౌరా' కథ కళ్లకుకట్టింది. ఆవుల పిచ్చయ్య రాసిన మరొక చక్కని కథ 'ఊరేగింపులు'. తెలంగాణ సాయుధపోరాటంలో అమరుడైన తొలి వీరుడు దొడ్డి కొమురయ్య అంతిమయాత్ర కేవలం కడవెండిలోనే కాక జనగామ తాలూకాలోని అనేక గ్రామాల్లో అమరవీరుని అంతిమయాత్ర పేరిట ఊరేగింపులు జరిగాయి. నాటి వాస్తవ సంఘటనలు ఆ కథలోని వస్తువు. స్త్రీలు, పిల్లలు ఒకరేమిటి 90 ఏళ్ల ముసలమ్మ వరకు ఆనాటి ఊరేగింపులో పాల్గొన్నారని ఈ కథలో తెలియజేశారు. నాటి గ్రామ అధికారులు సైతం

అన్యాయాలను సహించలేకపోయినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలు కనుక ఎదిరించలేమనే గ్రామాధికారి మాటలు నాటి ప్రజల అసంతృప్తికి నిదర్శనాలు. కొమరయ్య ఆశయాలు సాధిస్తామని ప్రజలు ఎర్రజెండా సాక్షిగా ప్రతిజ్ఞలు చేయడం నాటి తెలంగాణ ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. నిజాం పరిపాలనలో అటెండర్ల నుండి అధికారుల దాకా అవినీతి రాజ్యమేలింది అనే నిజానికి అక్షర రూపమే 'చపరాసి దినచర్య'. రైతు చపరాసికి లంచం ఇచ్చి తన దరఖాస్తును సమర్పించుకోవడం రోజంతా పడిగాపులుకాసినా తన పని కాకపోవడం ఆనాటి ఉద్యోగుల అలసత్వాన్ని బట్టబయలు చేస్తుంది. నిజాం నిరంకుశ పాలనలో, వెట్టిచాకిరిలో నలిగిపోయిన చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి సబ్బండ వర్ణాల జీవన చిత్రం 'వెట్టిచాకిరి దినచర్య' కథ. గ్రామంలోని దొరలకు, దేశ్‌ముఖ్‌లకు, పట్వారీలకు, పోలీస్ పటేల్‌కు, మాల్ పటేల్‌కు గ్రామంలోని ప్రజలంతా ఎట్టి జీతనాతాలు ఆశించకుండా పని చేయాలి. ఇది వెట్టిచాకిరి వ్యవస్థ. చాకలి రంగనిపాత్ర ద్వారా నాటి పరిస్థితులను ఈ కథలో చక్కగా వర్ణించారు. ఇంటికి జొన్న గింజలు తెస్తాడని ఎదురు చూస్తున్న భార్య ఉత్త చేతులతో వచ్చిన రంగడిని "చంటి పిల్ల తల్లిని ఇంత మెతుకు తినకుంటే పిల్లలకు పాలు ఎట్లా?" అని ప్రశ్నించడం నాటి ప్రజల అవస్థలకు పరాకాష్ట. ఆవుల పిచ్చయ్య కథలలో అసంపూర్ణంగా లభించిన కథ 'ఈత గింజ ఇచ్చి తాటి గింజ లాగిన జమిందారు'. ఈ కథలో జోగయ్య, గోపయ్య అన్నదమ్ములు. వీరితోడ ఒక అమ్మాయి. తమ ఎడ్లను జమిందార్ నాగేశ్వరరావు రాత్రంతా పని చేయించుకొని ముల్లు కర్రతో పొడిచి గాయం చేసిన విషయాన్ని చూసి తల్లడిల్లిపోతుంది. ఈ కథలో పేద రైతుల దుస్థితి, షావుకార్ల మోసాలు చిత్రించబడ్డాయి. అడవి బాపిరాజు చెప్పినట్లు గ్రామ జీవన నేపథ్యానికి బంగారు రంగులు సింగారించిన సిద్ధహస్తులు శ్రీ పిచ్చయ్య గారు. భాషలో పాండిత్య పటిమ, భావాలలో వైవిధ్యం, రచనలో, చతురతలో వారు సిద్ధహస్తులనక తప్పదు. పిచ్చయ్య కథలు రాశిలో స్వల్పమే అయినా వాసిలో ఎన్నదగినవి. చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచినవి ఆవుల పిచ్చయ్య కథలు. వీటిని వెలుగులోనికి తెచ్చిన సంగిశెట్టి గారు, సహకరించిన దేవులపల్లి కృష్ణమూర్తి గారు అభినందనీయులు. మరింత పరిశోధన జరిగితే ఆవుల పిచ్చయ్య రాసిన మరికొన్ని కథలు వెలుగుచూసే అవకాశం ఉంది.

**03.04.2019 అంకురం**

**నవతెలంగాణ**

# 6

## జనం గొంతుకకు అక్షర నీరాజనం

అజ్ఞానాంధకారం అలముకున్నచోట, నియంతృత్వపు పోకడలు జడలు విప్పినచోట, దొరస్వామ్యం విషసర్పమై పడగ విప్పినప్పుడు, ప్రజలను మేల్కొల్పి కార్యోన్ముఖులను చేసింది పాట. స్వతంత్ర భారతంలోనూ ప్రాంతాల మధ్య పాలకులు చూపిన వివక్షను ప్రశ్నించి నీళ్లు, నిధులు, ఉద్యోగాలకై ఉద్యమమై నినదించింది పాట. ప్రజలతో మమేకమై నడిచింది పాట. ఆ పాటకు పర్యాయపదమై అన్యాయం ఎక్కడున్నా తన పాట ద్వారా నిలదీసిన నిలువెత్తు చైతన్యం విమలక్క. విప్లవాల పురిటిగడ్డ నల్లగొండ ముద్దుబిడ్డగా అతి సామాన్యమైన బడుగు, బలహీన వర్గాల ఇంట్లో పుట్టి సాయుధ పోరాట వారసత్వమై ఎగిసిన పాటల కెరటం విమలక్క. తాను పుట్టి పెరిగిన వాతావరణం విమలక్కను ప్రజా ఉద్యమాల వైపు నడిపించింది. ఉద్యమ పాటల కవి 'మిత్ర' సహచర్యం ప్రజాజీవితంలో మమేకమయ్యేలా చేసింది. ఆయన కలానికి తన గళాన్ని జోడించి చైతన్యమై ప్రవహించింది. అరుణోదయ కళాకారిణిగా, జనం పాటగా మారి రాజ్యహింసకు వ్యతిరేకంగా ధిక్కారస్వరాన్ని వినిపించింది. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకురాలిగా, ప్రగతిశీల మహిళా సంఘం సభ్యురాలిగా, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారిణిగా, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఛైర్‌పర్సన్‌గా, విమలక్క జీవన ప్రస్థానం తెలంగాణ ప్రజాజీవనంతో విడదీయలేనిది. తన ఆట, పాట, మాట ద్వారా ప్రజా ఉద్యమాలను ఉర్రూతలూగించిన విమలక్క తన వ్యక్తిగత జీవితాన్ని సైతం ప్రజాజీవితం కోసం ధారపోసిన త్యాగశీలి. తన జీవిత భాగస్వామి మిత్ర అజ్ఞాతంలో ఉండగా ఆయన ఆచూకీ కోసం రాజ్యహింసను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి. మారుతున్న కాలానుగుణంగా ఉద్యమ దృక్పథం మారాలన్న ఆలోచనకు ప్రతిరూపం విమలక్క. గ్రామాల్లో పెత్తందారీ పోకడలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా 80వ దశకంలో ఉద్యమించింది. అనంతరం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ తెలంగాణ ఉద్యమాన్ని హైజాక్ చేసిన పార్టీల కంటే మునుపే తెలంగాణవాదాన్ని ఊరూరా వినిపించిన ఉద్యమ చైతన్య పతాక విమలక్క. వర్గ దృక్పథానికి బహుజన దృక్పథం తోడైతే సమసమాజానికి మార్గం సులువు అని గ్రహించి అంబేద్కర్, మార్క్స్ సిద్ధాంతాల్ని మిళితం చేయడమే మార్గమని భావించి ఆ దిశగా ఉద్యమాలను నిర్మిస్తున్న ఉద్యమశీలి విమలక్క. నాలుగు దశాబ్దాల ప్రజాజీవితంలో విమలక్క ఎదుర్కొన్న నిర్బంధం, కష్టాలు కోకొల్లలు. సమాజం కోసం అవన్నీ దిగమింగి

జనం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. తెలంగాణ జన జీవితంలో భాగమైన సంస్కృతి, కళలు అగ్రవర్ణాల ఆధిపత్య ప్రభావఫలితంగా బడుగు, బలహీన, దళితవర్గాలకు దూరమౌతున్న పరిస్థితిని గమనించి 'బహుజన బతుకమ్మ' పేరిట దళితవాడలో బతుకమ్మలాడిన సంస్కరణశీలి విమలక్క. ఇలా నిరంతరం ఉద్యమ కాగడాగా వెలుగుతూ అణగారిన దళితబహుజన పీడితవర్గాలకు దారిదీపమవుతున్న విమలక్క జీవితాన్ని ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ ప్రయత్నంలోనే వచ్చిన చక్కని వ్యాస సంకలనం 'పాటల వాల్కెనో'. మోతుకూరు శ్రీనివాస్ సంపాదకత్వంలో వచ్చిన ఈ గ్రంథం విమలక్క ఉద్యమ జీవితాన్ని అధ్యయనం చేయాలన్న ఆసక్తిని పాఠకులలో కలిగిస్తుంది. ఉద్యమ చైతన్యాన్ని ప్రవహింపచేసే విమలక్కపై వచ్చిన తొలి సంకలనం 'పాటల వాల్కెనో'. 10 వ్యాసాలు కలిగిన ఈ సంకలనంలో విమలక్క జీవితంలోని కొన్ని ఘట్టాలు రేఖామాత్రంగా స్పృశించబడ్డాయి. క్రాంతికుమార్ రెడ్డి రాసిన వ్యాసంలో విమలక్క జీవనరేఖలు వివరించబడినాయి. కందుకూరి రమేష్ బాబు రాసిన వ్యాసంలో మిత్ర, విమలక్కలు ఉద్యమంలో నిర్వహించిన పాత్రను చక్కగా వివరించారు. జయధీర్ తిరుమలరావు రాసిన 'అరుణోదయంలో విమల గానం' అనే వ్యాసంలో కళాకారిణిగా విమలక్క ప్రస్థానాన్ని చక్కగా ఆవిష్కరించారు. 'సాంస్కృతిక యుద్ధస్వరం' అనే వ్యాసంలో డాక్టర్ జిలుకర శ్రీనివాస్ వర్గ దృక్పథం కలిగిన పాల్ రాబ్సన్, నల్లజాతి దృక్పథం కలిగిన బాబ్ మార్లే మార్గాలను ఒకటిగా కలిపితే విమల అని అభివర్ణించడం విమలక్క సైద్ధాంతిక స్పష్టతను తెలుపుతుంది. ఆయన రాసిన వ్యాసంలో విమలక్క చిన్ననాటి జీవితం పాటతో మమేకమైన తీరు ఆసక్తికరంగా వివరించారు. విమలక్కతో రమేష్ నాయక్ జరిపిన ఇంటర్వ్యూ సమకాలీన సమాజాన్ని చిత్రిక పట్టింది. రాజనందిని పత్రిక విమలక్కను మహిళా జిందగీగా అభివర్ణించింది. 'కట్ట కవిత ఆడుదాం బహుజన బతుకమ్మ' అనే వ్యాసంలో అణగారిన వర్గాల ప్రజలపై తెలంగాణలో జరుగుతున్న వివక్షత తన సాంస్కృతికోద్యమంద్వారా ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారు. కసునూరు రామలింగం గారి వ్యాసం నిరంతర ప్రవాహమైన విమలక్క గానం, విమలక్క చేస్తున్న సాంస్కృతిక యాత్రను విశదీకరిస్తుంది. బి ఎస్ ఎమ్ కుమార్ రాసిన 'నిశస్త్ర యుద్ధమా జ్ఞాన కలల పాట' అనే వ్యాసంలో పాటకు విమలక్కకు ఉన్న అవినాభావ సంబంధాన్ని, విమలక్క పాటలోని తాత్వికతను ఎత్తిచూపారు. విమలక్క ప్రజాజీవితాన్ని పట్టి చూపే ప్రయత్నంలో ఈ సంకలనం మొదటి అడుగు మాత్రమే. భావితరాలకు స్ఫూర్తి విమలక్క సమగ్ర జీవిత చరిత్ర రావలసిన అవసరం ఎంతైనా ఉంది. సంపాదకులు మోతుకూరి శ్రీనివాస్ అభినందనీయులు.

**12.09.2018, అంకురం, నవతెలంగాణ**

# 7

# సాహిత్య సవ్యసాచి దోరవేటి

**సా**హిత్యం పట్ల ప్రేమ, తపన ఉన్నవారి అభివ్యక్తి అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. అది కథ కావొచ్చు, నవల, పద్యం, గేయం, నాటకం కావొచ్చు. ఇలా అనేక ప్రక్రియలలో తన సాహితీసేద్యాన్ని కొనసాగిస్తున్న విశిష్ట కవి, రచయిత దోరవేటి. రంగారెడ్డి జిల్లా ధారూరు పూర్వనామం దోరవేటి తన స్వగ్రామం పేరునే తన కలం పేరుగా మార్చుకున్న పల్లె ప్రేమికుడు దోరవేటి. 30కి పైగా గ్రంథాలు వెలువరించారు. వీటిలో తొమ్మిది నవలలు, పది కథా సంపుటాలు, నాలుగు శతకాలు, వ్యాస సంపుటాలు ఇలా భిన్న ప్రక్రియలలో వీరి సాహితీ సృజన సాగుతున్నది. "పద్యమె ప్రాణము జిహ్వాకు / పద్యమె నా తెలుగు జాతి ప్రజ్ఞాయశముల్ / పద్యమె రసనైవేద్యము / పద్య కవిత హృద్వికాస పథమగు నేస్తం" అంటూ పద్య ప్రాశస్త్యాన్ని తెల్పిన ఈ కవి తెలుగు సాహితీలోకానికి అందించిన గొప్ప వ్యాఖ్యాన గ్రంథం 'పద్యం–రసనైవేద్యం'. తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన కవులు రాసిన మేలిమి పద్యాలను ఏరి, ఒకచోట కూర్చి, వాటికి వ్యాఖ్యానం రాసిన గ్రంథమిది. సాహితీ విద్యార్థులకు పరామర్శ గ్రంథంగా ఉపయోగపడుతుంది. సమకాలీన సమాజంలో మానవ మనస్తత్వాన్ని, అడుగంటిపోతున్న మానవీయ విలువల్ని పట్టి చూపిన కథాసంపుటి 'నాన్నకు జేజే'. దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవత్వం ఈ కథలనిండా ప్రతిఫలిస్తాయి. దోరవేటి కథలు ఏదో ఒక ఆదర్శాన్ని సమాజానికి అందిస్తూనే ఉన్నాయి. చిన్ననాడు తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు తాను రాసిన పుస్తకాన్ని అంకితం చేసిన శిష్యుడి కథ 'కానుక'.

పాల్కురికి సోమనాథుని అద్దంలో చూపిన గ్రంథం 'బసవ పంచశతి'. ఇది సంక్షిప్త బసవపురాణం. శివభక్తుల భక్తి పారవశ్యాన్ని ఆటవెలదులలో అందంగా ఆవిష్కరించిన గ్రంథమిది. దోరవేటి పరిశోధనాపటిమకు దర్పణం 'భారతీయ కళలు' వ్యాససంపుటి. మానవ జీవితాన్ని సుఖప్రదం, జయప్రదం చేయడంలో కళలు కీలకమైనవి. వాత్సాయనుడు పేర్కొన్న 64 కళల సమగ్ర విశ్లేషణ ఈ గ్రంథం. భారతీయ జీవన సౌందర్యాన్ని చూపిన 'భారతీయ కళలు' మన సంస్కృతి పట్ల గౌరవాన్ని

పెంపొందిస్తుంది. స్వతహాగా కవి, రచయిత, గాయకుడు, చిత్రకారుడు, బుర్రకథ కళాకారుడు, అవధాని అయిన దోరవేటి పది కళలలో నిష్ణాతులు. వీరి లేఖిని నుంచి 'భారతీయ కళలు' రావడం సముచితంగా ఉంది.

చారిత్రక నవలలు రాయడంలోనూ దోరవేటిది అందెవేసిన చేయి. 'మరోశివాజీ', 'అసమానవీరుడు– అనురాగదేవత' బాజీరావు మస్తానీల విషాదాంత ప్రేమకథ పాఠకులను ఆసాంతం చదివిస్తుంది. ఈ నవలల్లోని భాష దోరవేటి ఆనాటి కాలంలోని పాత్రలలోకి పరకాయ ప్రవేశం చేసినంత సహజ సుందరంగా కనిపిస్తుంది. దోరవేటి గారి చారిత్రక కథలు వారి అసమాన ప్రతిభాసంపన్నతకు నిదర్శనాలు.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ చరిత్ర, సాహిత్యం పట్ల పరిశోధనా స్పృహ మరింత పెరిగింది. ఈ కోణంలో తెలంగాణ ప్రాచీన కవుల జీవితాలను అధ్యయనం చేయడానికి కరదీపిక వంటి గ్రంథం 'మనకవులు – మహాకవులు'. వృత్తిరీత్యా ఉపాధ్యాయులైన దోరవేటి తన పరిసరాల, అనుభవాల కలబోతే 'ఆచార్యదేవోభవ'. ఇది ఉపాధ్యాయ కథల సంపుటి. నేటి విద్యావ్యవస్థ, గురుశిష్యుల సంబంధాలు, పాఠశాల నిర్వహణ తీరు ఈ కథలలో చక్కగా విశదీకరించారు. విద్యావ్యవస్థ తీరుపైనే వీరు రాసిన మరొక గ్రంథం 'చదవేస్తే'. ఇది వ్యంగ్య వ్యాసావళి. ఈ వ్యాసాలలో విద్యారంగంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, అధికారుల పాత్రను తెలియజెప్పేలా ఉండే రామలింగం పాత్ర ద్వారా సమాజానికి చక్కని సందేశాన్నిస్తాయి. దోరవేటి కలం నుంచి వెలువడిన ఖండకావ్యాలు 'అంజలి', 'అంజలి–2'. సంప్రదాయికమైన పద్య ఛందస్సులో, సామాజిక స్పృహ కలిగిన ఆధునిక భావాలతో పద్యం రాయడంలో దాశరథి పేరెన్నికగన్నవారు. ఆ కోవలోనే మనకు దోరవేటి దర్శనమిస్తారు. చక్కని ధారాశుద్ధితో తన మనసులోని భావాలను పద్యాలలో అలవోకగా గుప్పించడం వీరికి కరతలామలకం.

ఇవేకాక చక్కని స్నేహానికి అర్థం చెప్పిన నవల 'జీవనది'. చరిత్ర మరిచిన గొప్ప వాగ్గేయకారులు శ్రీ రాకమచెర్ల వెంకటదాసు జీవిత చరిత్ర, బసవేశ్వరుని జీవితాన్ని అక్షరీకరించిన వచనకావ్యం శరణు బసవ, ప్రౌఢమయిన భక్తి శతకం సాంబ శివశరణం మొదలైన గ్రంథాలు దోరవేటి అసమాన ప్రతిభకు నిదర్శనాలు. ఈ కవి తన రచనలకు, తన జీవితానికి మధ్య అంతరం లేకుండా జీవిస్తుంటారు. ఈ కవి నుంచి మరిన్ని గ్రంథాలు రావాలని ఆకాంక్షిద్దాం.

**25.02.2019, చెలిమె, నమస్తే తెలంగాణ**

8

# అతడు అబ్రహం

**పం**దొమ్మిదవ శతాబ్దంలో ఆంగ్లసాహిత్య ప్రభావంతో తెలుగులో వచ్చిన విశిష్ట సాహిత్య ప్రక్రియ నవల. అత్యంత జనాదరణ పొందిన ప్రక్రియ కూడా. "యథార్థ జీవితాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల" అంటారు రిచర్డ్ క్రాస్ మహానీయుడు. "సాంఘిక జీవనానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవనగమనాన్ని చిత్రిస్తూ ప్రజల ఆచారవ్యవహారాలను వ్యక్తీకరించేది నవల" అన్నారు మొదలి నాగభూషణశర్మ. ఈ రెండు నిర్వచనాలకూ సరిపోయే చక్కని ఉదాహరణ ఇటీవల ఆవిష్కరించబడిన 'అతడు అబ్రహం' నవల. తెలుగుసాహిత్యంలో విభిన్నమైన ఇతివృత్తంతో, ముందుతరాలకు స్ఫూర్తినిచ్చే సందేశంతో వచ్చిన నవల ఇది. కడియం డేవిడ్, డా.గడ్డం మోహన్‌రావు ఈ నవలా రచయితలు.

కడియం డేవిడ్ వృత్తిరీత్యా ప్రథమశ్రేణి తెలుగు పండితులుగా పదవీవిరమణ పొందారు. విశ్రాంత జీవితం దైవసేవలో గడుపుతున్నారు. ప్రవృత్తిరీత్యా సాహితీవేత్త. 'అంతరంగం' ఖండకావ్యం, 'ధరణీ శతకం', 'యేసునాథుని మధురధార క్రైస్తవగీతాలు', 'క్రైస్తవంలో కులాలున్నాయా' పరిశోధనా వ్యాసం తదితర గ్రంథాలు రాశారు.

తన ఏడేండ్ల వయస్సులో మరణించిన తండ్రి గురించి, ఆయన మంచితనం గురించి ఆనోటా, ఈనోటా విన్న డేవిడ్ తన తండ్రి గురించే కాక తమ మూలాలను వెతుక్కుంటూ చేసిన పరిశోధనే ఈ నవలకు మూలము. వీరి తండ్రి అబ్రహం ఈ నవలలో కథానాయకుడు. స్వయంకృషితో ఎదిగి పదిమందికి తోవజూపిన ఆదర్శజీవితం ఈ నవల ఇతివృత్తం. తాను పరిశోధించిన అంశాలకు నవలారూపం ఇచ్చిన వారు డా.గడ్డం మోహనరావు.

తెలుగుసాహిత్యంలో చిందు జీవితాలు ఇతివృత్తంగా వచ్చిన తొలి నవల 'కొంగవాలు కత్తి'. ఈ నవల రచయిత డా.గడ్డం మోహనరావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు. పరిశోధకుడిగా చిందు కళాకారుల జీవితాలను వెలుగులోకి తెచ్చినవారు. చదివించే కథనం, సంఘటనలు కండ్ల ముందు కదిలేలా అక్షరీకరించడం వీరి శైలిలో ప్రత్యేకత.

ఈ నవలతో అబ్రహం జీవితాన్ని నవలగా మార్చే క్రమంలో రచయితలు దానికి సమాంతరంగా అనేక అంశాలు చర్చకు పెట్టారు. ముఖ్యంగా ఇరవైయవ శతాబ్దంలో దళితుల జీవనం, హైందవంలో దళితులపై ఉన్న చిన్నచూపు, క్రైస్తవం వైపు దళితులు మళ్లడానికి గల కారణాలు, దళిత వర్గాలు పేదరికంలో మగ్గిపోవడానికి గల కారణాలు, కులం పేరిట జరుగుతున్న అవమానాలను అధిగమిస్తూనే స్వయంకృషితో ఎదగవచ్చనే నిరూపణ, వ్యవసాయ రంగంలో వినూత్నమైన పోకడల ఫలితంగా స్వయం సమృద్ధి తదితర అంశాలు 'అతడు అబ్రహం'లో చర్చించబడినాయి. అబ్రహం జీవితం ద్వారా స్థానిక వనరులను ఉపయోగించుకోవడం ద్వారా దూరదృష్టి కలిగి ఉండడం ద్వారా కష్టాలను అధిగమించవచ్చనే సందేశమందించారు.

పల్నాటిసీమలో కరువు వచ్చినప్పుడు ఓ కుటుంబం బతుకుదెరువుకై మూసీనదీ పరివాహక గ్రామమైన భీమారం వలస వచ్చింది. "అలా వచ్చిన కడియం సోమయ్య నుదుటి చెమట వంద ఎకరాలను సంపాదించి పెట్టింది" అన్న నవలాకారుల మాటలు, కేవలం స్వయంకృషితో వందల ఎకరాలు సోమయ్య సంపాదించాడని తెలుపుతున్నాయి. అదే సమయంలో మామిడాలలో కొత్తపల్లి సోమయ్య అనే దళితుడు ఆయుర్వేద వైద్యుడుగా ప్రసిద్ధుడు. "ఎక్కువ తక్కువ కులబేధాలు సోమయ్య వైద్యానికి అంటుకోలేదు" ఈ మాటలు దళితుడైనా అందరి ఆదరాభిమానాలు పొందినాడని తెలుపుతున్నాయి. ఇలా తన పూర్వీకుల చరిత్రను ఈ నవలలో పాత్రలుగా మలిచారు.

నాటి సమాజంలో దళితులను అస్పృశ్యులుగా చూడడం, బడిలో చివరగా, గుడికి దూరంగా ఉంచడం వంటి జ్యాడ్యాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో క్రైస్తవం ఈ వ్యవస్థ మార్పుకు పూనిక వహించినదని చెప్పవచ్చు. "హైందవ సంస్కృతికి పట్టిన అంటరానితనపు చీడను ఏమార్చేదిశగా క్రైస్తవ మిషనరీ పాఠశాలలు, తెల్లదొరల సువార్తలు, బైబిల్ గ్రంథాలు పేదలకు, నిమ్న కులాల వాళ్లకు చేరువ అవుతున్నాయి" అంటూ క్రైస్తవం దళితులకు చేరువకావడానికి గల కారణాలను ఈ నవలలో విశ్లేషించారు.

ఇక కథానాయకుడు అబ్రహం అగ్రికల్చర్ బియస్సీ చదివిన వ్యక్తి వలె కొత్తకొత్త పద్ధతులలో వ్యవసాయం చేస్తాడు. నాటి దొరలే అతణ్ణి పిలుచుకొని వ్యవసాయ మెళకువలు తెలుసుకొనేవారంటే అతని తెలివితేటలు గ్రహించవచ్చు. పంటమార్పిడి అంటే ఏమిటో తెలియని రోజుల్లో పంటమార్పిడి ప్రవేశపెట్టాడు. అంతర పంటలను పండిస్తాడు. పొగాకు, గోగునార వంటి వినూత్నమైన పంటలను పండిస్తాడు. గొడ్డుగోదలను

కన్నబిడ్డలవలె చూసుకునే జీవకారుణ్యమూర్తి. మేనమామల దగ్గరకు మామిడాలకు వలసవచ్చి అక్కడి దేశ్‌ముఖ్ నారాయణరెడ్డికి ఆప్తమిత్రుడవుతాడు. అబ్రహం దూరదృష్టి కలవాడు. రాబోయే కాలంలో ఆంగ్లవిద్య ప్రాధాన్యతను ఆనాడే పసిగడతాడు. తన పది మంది సంతానానికి మంచి చదువులు చెప్పించడానికి పూనుకుంటాడు. తన గ్రామానికి సుమారు నూటయాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగాంలో ఆంగ్లమాధ్యమంలో పిల్లలను చదివిస్తాడు. రజాకార్ల మీది కోపంతో ముస్లింలపై దాడులు జరిగినప్పుడు అడ్డుకుంటాడు. అనేక పంచాయితీలలో న్యాయబద్ధమైన తీర్పులిస్తాడు.

ఈ విధంగా కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఒక రూపుదాలిస్తే 'అబ్రహం'. దీనికి క్రైస్తవం ఇచ్చిన ధైర్యం మరింత ముందుకు నడిపింది. పల్నాటిసీమలో దైద నుండి వలసబోయిన ఇద్దరన్నదమ్ముల కుటుంబాల్లో, ఒకరు భీమారం రాగా మరొకరు విజయవాడ చేరడం. చివరకు అబ్రహం కుమారుని ద్వారా ఈ రెండు కుటుంబాలు కొన్ని తరాల తరువాత కలవడం నవలలో ముక్తాయింపు.

గత రెండు శతాబ్దాల సామాజిక చరిత్రను నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాలనుకునే వారికి 'అతడు అబ్రహం' ఓ పరామర్శ గ్రంథం. సామాజిక అపసవ్యాలకు ఎదురొడ్డి నిలబడాలనుకునే వారికి ఈ నవల ఓ స్ఫూర్తిమంత్రం. విభిన్నమైన ఇతివృత్తంతో విలక్షణమైన పరిశోధనతో సాగిన 'అతడు అబ్రహం' నవల తెలుగు సాహితీచరిత్రలో తప్పకుండా తన స్థానాన్ని పదిలపరుచుకుంటుంది.

**06.03.2019, అంకురం**

**నవతెలంగాణ**

# 9

# దళిత చైతన్య ప్రవాహం రాధేయ కవిత్వం

"సహితస్య భావం సాహిత్యం" అన్నట్లు సర్వజన హితాన్ని అభిలషిస్తూ రాసేదే సాహిత్యం. సర్వేజనా సుఖినోభవంతు అన్నట్లు సకల జనుల క్షేమాన్ని కాంక్షిస్తూ కవిత్వం రాసిన అరుదైన మాతృకవి రాధేయ. నల్లగొండలోని బిటిఎస్ ప్రాంతంలో నివసించే అతి నిరాడంబరుడైన గొప్ప కవి రాధేయ. దాదాపు ఇరవైకి పైగా పద్య, వచన కావ్యాలు ప్రకటించినా పటాటోపాలకు పోని వినమ్రుడైన కవి. అనారోగ్యరీత్యా మంచానికే పరిమితమైనా నేటికీ సాహితీసేద్యం చేస్తున్న నిత్యకృషీవలుడు. రాధేయకు అమ్మ అన్నా, అంబేద్కర్ అన్నా వల్లమాలిన గౌరవం. అందుకే ఆయన కవిత్వంలో అగ్రభాగం ఆ దిశగానే కొనసాగింది.

1943 అక్టోబరు 25న నల్లగొండ సమీపంలోని నర్సింగ్‌భట్లలో జన్మించిన రాధేయ అసలు పేరు రాచమల్ల దేవయ్య. లచ్చమ్మ, లచ్చయ్య తల్లిదండ్రులు. చిన్ననాడే తన అన్న రాచమళ్ల సామేలు శిష్యరికంలో చదువులో చక్కని ప్రతిభ కనబరిచారు. వృత్తిరీత్యా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం. ప్రవృత్తిరీత్యా సాహితీసేద్యం. పాఠశాలస్థాయిలోనే "పూరి గుడిసెలో పుట్టినవాడా / ఊరికి వెలుపల ఉండేవాడా / చదువుకుంటే సౌఖ్యమురో రన్నో చిన్నన్న / మన అంబేద్కరుడే సాక్ష్యమురో రన్నో పెద్దన్నా" అంటూ రాసిన తొలిగీతమే ఎంతో ప్రసిద్ధి పొందింది. పాఠశాల దశలోనే 1962లో చైనాతో యుద్ధం జరిగే రోజులలో 'ఓరి మదాంధ చైనియుడ' అంటూ ఉత్పలమాలను రాసారు. 1979లో దేవరకొండలో తొలి గ్రంథం 'ఉదయరాగం' ఆవిష్కరించారు. రామాయణ నేపథ్యంలో సులోచన పద్యకావ్యం, నగ్న సత్యాలు మినీకవితలు, మాతృమూర్తి పద్యకావ్యం, వచన, గేయ, పద్య కవితల సంపుటి అంబేద్కర ప్రబుద్ధ గీత, ఉర్దూ కవితల అనువాదం కవితా మకరందం, భారతరత్న అంబేద్కర శతకం, అంబేద్కర్ మహాబౌద్ధయానం, పద్య మణిమాల తదితర గ్రంథాలను ప్రచురించారు.

'పరువాల హరివిల్లు', 'స్పందన వాణి', 'స్నేహ ప్రపంచం', 'భగవద్గీత పద్యానువాదం', 'సాయిబాబా సంస్తుతి', 'జీవన రేఖలు', 'పద్య కథాత్మక ఆత్మ కథ'

అముద్రిత గ్రంథాలు. రాధేయ కవిత్వంలో ఆర్తి, ఆవేశం, ఆలోచన జీవలక్షణాలై ప్రవహిస్తాయి. చైతన్యశీలత అంతర్నిగూఢంగా ప్రవహిస్తుంది.

"స్త్రీలు యీ సమాజానికి మూల నిధులు / వారు చదువుచు చైతన్య భాసితులయి / సమత సాధించ వలెనంచు చాటినావు / భాను సమభాస అంబేద్కరా నమామి" అంటూ మహిళల చదువు ఆవశ్యకతను చాటి చెప్పారు. మాతృకవి, ప్రజాకవి, అంబేద్కర విప్లవ సాహిత్యరత్న మొదలగు బిరుదాంకితులైన రాధేయ విజయవాడ సాహిత్య సంస్థ వారి శ్రీశ్రీ సాహిత్య పురస్కారం, చౌటుప్పల అక్షర కళాభారతి విశిష్ట పురస్కారం అందుకున్నారు. తన తల్లి రాచమల్ల లచ్చుమ్మ స్మారకార్థం 2004 నుండి రాచమల్ల లచ్చుమ్మ మాతృ పురస్కారం అందజేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్టులైన అనేకమంది కవులు ఈ పురస్కారం అందుకున్నారు. డా.ఎం.పురుషోత్తమాచార్య, ఆచార్య ననుమాస స్వామి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, సుద్దాల అశోక్ తేజ, గోరెటి వెంకన్న, డా. కూరెళ్ల విఠలాచార్య, ఆచార్య యస్వీ సత్యనారాయణ, సవేర వారిలో కొందరు. అమ్మపై అభిమానంతో ఇంత గొప్ప పురస్కారమందిస్తున్న రాధేయ అభినందనీయులు. వీరి కలం నుండి మరిన్ని కావ్యాలు జాలువారాలని ఆకాంక్షిద్దాం.

**19.03.2019, అంకురం**

**నవతెలంగాణ**

## 10

# ఎల్లలు దాటిన తెలుగు సాహితీ సౌరభం "దక్షిణాఫ్రికా నానీలు"

**P**oetry is simply the most beautiful, impressive, and widely effective mode of saying things - Matthew Arnold.

మనసులో కలిగిన ఒక భావనను మిక్కిలి అందంగా, మిక్కిలి ప్రభావాత్మకంగా, విశాల దృక్పథంతో వ్యక్తపరచు సాధనం కవిత్వం. అతి తక్కువ పదాలతో విస్తృతమైన భావాలను వెదజల్లే కవిత్వం మరింతగా పాఠకుని మదిలో నాటుకుంటుంది. ఆ విధంగా గొప్ప భావసాంద్రతతో వచ్చిన ప్రక్రియ నానీలు. వృత్తిరీత్యా దక్షిణాఫ్రికాలో నివాసముంటున్న నల్లగొండ జిల్లా నేరడకు చెందిన కవి రాపోలు సీతారామరాజు రాసిన దక్షిణాఫ్రికా నానీలు ఈ కోవలోకి చెందినవే. చక్కని అభివ్యక్తి, గొప్ప భావస్ఫురణ, అవసరమైన చోట అందమైన అంత్యప్రాసలు 'దక్షిణాఫ్రికా నానీల' ప్రత్యేకతలు.

"ఖండాలు దాటాను / సంద్రాలు ఈదాను
కవిత్వం రుచి / ఎక్కడైనా ఒక్కటే"

కవిత్వం సార్వజనీనమైనదని, దానికి ప్రాంత, భాషా భేదాలు లేవని కవిత్వం పట్ల విశాల దృక్పథాన్ని ప్రకటిస్తాడు ఈ కవి. విదేశాల్లో జీవిస్తున్నా తన జన్మభూమి అయిన ఈ నేలపై మమకారం తగ్గని కవి.

"నాటి తెలంగాణ / కోటి రత్నాల వీణ
నేడు నాలుగుకోట్ల / రాగాల జాణ"

అంటూ తెలంగాణ ఉన్నతిని కీర్తిస్తాడు.

మనం చేసే ప్రతి పనిని మన పిల్లలు అనుకరిస్తారు. పిల్లల యొక్క ప్రవర్తనకు తల్లిదండ్రులే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కారకులవుతారు. ఈ విషయాన్ని నానీలో అందంగా ఆవిష్కరించాడు ఈ కవి.

"తప్పు ఎందుకు చేశావు? / తండ్రి ప్రశ్న
మీ బాటలోనే నడిచా / కొడుకు జవాబు"

సందర్భానుసారంగా ఉటంకించదగిన కవితాపంక్తులు ఈ నానీలలో ఎన్నో కనిపిస్తాయి. అంత్యప్రాసలు ఈ పంక్తులకు మరింత అందాన్ని చేకూర్చాయి.

"ఎన్నాళ్లు బతికావన్నది / నీ వయస్సు
ఎలా బతికావన్నదే / నీ యశస్సు"
"మనసు ఒక / కల్లోల సింధువు
మరి కన్నీరు / ఉపశమన బిందువు"

ఈ విధంగా నానీలంటే గాఢమైన అనుభూతికి చిహ్నమని, సాంద్రతర అభివ్యక్తికి చిరునామా అని కవి పేర్కొన్నాడు. కవిత్వాన్ని నిర్వచిస్తూ కవిత్వమంటే కమ్మని వాక్యాలు మాత్రమే కాదని, కరుణ ఉంటే రసాత్మక కావ్యం అని అభివర్ణించాడు. వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిది అందుకే..

"అమ్మ నీ కడుపు / తడుముతుంది
మరి నాన్న / నీ వెన్ను తడుతాడు"

అంటూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యతను గుర్తుచేస్తాడు. కవిత్వం అంటే కేవలం పదాల పొందిక కాదు. వర్డ్స్‌వర్త్ మహాశయుడు అన్నట్లు మనసు నుంచి ఉప్పొంగే భావాల పరంపరే కవిత్వం.

"భావాల దుప్పటి / కప్పుకున్నాను
కమ్మని పద్యాన్ని / కలగన్నాను"

అంటూ లోతైన భావం ఉన్న పద్యమే నిలుస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు. ఏ వ్యక్తి అంతరంగాన్నైనా పూర్తిగా అధ్యయనం చేయడం ఎంతటి మనో విజ్ఞానవేత్తలకైనా సాధ్యం కాదేమో. మనిషి యొక్క అసలు రూపం తన అంతరాత్మకే తెలుస్తుందని ఒక నానీలో చక్కగా చెప్పాడు.

"అద్దం చూపేది / ప్రతిరూపం
అంతరంగం చూపేది / అసలు రూపం"

సీతారామరాజు ఒక నానీలో చెప్పుకున్నట్లుగా అతడు అక్షర తపస్వి. అందుకే ప్రవాసంలో ఉన్నా కవిత్వం అతనికి వరమైంది. తాను పుట్టి పెరిగింది పల్లెటూర్లో కనుక తన నానీలలో రైతు జీవనాన్ని కూడా చిత్రించాడు.

"రైతన్నా! పంట / బాగా పండించావు
నీ బతుకు పంట / మాత్రం ఎండిందా"
"అమ్మ చాటలో / బియ్యం చెరుగుతుంది
రైతు పాదాల / చప్పుడు విన్నట్టు ఉంది"

మాతృభాషపై ఎనలేని మమకారం ఉన్న ఈ కవి కేవలం బతుకుతెరువు కోసమే అవసరం మేరకే ఆంగ్లభాషతో సావాసం చేస్తున్నానని ప్రకటిస్తున్నాడు.

"ఆంగ్లమతనికి / బతుకు తెరువు
తెలుగు భాష / జీవన లిపి"

పల్లెలు ప్రకృతికి నిలయాలని, పచ్చదనానికి ఆలవాలమని ఒకప్పటి మాట. ప్రపంచీకరణ పుణ్యమా అని నేడు పల్లెలు కలుషితమవుతున్నాయి. ప్లాస్టిక్ భూతం పల్లెలను అలుముకున్నది. ఈ విషయమై కవి ఆవేదన వ్యక్తం చేస్తూ

"ఊహల్లో మాఊరు / పచ్చగానే
వాస్తవంలో / అదిప్పుడు ప్లాస్టిక్ పల్లె"

అని ఆవేదన వ్యక్తం చేస్తూ సస్యాన్ని అందించే భూమిని నిర్లక్ష్యం చేయడం అంటే స్తన్యమిచ్చే తల్లి రొమ్మును గుద్దినట్లు అని ఉపదేశిస్తాడు. తాను ప్రస్తుతం నివాసముంటున్న దక్షిణాఫ్రికాపై కూడా తన మమకారాన్ని కురిపిస్తూ

"ఆఫ్రికా / చీకటి ఖండం కాదు
ఆదిమానవుడు / అగ్గి వెలిగించిందిక్కడే"
"వజ్రాలు దొరికే / నేల ఇది
ఓ నల్ల వజ్రము పుట్టింది / పేరు 'మండేలా'"

ఈ విధంగా సమాజానికి సందేశాత్మకమైన, భావస్ఫోరకమైన, నానీలను అందించాడు సీతారామరాజు. పాల్కురికి సోమనాథుడు చెప్పినట్లు అల్పాక్షరాల్లో అనల్పార్థం అన్న చందంగా సాగిన రచన వీరి కవిత్వానికి మరింత వన్నె తెచ్చింది. నానీల నాన్న గోపి గారి ఆశీస్సులు పుస్తకానికి అదనపు ఆకర్షణ. కవి సంక్షిప్త పరిచయం కూడా మలి ముద్రణలో చేరిస్తే పుస్తకం మరింత పరిపూర్ణం అవుతుంది. ఆధునిక కవిత్వాన్ని ప్రేమించే సాహితీప్రియులు అందరూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

**18.09.2019, అంకురం**
**నవతెలంగాణ**

# 11

## గురువుల ఔన్నత్యాన్ని చాటే 'ఆచార్యదేవోభవ'

**స**మాజంలో గురువు స్థానం అత్యున్నతమైనది. తల్లిదండ్రుల తరువాత వ్యక్తి జీవితంలో అత్యున్నతమైన వాడు గురువు. శిశువుకు విలువలను నేర్పించడం, మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువు పాత్ర ఎనలేనిది. అభివృద్ధిపథంలో నడిచే ప్రతి సమాజంలో గురువుల పాత్ర తప్పక వుంటుంది. ఆదర్శ ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడంతోనే సరిపెట్టుకోరు. ప్రపంచ గమనాన్ని అవగతం చేయడం ద్వారా విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధిస్తారు. ఆ ఆశయసాధన దిశగా దిశానిర్దేశం చేస్తారు. ప్రతి గురువూ తన వ్యక్తిత్వం ద్వారా విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తారు. అలాంటి గురువు ఎప్పటికీ విద్యార్థుల మనసుల్లో దేవుడుగా నిలిచిపోతారు. ఇటువంటి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని గురించి దోరవేటి రాసిన కథల సమాహారమే 'ఆచార్యదేవోభవ'.

దోరవేటి వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తిరీత్యా చేయితిరిగిన రచయిత, కవి. తాను ఉపాధ్యాయవృత్తిలో ఉండడంవల్ల ఆ వృత్తిలోని మంచి చెడులను పరామర్శిస్తూ రాసిన కథలివి. ఉపాధ్యాయవృత్తిలోని సాధకబాధకాలను సాధికారికంగా ఈ కథలలో చర్చించగలిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న వైరాలు, తద్వారా ఉపాధ్యాయవృత్తి పట్ల సమాజంలో తగ్గుతున్న గౌరవం, క్రమశిక్షణ పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతను హరింపజేస్తున్న తీరు ఇత్యాది విషయాలను ఎటువంటి భేషజాలు లేకుండా రచయిత ఈ కథలలో వివరించారు. ఉపాధ్యాయ సంఘాల పేరిట పాఠశాల ఎగ్గొట్టే తీరు, అవార్డుల కోసం కక్కుర్తి పడుతున్న విధానం నిర్మొహమాటంగా ఆవిష్కరించారు. ఉపాధ్యాయుడు సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఈ సంపుటిలో మొత్తం 16 కథలు చోటుచేసుకున్నాయి. పిల్లల ఆదరణకు మించిన అవార్డులు ఉండవని పిల్లల కళ్ళల్లో కనిపించే వెలుగులే నిజమైన అవార్డులనే సందేశాన్ని 'ఉత్తమోపాధ్యాయ' కథ అందిస్తుంది. ఇతర ఉపాధ్యాయుల గురించి చెడుగా మాట్లాడే ఉపాధ్యాయులకు, తాగి రోడ్లపై ఊగే ఉపాధ్యాయులకు చురకలంటించే కథ

‘లచ్చి దొంగ లక్ష్మణరావు’. భార్యాభర్తలు ఉద్యోగులయిన ఇంట్లో బాధలను ఏకరువు పెట్టే కథ ‘కిక్ పాయింట్’. ఉపాధ్యాయవృత్తిలో విలువలు దిగజారుతున్న విధానం, కులతత్వం, మతతత్వం వేళ్ళూనుకున్న వైనం, వ్యక్తిగత భావజాలాన్ని విద్యార్థులపై రుద్దుతున్న తీరును ఎండగట్టే కథ “నిర్మాతలు”. కరడుగట్టిన పాత భావాలను విడనాడి పరిస్థితులకనుగుణంగా తనను తాను దిద్దుకోగలవాడే ఉత్తమ ఉపాధ్యాయుడు అన్న సందేశాన్ని ఇచ్చే కథ ‘తథాస్తు’. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక ప్రహసనాన్ని నిలదీసే కథ ‘ఆచార్యదేవోభవ’. ఆడపిల్లలపై జరుగుతున్న యాసిడ్ దాడుల అఘాయిత్యాలకు పరిష్కారం చూపే కథ ‘విన్నపం’. పరీక్షల్లో కాపీయింగ్‌ని ప్రోత్సహించే పోలీసుల, ఉపాధ్యాయుల కథ ‘జరజూస్కో’. ఆలస్యంగా బడికి వెళ్లడం నచ్చని ఓ ఉత్తమ ఉపాధ్యాయుడి కథ ‘గుర్తింపు’. సెల్ ఫోన్ వల్ల తిప్పలను హాస్యస్ఫోరకంగా చెప్పిన కథ ‘ఇల్లాలు సెల్లాలు’. మంచి అలవాట్లను ప్రబోధించే కథ ‘టిక్.. టిక్.. టిక్..’. జీవితంలో విజయం సాధించడానికి మార్కులు మాత్రమే ప్రమాణం కాదు అని చెప్పే కథ ‘పశ్చాత్తాపం’. కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యార్థులు చదివేలా చేయాలని చెప్పే కథ ‘చదువు’. మతం కంటే మానవత్వం గొప్పది అని చెప్పే కత ‘దిద్దుబాట’. ఈ సంపుటికి తలమానికమైన కథ ‘సన్మానం’. ఆత్మీయతతో కాకుండా కేవలం మొక్కుబడిగా చేసే సన్మానాలు నిజమైన ఉపాధ్యాయుడికి తృప్తిని ఇవ్వలేవు అని చెప్పే కథ ఇది. రంగారెడ్డి మాస్టారు పాత్ర ద్వారా ఆదర్శ ఉపాధ్యాయుని లక్షణాలను అందంగా ఆవిష్కరించారు. ఎంతకాలం జీవించామని కాదు, ఏం సాధించావు అన్నదే ముఖ్యం అనే సందేశాన్ని ఇచ్చే కథ ‘చివరకు మిగిలేది’. ఈ విధంగా ఉపాధ్యాయవృత్తికి సంబంధించి అనేక కోణాలు ఈ కథల్లో చిత్రించబడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే గురువుల ఔన్నత్యాన్ని చాటిచెప్పిన కథలివి. వాస్తవిక జీవనాన్ని ప్రతిబింబించే ఈ కథలు పాత్రోచిత సంభాషణలతో పాఠకులను ఆకర్షిస్తాయి. ఉపాధ్యాయరంగంలోకి అడుగు పెట్టబోయే యువతరానికి స్ఫూర్తినిచ్చే కథలు ఇవి. ఉపాధ్యాయరంగంలో ఇప్పటికే స్థిరపడిన వారికి తమను తాము మెరుగుపరుచుకోవడానికి సాధనాలే ఈ కథలు.

**05.09.2019**

**నేటినిజం**

## 12

# చిందు బతుకుల జీవన చిత్రణ 'కొంగవాలు కత్తి'

అనాదిగా తెలుగు సాహిత్యంలో శిష్ట సాహిత్యంగా చెప్పబడుతున్న సాహిత్యంతోపాటు ఆశ్రిత కులాల ప్రజాసాహిత్యం కూడా సమాంతరంగా జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్నది. కానీ కొద్దిమంది పండితులు రాసిన కవిత్వమే గొప్పదిగా ప్రచారంలోకి రావడం వల్ల మెజారిటీ ప్రజలు ఆదరించిన సాహిత్యం కనుమరుగవుతున్నది. ఈ నేపథ్యంలో ఒక జాతి తన యొక్క సాంస్కృతిక మూలాలను అన్వేషించుకోవాలంటే ఈ ప్రజాసాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిందే. ఉత్పత్తి కులాల మూలాలను కళారూపాలుగా ప్రదర్శిస్తూ, సంచార జాతులుగా నివసిస్తూ కళా చైతన్యాన్ని నింపిన జ్ఞానులు చిందు కళాకారులు. సంగీత సాహిత్య సమ్రాట్టులైన వీరి కళావైభవం విస్మృతిలోకి జారుకునే పరిస్థితి ఏర్పడింది. కాబట్టి వీటిని ముందు తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత నేటి రచయితల మీద ఉన్నది. ఏ రచయిత అయితే తన మూలాలను మర్చిపోకుండా సాహిత్యం నిబద్ధతతో రాస్తాడో ఆ రచయిత రాసిన సాహిత్యం పదికాలాలపాటు నిలబడుతుంది. ఈ నేపథ్యం నుంచి వచ్చినదే 'కొంగవాలు కత్తి'. మాదిగ కులానికి ఆశ్రిత కులమైన చిందు కళాకారుల కుటుంబం నుంచి ఎన్నో కష్టాలకు ఎదురీది తన జాతి అనుభవిస్తున్న వేదనలను అక్షరబద్ధం చేసిన ప్రయత్నమే డాక్టర్ గడ్డం మోహన్‌రావు గారు రాసిన 'కొంగవాలు కత్తి'. ఇది ఆత్మకథాత్మక నవల. తెలుగు సాహిత్యంలోనే తొలి చిందు నవల. తన జీవితంలో ఎదురైన ఘటనలను చక్కని కథనంతో పాఠకులను ఆద్యంతం చదివించే నవల ఇది. చిందు కళ సమాహార కళ. సంగీతం, సాహిత్యం, నృత్యం, అభినయం మేళవించి నవరసాలు ప్రదర్శిస్తూ సాగే చక్కని కళారూపం. రామాయణ, భారత, భాగవతాది పురాణేతిహాసాలను చదువుకోలేని సామాన్య జనులకు ఆ విజ్ఞానాన్ని అందించినది ఈ కళనే. ఇంతటి అపురూపమైన కళకు మన సమాజంలో గౌరవం దక్కడం లేదు సరి కదా అంటరానితనం జాడ్యం వలన అవమానాల పాలవుతున్నది. ఈ తరతరాల వేదనను, కన్నీటి గాథలను హృద్యంగా అక్షరీకరించారు మోహన్‌రావు గారు. తాను చదువుకునే పాఠశాలలో తన క్లాస్‌మేట్ అయిన విద్యార్థిని తనకు నీళ్లు అంటరానివారికి పోసినట్లుగా దోసిలిలో

పైకెత్తి పోయడం, బావిలోకి నీరు తాగడానికి దిగితే అగ్రకుల అహంకారం తిట్టిన తిట్లు, తన నాయనమ్మ పండగపూట కూడా ఇల్లిల్లు తిరిగి అడుక్కొచ్చిన అన్నం తినడం తదితర సంఘటనలు హృదయమున్నవారిని కదిలించక మానవు. అంతెందుకు సమాజంలో తాము అంటరానివారుగా పరిగణింపబడుతున్నామని వేదన చెందే మాలమాదిగలు కూడా చిందు వారి పట్ల అంటరానితనాన్ని పాటించటం రచయితకు స్వానుభవం.

ఆదిజాంబవుని రెండవ కుమారుడైన డక్కలి ఎముకల నుండి విశ్వకర్మకు పనిముట్లు చేయించినందుకు ప్రతిఫలంగా ఆదిజాంబవునికి విశ్వకర్మ ఇచ్చిన ఆయుధం కొంగవాలు కత్తి. ఇది ఇంద్రుడి వజ్రాయుధాన్ని పోలి ఉన్న కత్తి. ఇంద్రుడి వజ్రాయుధం శత్రు సంహారానికి అయితే కొంగవాలు కత్తి ఉత్పత్తి సాధనం. ఈ నవలలో మాదిగ కులస్తులకు ఇతర ఉత్పత్తి కులాలకు గల సంబంధాన్ని రచయిత చక్కగా చిత్రించారు.

చిందు కళాకారులు మాదిగల వద్ద యాచించే విధానం, పెండ్లి, పురుడు, చావు తదితర సంప్రదాయాలను కొంగవాలుకత్తి చదివితే తెలుసుకోవచ్చు. యాచక కుటుంబంలో పుట్టిన ఓ పిల్లవాడు అష్టకష్టాలకోర్చి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన విధానం నేటి యువతరానికి స్ఫూర్తినిచ్చేదిగా ఉన్నది. కథానాయకుడు నరసింహారావు తన తండ్రి అనారోగ్యం పాలుకావడం వల్ల తన చెల్లెలు, తమ్ముల బాధ్యతను చూడడానికి కెమికల్ కంపెనీలో పని చేయడం, బోర్‌బండి పైపులు ఎత్తడం, ట్రాక్టర్ పనికి వెళ్లడం తదితర కూలీపనులు ఎన్నో చేసి కుటుంబపోషణకు సహాయపడుతూ తాను చదువుకోవడం విశేషం. తాను చదివిన పాఠశాలలోనే విద్యావాలంటీర్‌గా పనిచేస్తున్నప్పుడు అగ్రవర్ణాలవారు అంటరానివాడైన చిందుకులస్తుడు తమ పిల్లలకు అన్నం పెట్టడం సహించలేకపోతారు. పల్లె తల్లి వంటిది పట్నం ప్రియురాలి వంటిదనే మాటలు రచయితకు సమంజసంగా తోచలేదు. పట్నంలో పల్లెల్లోకంటే అంటరానితనం తక్కువ. హెూటల్‌లో అందరు తాగిన గ్లాసులనే, అందరు తిన్న ప్లేట్‌లనే అందరూ ఉపయోగిస్తుండడాన్ని చూసి అక్కడలేని అంటరానితనం పల్లెల్లో ఎందుకు అని ఆవేదన చెందుతాడు. ఇంటర్లో చదువు మానేసినా తిరిగి డిస్టెన్స్‌లో చదువుకొని తదనంతరం కేంద్రీయ విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్య చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి ఉన్నత విద్యావంతుడుగా ఎదగడం కొసమెరుపు. చదువే సమాజంలోని అపసవ్యాలకు, అసమానతలకు విరుగుడు అని ఈ నవల నిరూపిస్తున్నది.

ఇది రచయిత రాసిన తొలి నవల అయినా ఎంతో చేయితిరిగిన రచయిత రాసిన నవలలాగా అనిపిస్తుంది. చక్కని శిల్పం, పాత్రోచిత భాష, అవసరమైన చోట వర్ణనలు, అందమైన గ్రామీణ జీవన చిత్రణ ఈ నవలకు అదనపు ఆకర్షణలు. నల్లగొండ జీవద్భాషను రికార్డు చేసిన నవల ఇది. నవలలో కథానాయకుడి తల్లి, తండ్రి, అమ్మమ్మ, తాత హాజీపూర్ నుండి నెమరుగొముల వెళ్లే సందర్భంలో తెల్లవారుజామున మసక చీకటిలో పిల్లబాటను వర్ణిస్తూ "చేను చెలకల మధ్య భూతల్లి నుదిటి పాపటలాగ పిల్లబాట కొంచెం తెల్లతెల్లగా కనిపిస్తున్నది" అంటూ దృశ్యమానం చేస్తాడు. జాంబవంతుని వేషాన్ని వర్ణించే క్రమంలో కనుబొమ్మలు సింగిడీల తలపిస్తున్నాయి అంటాడు. కనురెప్పలు తుమ్మెదలను పోలి ఉన్నాయి అంటాడు. గ్రామీణ సంభాషణల్లో సహజమైన జీవద్భాషను ఉపయోగించారు. యథార్థ భాష, యథార్థ సంఘటనలే ఈ నవలకు మరింత గుర్తింపు తెచ్చాయి. ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు గారు అభిప్రాయపడినట్లు ఇది ఒక సామాజిక ఇతిహాసం. నేటితరానికి చిందు వారసత్వాన్ని అందించే వారధి. తరతరాలుగా అణచివేయబడిన ఒక జాతి వేదన. మోహన్‌రావుగారి ఈ తొలి నవలకే నవతెలంగాణ పురస్కారం, విశాల సాహిత్య అకాడమీ పురస్కారం, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ పురస్కారం మరియు అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించడం 'కొంగవాలు కత్తి' ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది.

**16.09.2019**

**మన తెలంగాణ**

13

# సామాజిక చైతన్య పతాక – కాళోజీ

**T**he politician wants men to know how to die courageously; the poet wants men to live courageously. - Italian poet, Salvatore Quasimodo, Nobel lecture, 1959.

సమాజంలో మనిషి ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని జీవించడానికి తగిన ప్రేరణ ఇవ్వగలిగినవాడే కవి. సమాజాన్ని మేల్కొలిపేవాడే కవి. అటువంటి ప్రజాకవి కాళోజీ. తిరుగుబాటు, నిలదీత, ధిక్కారం, నిజాయితీ, ఆక్రోశం, ఆవేదన, దు:ఖం, ఆత్మీయతల కలబోత కాళోజీ నారాయణరావు. తన జీవితమంతా ఉద్యమాలలో మమేకమై సామాన్య ప్రజలపక్షాన పోరాటం చేసిన అక్షరయోధుడు కాళోజీ నారాయణరావు. ప్రతి వ్యక్తి జీవితంలోనూ వ్యక్తిగత జీవితము, సామాజిక జీవితము అనే రెండు పార్శ్వాలు ఉంటాయి కానీ తన వ్యక్తిగత జీవితమే సామాజిక జీవితంగా బతికిన నికార్సైన సామాజిక సేవకుడు కాళోజీ. ప్రజల భాషలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రజాసమస్యలే ఇతివృత్తంగా ప్రజల కోసం కవిత్వం రాసిన ప్రజాకవి కాళోజీ. ఏ ఇజానికి కట్టుబడక నిజాన్ని మాత్రమే చాటిన కాళోజీ అందరికీ ఇష్టుడైన కవి. కాళోజీ నిజమైన ప్రజాస్వామ్యవాది. రాజ్యహింసను వ్యతిరేకించాడు. సమాజంలో వ్యవస్థీకృతమైన ఏ పార్టీని గానీ సిద్ధాంతాన్ని గానీ గుడ్డిగా అంగీకరించని యదార్ధవాది కాళోజీ. కనుకనే తన జీవితమంతా ధిక్కారస్వరాన్ని వినిపిస్తూ సాగాడు.

“అన్నపు రాసులు ఒకచోట / ఆకలి మంటలు ఒకచోట
కమ్మని చక్కిలాలు ఒకచోట / గట్టి దవడలు ఇంకొకచోట
అనుభవం ఉన్నది ఒక చోట / అధికారంబది ఒకచోట”

అంటూ ‘వ్యత్యాసాలు’ కవితలో సమాజంలో ఉన్న హెచ్చుతగ్గులను తూర్పారాబట్టాడు. సమాజంలో ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగినా కాళోజీ వెంటనే స్పందించేవాడు. 1948లో జనగామ తాలూకా, బైరాన్ పల్లి గ్రామంలో రజాకార్లు జరిపిన క్రూరమైన దాడికి నిరసనగా..

“మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన

మానవాధములను మండలాధీశులను
మరిచిపోకుండా గుర్తుంచుకోవాలి
కసి ఆరిపోకుండా బుస కొడుతూ ఉండాలి
కాలంబు రాగానే కాటేసి తీరాలె"

అంటూ ప్రజల్లో ఒక కసిని రగిల్చి రజాకార్లకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలు తిరగబడేలా కవిత్వ అస్త్రాన్ని సంధించారు.

కాళోజీ గొప్ప మానవతావాది. జీవితమంతా అన్యాయాలకు వ్యతిరేకంగా ఎదురీదినాడు. పాలితులు, బాధితులు, పీడితులు, దీనులపక్షం వహించి పాలకులపై, రాజ్యంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. ఆంధ్రరాష్ట్రంలో కలవడం వల్ల తెలంగాణకు జరగబోయే అన్యాయాన్ని ముందుగానే పసిగట్టిన దార్శనికుడు కాళోజీ.

"రెండున్నర జిల్లాలదే / దండి భాష అని అంటవా
తక్కినోళ్ల నోళ్ల యాస / తొక్కి పెట్టవలెనంటవా"
అంటూ తెలంగాణ భాషకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాడు.
"ప్రాంతేతరుడు దోపిడి చేస్తే / పొలిమేరదాకా తన్ని తరుముతం
ప్రాంతంవాడే దోపిడిచేస్తే / ప్రాణంతోనే పాతర వేస్తం"

అంటూ దోపిడీకి వ్యతిరేకంగా నినదించాడు. ఈ విధంగా తన జీవితం నుండి తెలంగాణ ఉద్యమం విడదీయలేనిది. కాళోజీ విశ్వమానవుడు. ప్రపంచంలో ఎక్కడ మానవులు బాధపడినా అది తన బాధగా భావించి స్పందించే హృదయం ఉన్నవాడు. ఎక్కడో ఎన్‌సాల్వడార్‌లో భూకంపం వచ్చి ప్రజలు మరణించారన్న వార్త పత్రికలో చదివి తీవ్రంగా దు:ఖించిన కరుణ రసహృదయులు కాళోజీ. గాంధేయవాదిగా ముద్రపడినా అవసరమైనప్పుడు ప్రతిహింసను సమర్థించాడు. బతుకులు చితికిపోతున్నప్పుడు శాంతి మంత్రం తగదని తేల్చిచెప్పాడు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ధిక్కరించాడు. పార్టీవ్రత్యం పనికిరాదని తేల్చిచెప్పాడు. కాళోజీ ఆలోచన సామ్యవాద పంథాలో కనిపించినా ఆయన కమ్యూనిస్టుగా ఎప్పుడూ ముద్రపడలేదు. రాజకీయ నిబద్ధత కంటే హృదయ నిబద్ధతే గొప్పదని భావించినవాడు.

కాళోజీ ప్రజాసమస్యలు ఇతివృత్తంగా కవిత్వం రాశాడు. సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం కాళోజీ కవిత్వంలో మేళవిస్తాయి. ప్రజల భాషలో కవిత్వ అభివ్యక్తి, ఆయన కవిత్వాన్ని సామాన్యుడికి చేరువ చేసింది. నిరంకుశ నిజాం ప్రభువును సైతం ధైర్యంగా ఎదిరించి కవిత్వం రాసిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరు.

"నవయుగాన నాజీ వృత్తుల / నగ్న నృత్యమింకెన్నాళ్లు

...... ....... ...... ....

దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకొని / దొరలై వెలిగేదెన్నాళ్లు"

అంటూ రైతు కూలీలపై నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగిన ఆంధ్రమహాసభలో కామ్రేడ్ రావి నారాయణరెడ్డి కాళోజీని ప్రజాకవి అని సంబోధించారు. అది కాళోజీ బిరుదుగా స్థిరపడిపోయింది. కాళోజీ 'నా గొడవ'ను 1953లో మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్‌లో జరిగిన సాహిత్య సభలలో మహాకవి శ్రీశ్రీ ఆవిష్కరించారు. ఆ సందర్భంలోనే కాళోజీని శ్రీశ్రీ ఫ్రాన్స్ ప్రజాకవి లూయిస్ ఆరగాన్‌తో పోల్చారు.

తన జీవితమంతా ప్రజలకోసమే ఆరాటపడుతూ అన్ని ప్రాంతాలను తిరుగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ, ఉద్యమాలకు ఊపిరి ఊదుతూ, పదవులను తృణప్రాయంగా భావిస్తూ స్వార్ధరహితంగా బతికిన మహెూన్నతుడు కాళోజీ.

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్ని ఎదిరించిన వాడు నాకు ఆరాధ్యుడు"

అంటూ అన్యాయంపై తన కలాన్ని సంధించిన కలంయోధుడు కాళోజీ. మానవహక్కులు ఉల్లంఘించబడినచోట కాళోజీ అగ్నికణమై జ్వలించాడు.

"పౌరుల హక్కులరక్షణ ఏమరక చేతమనుచు
ఏ వ్యక్తికి అన్యాయము జరుగకుండా చూతుమనుచు
వ్యక్తికి వ్యక్తికి నడుమ వ్యత్యాసము పాటించమనుచు"
ప్రమాణం చేయాలని ఉద్బోధించాడు.
"దోపిడీ వర్గాలను నీవు అదుపులో పెట్టనప్పుడు
పీడిత వర్గాలను నేను తిరగబడమంటే తప్పా?"

అని కరాఖండిగా ప్రశ్నించాడు. కవిత్వంలోనే కాదు, కథల్లో కూడా కాళోజీ అసమానత్వంపై తిరుగుబాటు చేశాడు.

ఊహాలపల్లకిలో విహరించకుండా, కాల్పనిక కవిత్వం రాయకుండా ప్రజా ఆకాంక్షల కోసమే కవిత్వం రాసి సమాజం కోసం, సామాజిక న్యాయం కోసమే జీవితమంతా తపించి చివరకు తన పార్థివదేహాన్ని కూడా సమాజం కోసం సమర్పించిన త్యాగమూర్తి కాళోజీ. అసమానత ఉన్నంతకాలం, అన్యాయం అంతమయ్యేవరకు కాళోజీ ప్రజాకవిగా చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

**04.09.2019, అంకురం, నవతెలంగాణ**

14

# తెలుగు వెలిగేదెలా?

"**అ**మృత నిష్యందివల్లకీహ్లాదమునకు
రాగిణీ దివ్య సమ్మోద రాగమునకు
తేనె తేటల నవకంపు సోనలకును
సాటియగును మా తెలుగు భాషామతల్లి"

– సురవరం ప్రతాప రెడ్డి

సుమారు రెండువేల యేండ్లకు పూర్వమే మూల ద్రావిడ భాషనుండి క్రమేణా స్వతంత్రభాషగా ఎదిగి విలసిల్లుతున్న ప్రాచీనభాష తెలుగు. త్రిలింగ దేశంలో (శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం మధ్య ప్రాంతం) మాట్లాడే భాష తెలుగు. అనాదిగా రాజ సన్మానాలందుకొన్న భాష. విదేశీయులచే ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కీర్తించబడిన భాష. సుందర తెలుంగు అని తమిళ సోదరులతో కొనియాడబడిన భాష. ఎంతో ఘన చరిత్ర గలిగిన మన భాష ఇప్పుడు అంపశయ్యపై ఉందనే కొందరు భాషాభిమానుల ఆందోళనలో కొంతైనా నిజం లేకపోలేదు. ఈ నేపథ్యంలో భాషల ఉనికి, వికాసం, భాషాభివృద్ధిలో సమాజం, పాలకుల పాత్రలను పునరావలోకనం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భాష భావవాహకం. భావగ్రహణానికి, భావవ్యక్తీకరణకు మానవుడు ఏర్పరచుకొన్న వాగ్రూప సంకేతాలే భాష. ఈ సంకేతాలు ప్రాంతాల దూరం పెరిగిన కొద్దీ మారినవి. వేరు వేరు భాషలుగా ఎదిగినాయి. ఇది భాష పుట్టుక నేపథ్యం. నేడు శాస్త్ర సాంకేతికత పెరిగింది. ప్రపంచమే కుగ్రామమైంది. ఈతరుణంలో ప్రపంచంలోని అనేక భాషలు ఒక కుదుపుకు లోనైనాయని చెప్పవచ్చు. ఒక భాష ప్రభావం మరొక భాషపై పడింది. దీని వలన కొంత మేలుతో పాటు కీడు కూడా జరిగిందని చెప్పక తప్పదు. ఆ క్రమంలో తెలుగు భాషకు ఒనగూరిన ప్రయోజనము, నష్టమూ సమీక్షించుకోవాలి. తెలుగుపై ఆంగ్లభాష ప్రభావం వలన అనేక నూతన ప్రక్రియలు పురుడుపోసుకున్నాయి. కథ, నవల, ప్రహసనం, నాటిక ఇత్యాది ప్రక్రియలు పాశ్చాత్య భాషల ప్రభావంతోనే వేళ్లూనుకున్నాయి. అరబ్బీ, ఫారసీ భాషల ప్రభావ ఫలితంగా గజల్, రుబాయి వంటి ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. విదేశీ సాహిత్యం తెలుగులో అనేక సాహిత్య ఉద్యమాలకు కేంద్ర బిందువైంది. పాశ్చాత్య భాషల ప్రభావ ఫలితంగా

తెలుగులో ప్రాచీన ప్రక్రియలైన పద్యం, ప్రబంధం వంటి ప్రక్రియలు కొంత నిరాదరణకు గురైనాయి. ఆంగ్ల ప్రభావ ఫలితంగా నేడు తెలుగుభాషకు ఎదురవుతున్న పెను సవాల్ ఏమిటంటే నేటితరం పిల్లలు కనీసం ప్రాథమికస్థాయి వరకైనా తెలుగు భాషను అభ్యసించడం లేదు. ఒకవేళ ఒక సబ్జెక్టుగా చదివినా మొక్కుబడి తంతుగా కొనసాగుతుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకో రెండు మూడు దశాబ్దాల అనంతరం తెలుగు భాష అంపశయ్యపై నిలువడం ఖాయం.

నేడు అనేక భాషలు అంతర్థానమయ్యే స్థితిలో వున్నాయి. ఆంగ్లభాష పదఘట్టనలో ఇప్పటికే బిక్కచిక్కిన మాతృభాషలెన్నో నలిగి కనుమరుగైపోయాయని ఇటీవలి యునెస్కో సర్వే తేల్చింది. ప్రపంచంలో సుమారు 230 భాషలు అంతరించాయి. ఇంకా 3 వేల భాషలు అంతరించే దశలో ఉన్నాయని యునెస్కో వెల్లడించింది. ఈ భాషల జాబితాలో తెలుగు భాష ఉందని యునెస్కో ప్రకటించింది. ఒక భాషను మాట్లాడే జనాభాలో ముప్ఫై శాతం మంది ఆ భాషను చదవకుండా, తల్లి భాషకు దూరమైతే ఆ భాష కాలక్రమంలో మృతభాషగా మారుతుందని యునెస్కో సూత్రీకరించి, తెలుగుకు ఆ పరిస్థితి రాబోతుందని ప్రకటించింది. ఇది తెలుగు భాషాభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగవుతున్నదనడం కలవరపాటు కలిగిస్తుంది. భారత్‌లో నలభైకి పైగా భాషలు, మాండలికాలు అదే ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నాయి. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గదబ, నైకీ అనే గిరిజన తెగల భాషలున్నాయి. పదివేల మంది కంటే తక్కువగా మాట్లాడే భాషలు క్రమంగా కాలగర్భంలో కలిసిపోతాయని పరిశోధకులు చెబుతున్నారు.

మనదేశంలో 780 భాషలకు పైగా ఉనికిలో ఉండగా, గత 50 ఏళ్లలోనే 220 భాషలు కనబడకుండాపోయాయి. దీనిని బట్టి భారతీయ భాషలు ఎంత వేగంగా అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయన్నది స్పష్టమవుతోంది.

జననగణన డైరెక్టరేట్ నివేదిక ప్రకారం మనదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలతో పాటు, లక్ష మందికి పైగా మాట్లాడే వంద నాన్ షెడ్యూల్డ్ భాషలున్నాయి. అయితే యునెస్కో రూపొందించిన కనుమరుగయ్యే ప్రమాదమున్న భాషలు, మాండలికాల జాబితాలో 40 భారతీయ భాషలున్నాయి. ఈ భాషలను పదివేలమంది కంటే తక్కువ మాట్లాడుతున్నారు. అందువల్ల ఈ భాషలు అంతరించే ప్రమాదముందని భాషావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మనుగడ కోసం పరభాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృభాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటా ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్న విషయం విదితమే.

ప్రపంచ భాషలలో 16వ స్థానం, భారతదేశంలో 3వ స్థానంలో ఉన్న తెలుగును కాపాడుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత. దీనికి ప్రభుత్వాలు కొంత మేర కృషిసల్పినాయని చెప్పవచ్చు. తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం, తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య అకాడమీ, తెలంగాణ సారస్వత పరిషత్ తదితర సంస్థల ద్వారా తెలుగు పరిరక్షణకై కొంత కృషి జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఒక ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. ఇంకా జరగవలసిన కృషి ఎంతో ఉంది.

తెలుగు భాష మనుగడకు నేడు ప్రమాదం ఏర్పడింది. అందువల్ల భాషాపరిరక్షణకు ప్రభుత్వంతోపాటు పౌరసమాజం కూడా కృషి చేయాల్సిన అవసరముంది. భాష అంతరిస్తే దానితోపాటు సంస్కృతి, విలువలు, విజ్ఞానం కనుమరుగవుతాయి. ఆంగ్లభాషపై మోజుతో మాతృభాషలను నిర్లక్షం చేయవద్దు. పదివేల కంటే తక్కువ మంది మాట్లాడే భారతీయ భాషలపై దృష్టి కేంద్రీకరించి వాటి పురాతన గ్రంథాలను డిజిటలైజ్ చేయాలి. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికతను భాషాభివృద్ధికి వినియోగించాలి. భాషల పరిరక్షణకు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడమే కాదు వాటి అమలుకు కృషి జరగాలి.

విధిగా అన్ని యాజమాన్య పాఠశాలలో ప్రాథమిక విద్య తెలుగులోనే కొనసాగేటట్టు చట్టం చేయాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక తెలుగు భాషోపాధ్యాయుడిని నియమించాలి. ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర వృత్తి విద్యాకోర్సులను కూడా తెలుగులో అధ్యయనం చేసేలా ఆయా సిలబస్ తెలుగులోనికి అనువాదం జరగాలి. సంబంధిత పారిభాషిక పదజాలం తెలుగులో అభివృద్ధిపరచాలి. విద్యార్థులలో మాతృభాషపై మమకారం పెంచేలా, వారిలోని సృజనను వెలికితీసేలా పాఠశాల స్థాయిలో నిపుణులతో కార్యశాలలు నిర్వహించాలి. మరీ ముఖ్యంగా మాతృభాషలో అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. అంతేగాని ప్రపంచసభలు చేసినంత మాత్రాన తెలుగు పరిఢవిల్లుతుందనుకోవడం అత్యాశే అవుతుంది.

**29.08.2019, నేటినిజం**

15

# బడుగు జీవుల బతుకు చిత్రణ భూతం ముత్యాలు సాహిత్యం

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యానికి పరిచయంలేని నుడికారాన్ని, పదజాలాన్ని, యాసని, భాషని దళిత సాహిత్యం సమాజానికి అందించింది. దున్న ఇద్దాసు, జాషువా, కుసుమ ధర్మన్న, జాలా రంగస్వామి, భాగ్యరెడ్డివర్మ లాంటి సాహితీవేత్తలు మొదలు మద్దూరి నగేష్‌బాబు, కలెకూరి ప్రసాద్, పైడి తెరేష్‌బాబు, నాగప్పగారి సుందరరాజు, ఎండ్లూరి సుధాకర్, వేముల ఎల్లయ్య, పసునూరి రవీందర్ వరకు ఎందరో దళిత చైతన్య స్పృహతో రచనలు చేస్తున్నారు. ఈ కోవలోనే దళిత సాహిత్యంలో తనదైన ముద్రవేసిన బలమైన రచయిత భూతం ముత్యాలు.

"అసమానత్వమే హిందూమతం యొక్క ఆత్మ" అన్నారు బాబాసాహెబ్ అంబేడ్కర్. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న మార్క్సు మాట ఏదేశానికైనా వర్తిస్తుందేమోగాని ఈ దేశంలో మాత్రం మానవ సంబంధాలని కూడా నియంత్రిస్తున్నవి కుల సంబంధాలే అంటారు. అంబేద్కర్ భావజాలం పునాదిగా దళిత సాహిత్య తాత్వికత ఏర్పడింది. కేవలం భావంలోనే కాక దళితవాడలలో మాట్లాడే జీవద్భాష కూడా దళితకవుల చేత రికార్డు చేయబడుతున్నది. ఇలా దళితుల భాషకు పట్టం గడుతున్న కవి, రచయిత భూతం ముత్యాలు. భూతం ముత్యాలు జూన్ 10వ తేదీ 1971లో నాంపల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో భూతం మల్లయ్య, మల్లమ్మ దంపతులకు జన్మించారు. ఒకటి నుండి 3వ తరగతి వరకూ తిరుమలగిరిలో, 4 నుండి ఇంటర్ వరకూ దేవరకొండలో, డిగ్రీ హైదరాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో, బి.ఇడి నల్లగొండలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లో డిగ్రీ చదివే రోజుల్లో ఖర్చుల కోసం సాయంత్రం వేళల్లో రిక్షాలాగడం, హెూటళ్లలో పని చేశారు. తన బాల్యదశ నుండే తండ్రి రిక్షా కార్మికుడు, అమ్మ దినసరి కూలీ. ఇండ్లల్లో పాచి పని చేసేది. కులము మాల. కులవృత్తి మాలబేగరి. ఊరిలో ఎవరైనా చనిపోతే వారికి బొందలు తోడడం లేదా వారికి కాష్టం పెట్టడం. వారికి వతనుగా వచ్చిన ఏడు తన అమ్మ ఈ వృత్తి చేసేది. తాను పెరిగిన వాతావరణం, తాను పడిన కష్టాలు, అనుభవించిన అవమానాలే భూతం ముత్యాలు సాహిత్యానికి ఇతివృత్తాలు. ఎన్నో కష్టాలకోర్చి చదువుకొని నేడు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు.

ప్రముఖ కవి వేముల ఎల్లయ్య ప్రోత్సాహంతో ఆయన సాహిత్యరంగంలో ముందుకు సాగుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో చదివినప్పటి నుండి కవితలు, రచనలు చదివేవారు. గురజాడ అప్పారావు ముత్యాల సరాలు, దేవరకొండ బాలగంగాధర్ తిలక్, కాళోజీ నారాయణరావు రచనలు ఆయనపై ప్రభావం చూపాయి. కలెకూరి ప్రసాద్ రచించిన గోస, బాధ రచనలు కూడా ఆయన ఇష్టపడి చదువుతుంటారు. భూతం ముత్యాలు కవి, రచయిత, పరిశోధకుడుగా మాత్రమే కాదు చిత్రకారుడిగా కూడా తన బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నారు. బాల్యదశ నుండే మంచి ఆర్టిస్టు. డిగ్రీ కళాశాల స్థాయిలో తాను గీసిన చిత్రానికి బహుమతి పొందారు. ఇప్పటికీ తన పాఠశాలలో, తాను పనిచేసిన కొన్ని ఇతర పాఠశాలల్లో గీసిన చిత్రాలు చెక్కుచెదరకుండా వున్నాయి.

భూతం ముత్యాలు కవిత్వంతో పాటు అనేక నవలలు, కథాసంపుటాలు మరియు ఇతర ప్రక్రియలలో రచనలు వెలువరించారు. 2003లో 'దుగిలి' దళితకవిత్వం రచించారు. ఇందులో దళితుల జీవితాలు, సంస్కృతి, భాషను చక్కగా చిత్రించారు. ఈ పుస్తకంలో ఉన్న 'గొంతు', 'బర్రె' కవితలు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. 2004లో 'సూర' (దళిత జీవితం రెండు తరాల కుటుంబ వ్యథ) అనే నవలను రాసారు. ఇందులో తల్లిదండ్రులు పేదరికంలో ఉంటూ అన్ని రకాలుగా నష్టపోయినా వారికున్న పుత్రుడు మాత్రం కష్టపడి ఉన్నతస్థాయికి ఎదుగుతాడు. సూర నవలని ఆత్మకథనాత్మక శైలిలో రాసారు. వలస బతుకులు, బతుకుదెరువు ఊగిసలాట, దళితుల అణచివేత, కులవృత్తుల ధ్వంసం, సాంఘిక బహిష్కరణ దళితుల జీవితాల్లో నిత్యకృత్యాలే. అలాంటి జీవితపు యదార్థగాథే ఈ నవల పేరు, పాత్రల పేర్లు. ప్రాంతం పేరు కల్పితమైనా రచయిత జీవిత సంఘటనల రూపమే ఈ నవల. అంబేద్కర్ ఆలోచనా విధానం గ్రామాల్లో మార్పు రానంతవరకూ రూపుదాల్చదు. అలా జరగాలంటే కులాంతర వివాహాల ప్రోత్సాహం, కులనిర్మూలన, ఇతర మత స్వీకరణ, తమ అస్థిత్వాన్ని తెలపడం, నిల్పుకోడం, అవాంతరాలెన్నైనా ఎదురొడ్డి నిల్వడం ఇదే ఈ నవల సారం. ఐతే దళిత నవలల్లో కనిపించని ఒకే ఒక అంబేద్కర్ ఆశయం కులాంతర వివాహం ఈ నవలలో కానవస్తుంది. ఈ పుస్తకాన్ని కాకతీయ యూనివర్శిటీ తెలుగు 4వ సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టుగా పెట్టారు. 2007లో 'పురుడు' (మాలల సంస్కృతి, జీవితాల గురించి) రాశారు. 2010లో 'బేగరి కథలు' (దళిత మైనార్టీల గురించి) రాశారు. ఇందులో పేద ముస్లిం మహిళ రజియా ఎదుర్కొన్న జీవిత కష్టాల గురించి రాశారు. భూతం ముత్యాలు రాసిన 'బేగరి కథలు' సంపుటిని 'గుంపు' సాహితీసంస్థ ప్రచురించింది. ఈ కథల్లో ముత్యాలే చెప్పినట్టు "2000 సంవత్సరం నుండి సమాజంలో వస్తున్న

పరిణామాలు, ఆర్థిక అసమానతలు, గ్రామీణ నేపథ్యం, అణగారిన కులాలు, జీవన సమరంలో వారి ఆశలు ఆవిరి అవుతున్న తీరు, రిజర్వేషన్లు, పెద్దకులాలు మతమార్పిడితో దోచుకుంటున్న తీరు, గ్రామీణులపై గ్లోబల్ ప్రభావం, బతకనీకి దిగజారుతూ పై కులాల అవసరాల కోసం మారుతున్న తీరు"ను సమగ్రంగా చర్చించడం జరిగిందని డా. బెల్లి యాదయ్య అభిప్రాయపడ్డారు. 2012లో 'ఇగురం' అనే నవల రాశారు. 2013లో 'మాండలికం' (తెలంగాణ కులవృత్తి పదకోశం) అనే డిక్షనరీని రాశారు. 2014లో 'బుగాడ కథలు' (దళిత జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా ఆవిష్కరించిన కథలు) రాశారు. ఇందులో మహిళల కష్టాలు, దు:ఖాలను వివరించారు. 2015లో 'నియతి'ని రాశారు. తను, తన చుట్టూ అల్లుకుని వున్న మనుషులు మాట్లాడే సజీవ మాండలికంలో రాసిన కథలు ఇవి. ఈ సంపుటిలో ఉన్న మొత్తం 16 కథలు కూడా తెలంగాణలోని తన ప్రాంతపు మాండలికంతో మమేకమై రాసారు భూతం ముత్యాలు. మట్టి మనుషుల జీవితాలు పచ్చిపచ్చిగా మాండలికపు సొంపుతో పాఠకుడి మనసును గాఢంగా హత్తుకుంటాయి. అలాగే 2016లో 'మొగలి' నవల, 2017లో 'మాలవారి చరిత్ర', 2018 లో 'చదువు' నాటకం రాసారు.

భూతం ముత్యాలు రచనలలో 'మొగలి' నవలలో వాడుక భాషా సౌందర్యం తొణికిసలాడుతది. పదజాలం, పలుకుబడి, నుడికారం, పదవిన్యాసం జవజవలాడుతది. దళితవాడ మనుషుల వేషధారణ, వేషభాషలు, జీవన విధానాన్ని, వారి కుటుంబ ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలను మన కళ్లముందు వుంచుతారు రచయిత. దళితవాడలోనివారి దైనందిన జీవన విధానాన్ని అతని రచనలలో మనం చూడవచ్చు. అలాగే పదజాలంలో తెలంగాణ భాష నుడికారం, పలుకుబడి సామెతలు విరివిగా ఉపయోగించి పాఠకుల మదిచూరగొంటారు. ఇది తను దళితుడైనందువల్లనే వారి ఈతిబాధలను స్వీయానుభవంతో అక్షరబద్ధం చేసారు.

భూతం ముత్యాలు సాహితీవేత్తగా, ఉత్తమ ఉపాధ్యాయుడుగా అనేక పురస్కారాలు అందుకున్నారు. 2003 విద్యాశాఖ మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2017 జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2017 జూన్ 02 జిల్లాస్థాయి తెలంగాణ రాష్ట్ర సాహిత్య పురస్కారం పొందడం జరిగినది.

అలాగే ప్రస్థానం పత్రికలో ప్రచురణ పొందిన వ్యాసానికి పురస్కారం లభించింది. కొన్ని కథలకు పారితోషికాలు అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం లక్ష పదాల మాండలిక పదకోశ నిర్మాణంలో నల్లగొండ జిల్లా ప్రతినిధిగా సేవలందిస్తున్నారు. వీరి నుండి మరిన్ని ఉత్తమ కావ్యాలు రావాలని ఆకాంక్ష.

**26.06.2019, అంకురం, నవతెలంగాణ**

# 16

# కథల మాంత్రికుని 'గజ్జెల దెయ్యం'

దెయ్యం అంటే చాలు, అందరిలోనూ భయంతో కూడిన ఆసక్తి మొదలవుతుంది. ఇది పిల్లల్లోనైతే మరీ ఎక్కువ. అనాదిగా వస్తున్న జానపద కథల్లో దెయ్యాలది అగ్రస్థానం. చందమామ, బాలమిత్ర కథల్లో కూడా రకరకాల దెయ్యాలు మనకు సుపరిచితం. ఐతే ఈ దెయ్యాల కథలను సరదాగా చదివి వదిలేస్తే నష్టం లేదుగానీ అవన్నీ నిజాలేనన్న భ్రమకు లోనైతే మాత్రం అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా రేపటి తరానికి వారసులైన పిల్లలను ఈ విధమైన ఆలోచనలు బలహీనులుగా మారుస్తాయి. మరి పెండెం జగదీశ్వర్ కూడా 'గజ్జెల దెయ్యం' పేరుతో ఇలాంటి కథలే రాశారా? అన్న అనుమానం ఆ పేరు విన్నవాళ్ళందరికీ కలగక మానదు. కానీ పిల్లల్లో మూఢనమ్మకాలను పోగొడుతూ వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో రాసిన పుస్తకం ఇది. ఒక దెయ్యం పేరునే ఈ పుస్తకానికి పెట్టి తద్వారా పిల్లల్లో ఆసక్తిని కలుగజేసి, చదివింపజేసే ప్రయత్నం చేశారు పెండెం జగదీశ్వర్. ఈ పుస్తకం 2015 సంవత్సరానికిగాను ఉత్తమ సాహితీగ్రంథంగా శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం పొందింది.

వివిధ పత్రికల్లో తాను రాసిన అనేక కథల్లోంచి 12 కథలను ఎంపిక చేసుకొని 'గజ్జెల దెయ్యం'గా అందించారు రచయిత పెండెం జగదీశ్వర్. ఈ కథలన్నీ సరదాగా మొదలై చివరకు సీరియస్‌గా ఆలోచింపజేస్తూ ముగుస్తాయి. ఇప్పటిదాకా తాము మాయలుగా, మంత్రాలుగా భావింపబడుతున్న పలు విషయాల వెనుకగల శాస్త్రీయమైన అంశాలను పిల్లలు ఈ కథల ద్వారా తెలుసుకుంటారు. తద్వారా వారిలో దేనినీ గుడ్డిగా నమ్మరాదని, దేనిగురించైనా సరే పూర్వాపరాలను విచారించనిదే ఒక నిర్ణయానికి రాకూడదనే ఆలోచన కలుగుతుంది. అన్వేషణ మొదలవుతుంది. ఒక మంచి ఉద్దేశంతో రాసిన ఈ పుస్తకం నూటికి నూరుపాళ్ళు సామాజిక ప్రయోజనాన్ని సాధిస్తుందని చెప్పక తప్పదు.

'భ్రమ', 'గజ్జెల దెయ్యం', 'పిశాచి నవ్వు' అనే ఈ మూడు కథలు అనుమానపు దయ్యాలను మన మెదళ్ళ నుండి పారద్రోలుతాయి. ఉత్కంఠతో మొదలై, ఏకబిగిన చదివించి, ఆఖరికి అసలు విషయాన్ని బయటపెట్టి మన పెదాల మీద నవ్వులు పూయిస్తాయి.

'అసలు విషయం' కథ ప్రజల అమాయకత్వాన్ని, దొంగ స్వామీజీల బండారాన్ని బహిర్గతం చేస్తుంది. రసాయనిక పదార్థాలను ఉపయోగించుకొని, ఇంద్రజాల విద్యలు

నేర్చుకుని బాబాలు జనాన్ని ఎలా బురిడీ కొట్టిస్తారో కళ్ళకుకట్టినట్లు చూపించారు రచయిత. జనం సైన్సుపరంగా వివేకవంతులు కావలసిన అవసరాన్ని ఈ కథ ద్వారా తెలియజెప్పారు. 'కనువిప్పు' కథ కూడా ఈ తరహాలోనే సాగినప్పటికీ దొంగ బాబాల బారినపడకుండా ప్రజలను చైతన్యవంతం చేయడంలో మెజీషియన్ల పాత్రను, ప్రభుత్వ అధికారుల చొరవను తెలియజేశారు. 'తొందరపాటు' కథ జరిగిన సంఘటనల గురించి వెనుకాముందు ఆలోచించకుండా చేతబడులు, బాణామతులు అంటూ అపోహపడే జనాలను, మంత్రగాళ్ళమని చెప్పుకునేవాళ్ళు ఎలా మోసం చేస్తారో చెబుతుంది.

గృహనిర్మాణ శాస్త్రమైన వాస్తును వక్రీకరించి కొందరు కుహనా పండితులు జనాన్ని ఏ విధంగా భయభ్రాంతులకు గురి చేసి ఆర్థికంగా లాభపడుతున్నారో 'వాస్తు-వాస్తవం' కథ ద్వారా వాస్తవాలను బయటపెట్టారు. జ్యోతిష్యాలను నమ్ముకొని చేతులు ముడుచుకొని కూర్చోకుండా కృషి, పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని హితబోధ చేసే కథ 'జ్యోతిష్యం'. అనారోగ్యం సంభవిస్తే సొంత వైద్యాలు చేసుకుంటూ, గుడ్డిగా గ్రామదేవతల మీద భారం వేసి ప్రాణాల మీదికి తెచ్చుకునేవారి గురించి 'సొంత వైద్యం' కథ వివరిస్తుంది. అలాగే దిష్టి తీసే తంతులోని శాస్త్రీయమైన అంశాలను 'దిష్టి' కథ వివరంగా చెబుతుంది. కొన్ని సంఘటనల పూర్వాపరాలను తెలుసుకోకుండా ఎవరికివారు గుడ్డిగా తమ ఇష్టానుసారం గుళ్ళు, గోపురాలను నిర్మిస్తున్న విషయాన్ని 'దేవుడు వెలిశాడు' కథలో నవ్వు పుట్టించేలా చెప్పారు. పశుపక్ష్యాదులు పొరపాటున ఇంట్లోకి వస్తే అది అరిష్టమని భావించి, నానా హంగామా చేసి శారీరకంగా, మానసికంగా ఇబ్బందుల పాలయ్యే వారి కథే 'మూఢనమ్మకం'.

ఇలా 'గజ్జెల దెయ్యం'లోని ప్రతి కథ మనలోని అజ్ఞానాన్ని తొలగిస్తుంది. మూఢత్వాన్ని రూపుమాపే ప్రయత్నం చేస్తుంది. ఇవి పేరుకు పిల్లల కథలే ఐనా వీటి సారాన్ని పెద్దవాళ్ళంతా గ్రహించాలి. ఆలోచించాలి. ఆచరించాలి. మన ఆలోచనలు, ఆచరణలు శాస్త్రీయంగా సాగితే మన జీవితం ఆనందంగా సాగిపోతుంది. ఆ ఆనందాన్ని పంచి పెట్టేందుకే జగదీశ్వర్ కలం నుండి ఈ 'గజ్జెల దెయ్యం' ఉద్భవించింది. మూఢనమ్మకాలతో నిత్యం ఏదో ఒక చోట ఏదో ఒక అకృత్యం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో, రోజుకో బాబా బాగోతం బయటపడుతున్న నేటి సమాజంలో ఇలాంటి పుస్తకాలు వెలువడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి సందేశాత్మక, ప్రయోజనాత్మక పుస్తకాలకు ఒక తెలుగు విశ్వవిద్యాలయమే కాదు, అనేక సాహితీ సంస్థలు పురస్కారాలతో స్వాగతం పలకాలి. అప్పుడు ఇలాంటి గజ్జెల దెయ్యాలెన్నో సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టి శాస్త్రీయతను ప్రచారం చేస్తాయి.

**05.11.2017, దర్వాజ, నవతెలంగాణ**

17

# బాబాసాహెబ్‌కు అక్షర మణిహారం

"కలడంబేద్కరు నా సహెూదరుడు మాకై యష్ట కష్టాలకుం
బలియై సీమకు వోయి క్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొలువందంగల దొడ్డవాడతడు నీకున్ స్వాగతమిచ్చిపూ
వులపూజల్ యొనరించెనే యతని మెప్పుల్ నీ జయారంభముల్"

– గుర్రం జాషువా

ఏ సమాజంలో, ఏ దేశంలో, ఏజాతిలో లేని విధంగా భారతీయ సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ కొనసాగింది. దాన్ని అనుసరించి కులవ్యవస్థ రూపొందింది. ప్రధానంగా కులవివక్షను నిరసిస్తూ రాసిన సాహిత్యమే దళితసాహిత్యం. కుల వ్యవస్థ, అంటరానితనం, దళితుల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రశ్నిస్తూ ఎందరో కవులు తమ స్వరాన్ని వినిపిస్తూ వస్తున్నారు. మాలవాండ్ర పాట రాసిన అజ్ఞాత కవి, మంగిపూడి వెంకట శర్మ, గుర్రం జాషువా మొదలు నేటి వర్ధమాన కవి శివాజీ రవీందర్ వరకు తమ గొంతుకను బలంగా వినిపిస్తూ దళితసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దళితచైతన్యమే ఎజెండాగా బాబాసాహెబ్ జీవితంలో కొన్ని స్ఫూర్తినిచ్చే ఘట్టాలను ఎంచుకొని మణిపూసలు ప్రక్రియలో శివాజీ రవీందర్ రాసిన పుస్తకమే 'బాబా సాహెబ్ అంబేద్కర్'.

అంబేద్కర్ జీవితాన్ని ఎందరో పుస్తకాలుగా వేసారు. మళ్లీ ఈ పుస్తకమేమిటి? దీని వలన కొత్తగా ఒరిగే ప్రయోజనమేమిటి? అనే సందేహం పాఠకులకు కలుగవచ్చు. ఈ పుస్తకం "మణిపూసలు" అనే నూతన కవితాప్రక్రియలో రాయబడింది. ఈ ప్రక్రియ ఇటీవల తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టిస్తున్నది. ఈ ప్రక్రియ సృష్టికర్త వడిచర్ల సత్యం. ఇది రుబాయిలను పోలిన గానయోగ్యమైన ప్రక్రియ. ఇందులో నాలుగు పాదాలుంటాయి. 1,2,4 పాదాలకు అంత్యానుప్రాస మరియు 10,11,12 మాత్రల నుండి ఏదైనా ఒకే సంఖ్యను ఉపయోగించాలి. అనగా 1వ పాదంలో ఎన్ని మాత్రలుంటాయో, 2,4 పాదాల్లోనూ అన్ని మాత్రలే వుండాలి. 3వ పాదానికి అంత్యానుప్రాస వుండరాదు. 10 నుండి 12 వరకు ఎన్ని మాత్రలైనా ఉండొచ్చు. 3, 4 పాదాల్లో కవితా మెరుపుండాలి. ఈ నియమాలతో పాటు అత్యధిక మణిపూసలలో ఆది ప్రాసను కూడా పాటించడం ఈ కవి సాధించిన నవ్యత. అంబేద్కర్ జీవితాన్ని ఈ ప్రక్రియలో రాయడం వలన పాఠశాలస్థాయి పిల్లలను కూడా ఈ పుస్తకం

ఆకర్షిస్తుంది. తద్వారా పాఠశాలస్థాయి పిల్లలకు ఆ మహనీయుని జీవితాన్ని అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేయవచ్చు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రవీందర్ ఈ మర్మమెరిగినవాడు కనుకనే మళ్లీ అంబేద్కర్ జీవితాన్ని తన కథావస్తువుగా ఎంచుకున్నాడు. నిస్సందేహంగా ఈ పుస్తకం చదవడం నేటి తరానికి ఎంతో అవసరం. ఇక పుస్తకంలోనికి తొంగి చూస్తే...

"కులము రాజ్యమేలుచుండె / మతఛాందస వాదముండె
మట్టిలో పండించె పంట / మంచినీళ్ల మైల యుండె"

అంటూ అంబేద్కర్ జన్మించిన కాలం నాటి భారత సమాజాన్ని కళ్ళముందుంచారు.

"అంబెవాడ గ్రామమంట / రత్నగిరి జిల్లాయంట
రాంజీరావు భీమాబాయి / రత్న సిరుల పుత్రుడంట"

అంబేద్కర్ జననం, తల్లిదండ్రుల గురించి సరళసుందరంగా చెప్పారు. "ఇరవై ఆరు అక్షరాలతో ఈ మనువును మట్టుబెట్టె" అనే పాదాలు అంబేద్కర్ ఆంగ్ల విద్య నేర్వడం వలన కుల జాడ్యానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించాడనే విషయాన్ని అందంగా ఆవిష్కరిస్తున్నాయి.

"ఆటలాడె హక్కు లేక / అందరిలో కలువలేక
అవమానము భరించెను / అంబేద్కరు చెప్పలేక"

ఆనాడు సమాజంలో అంబేద్కర్ తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నాడు. కులం పేరిట తన జాతి వేల ఏండ్లుగా అణగద్రొక్కబడుతున్న అంశాన్ని గ్రహించాడు. అందుకే తిరగబడ్డాడు. ఇలా అనేక ఘట్టాలను శివాజీ రవీందర్ ఈ గ్రంథంలో ప్రస్తావించారు. ముఖ్యంగా రమాబాయితో వివాహం, సంతానము, విదేశాలలో విద్య, దళితజనోద్ధరణ, దేశ విభజన సన్నివేశాలు, భారత రాజ్యాంగ రచన, మిళింద మహావిద్యాలయ స్థాపన, బౌద్ధ దీక్ష స్వీకరణ ఇందులో ప్రస్తావించబడినాయి.

"మేకల బలియిత్తురనెను / పులులను బలియివ్వరనెను
మేకలు పులులై నిలిచి / మేటి చరిత రాయమనెను"

దళితులు అజ్ఞానంలో మగ్గినంత కాలం దోపిడి కొనసాగుతూనే ఉంటుందని చైతన్యవంతులు కావాలనే అంబేద్కర్ ఆకాంక్షను కవి చక్కగా వ్యక్తపరిచారు. సూర్యచంద్రులున్నంత కాలం అంబేద్కర్ కీర్తి చిరస్థాయిగా ఉంటుందని తెలుపుతూ..

"సూర్యుడయ్యి వెలుగు చుండె / సుమగంధం జల్లుచుండె
చుక్కల మధ్యలొ జాబిలి / రూపై తను నిలిచియుండె"

కవి ఆకాంక్షించినట్లు అంబేద్కర్ కీర్తి ఆచంద్రతారార్కం నిలిచి ఉంటుంది. అంబేద్కర్ జీవిత ఘట్టాల మణిపూసలు వరుస క్రమాన్ని పాటిస్తే బాగుండేది.

**19.06.2019, అంకురం, నవతెలంగాణ**

18

# ప్రజాపక్షం వహించే కన్నెగంటి గజళ్లు

Poetry is a beautiful way of expressing feelings - happy, sad, angry, crying. It's also a way that we share with other people, to help them with those feelings.

- Mattie Stepanek

మనసులోని ఆనందం, విచారం, కోపం, దు:ఖం తదితర భావావేశాలను అందంగా వ్యక్తీకరించే సాధనం కవిత్వం. మన భావాలను ఇతరులతో పంచుకోవడానికి కవిత్వమొక వారధి. కవి హృదయంలో భావావేశం ఉప్పొంగినపుడే కవిత్వం జనిస్తుంది. అది వచన కవిత కావచ్చు, పద్యం కావచ్చు, పాట కావచ్చు, ఇంకేదయినా ప్రక్రియ కావచ్చు. కవి తన భావాలు జనబాహుళ్యానికి చేరవేయడానికి అనువైన ప్రక్రియను తన కవిత్వానికి వాహకంగా ఎంచుకొంటాడు. అనాదిగా తెలుగులో పద్యం, పాట హృద్యమైన ప్రక్రియలుగా వెలుగొందుతున్నాయి. వీటితో పాటు విదేశీ పాలకుల ప్రభావఫలితంగా అన్ని రంగాలలో మాదిరిగానే భాషాసాహిత్య రంగాలలోనూ ఆయా దేశాల, భాషల ప్రభావం తెలుగు సాహిత్యంపై పడింది. అనేక నూతన ప్రక్రియలకు నెలవైంది. అలా ఉర్దూ, అరబ్బీ భాషల ప్రభావఫలితంగా తెలుగులోనికి వచ్చి స్థిరపడి విరాజిల్లుతున్న ప్రక్రియ గజల్.

ఉర్దూ సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన సాహితీప్రక్రియ గజల్. గజల్ అంటే 'స్త్రీ సంభాషణ' అని నైఘంటికార్థం. ఈ ప్రక్రియారంభ దశలో స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడానికి గజల్ వాడేవారు. డా. సి.నా.రె. గజల్ అంటే ప్రియురాలితో సల్లాపం అని పేర్కొన్నారు. గజల్ అనే పదం 'గజాల్', 'గజాల' నుండి ఆవిర్భవించింది. టర్కీ భాషలో ఈ పదాలకు 'జింక', 'జింక కనులు గల', 'మృగనయని' అనే అర్థాలున్నాయి.

10వ శతాబ్దంలో ఇరాన్‌లో గజల్ ఆవిర్భావం జరిగింది. 12వ శతాబ్దంలో ముస్లింరాజుల ప్రాబల్యంలో, మొగలుల ఇరానీయుల ఆచారవ్యవహారాలతో పాటు గజల్ ఇరాన్ నుండి భారతదేశానికి దిగుమతి అయింది. ఉత్తర భారతదేశంలో కంటే దక్కనులోనే విశేష ప్రాచుర్యం పొందింది. గజల్ గానయోగ్యమైన ప్రక్రియ. ఇది కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను కలిగి ఉంది.

గజల్‌లో కనీసం 5 షేర్లు ఉండాలి. ప్రతి షేర్‌లో రెండు పాదాలుండాలి. మొదటి పాదం మిస్రా. రెండవ పాదం మిస్రాసాని. ప్రతి షేర్‌లో చివరి పదం రదీఫ్. దానికి ముందు పదం ఖాఫియా. ప్రతి మిస్రా ఛందస్సు గల్గివుంటుంది. గజల్‌లో మొదటి షేర్‌ను మత్లా, ఆఖరి షేర్‌ను మఖ్తా అంటారు. మఖ్తాలో కవి నామ ముద్ర ఉంటుంది. దానిని తఖుల్లస్ అంటారు. తెలుగులో గజల్ సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవారిలో దాశరథి, సినారె, పెన్నా శివరామకృష్ణ ముఖ్యులు. ఈ కోవలో నేడు తెలుగులో గజల్ సాగు చేస్తున్న కవి కన్నెగంటి వెంకటయ్య. స్వతహాగా వాగ్గేయకారుడైన కన్నెగంటి ఈ ప్రక్రియను ఎంచుకోవడంలో ఎంతో ఔచిత్యమున్నది. సాధారణంగా గజల్ ప్రణయ సంబంధమైన ప్రక్రియ అయినప్పటికీ నేడు తెలుగు కవులు అనేక సామాజిక అంశాలనూ గజల్ ప్రక్రియలో వ్యక్తీకరిస్తున్నారు. ఇలా పలు సమకాలీన అంశాలతోబాటు వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసే అంశాలతో వచ్చిన గజల్ సంపుటి కన్నెగంటి వారి మమతల హృదయాలు.

"గాలికి గంధం పూయడం పూవుల లక్షణం / ఊహకు ఊపిరి పోయడం కవుల లక్షణం" అని తన గజల్‌లో చెప్పుకున్న కన్నెగంటి హృదయావిష్కారమే ఈ మమతల హృదయాలు. మొత్తం యాభై గజళ్లున్న ఈ గ్రంథంలో ప్రతి గజల్ ఓ ఆణిముత్యమే. ఉటంకించదగిన వాక్యాలు లెక్కకు మిక్కిలి కనబడతాయి.

"మదిలోన తరచి చూసుకో లోపాల ముల్లు రెల్లుకో / తెలివిగ నీ శ్రమను సాన బెట్టుకో విజయాల పూలు జల్లుకో" అంటూ మన లోపాలను సవరించుకుంటూ శ్రమిస్తే విజయం సాధించవచ్చునంటాడు. కోపం, అసూయ, అపోహలు వద్దని మంచితనం రూపుదాల్చిన స్నేహానికి ప్రణమిల్లాలనే సందేశమిస్తారు. పెళ్లితో దూరమయ్యే ఆడపిల్ల తండ్రి మనసును స్పృశిస్తాడు. "మానవపరిణామంలో జీవన నిర్మాణంలో ఆకలి రక్కసి అంగిటనే ఎన్ని బలులు జరిగినవో" అంటూ రాసిన గజల్ దాశరథి ఆ చల్లని సముద్రగర్భం గేయాన్ని స్ఫురింపజేస్తుంది. సమాజాన్ని ఎక్స్‌రే తీసినట్లుగా, ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టే స్వభావం కన్నెగంటిది. "లౌక్యమనే ముసుగు వేయకుంటే పప్పులు ఉడకని కాలమిది" అని చెప్పడం ఇందుకు నిదర్శనం. కులవివక్షపై, మతమౌఢ్యంపై సమరశంఖం పూరిస్తారీకవి. "ఏ మందులు మాన్పలేని కులం పిచ్చి గజ్జి", "అడుగడుగున చెలరేగే కులపుటగ్నికీలలలో మనసు కాలిపోతు ఉంటె మనుగడెంత కష్టమో", "మనుస్మృతి దుష్కృతి యెంతో దగాపడిన దళితుణ్ణడుగు / పరువు హత్యలింకెన్నాళ్లో అంటరాని మంటలనడుగు" వంటి పాదాలు ఇందుకు తార్కాణాలు. "ఎదుటి వారిమీద ఒట్టి నిందవేయకు / బతికి ఉండగానే మట్టిబొంద

తీయకు" అంటూ ఎదుటి వ్యక్తులతో మనం వ్యవహరించవలసిన తీరును ఉద్బోధిస్తారు. ఆధిపత్య భావాలకు చరమగీతం తప్పదని హెచ్చరిస్తారు. సమాజమంతా డబ్బుకు దాసోహమై మానవీయ విలువలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో "అనుబంధాలకు గోడలు కట్టి ఆస్తులకోసం కత్తులు దూసే నెత్తురు పంచుక పుట్టినోళ్లకు పొత్తులు కుదరవు ఎందుకనో" అంటూ ఆవేదనతో ప్రశ్నిస్తారు. అవినీతిమయమైన నేటి రాజకీయ వ్యవస్థనూ తూర్పారాబట్టడం గమనించవచ్చు. "తన సంక్షేమం పరమావధిగా ధన సంపాదన ఆశయమై సురాజకీయం గతి తప్పింది", "ధనవంతుల గుప్పిటలది ఓటొక జీవన ఖైదీ", "ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలంతా సమానులే క్రీనీడన పేద బతుకు నలుగుతుంది అదేమిటో" అనే మాటలు ఇందుకు దర్పణాలు.

"స్వీయ శక్తితో శిఖరం చేరు ఎదుటి భుజాలను మెట్టు చేయకు / నువ్వు నడిచే దారి పొడుగున ప్రేమ మొక్కలు నాటిపో / మంచితనమును గుభాళించే హృదయ వీణలు మీటిపో" వంటి షేర్‌లు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తాయి. కన్నెగంటి పీడిత ప్రజాపక్షపాతి. కష్టజీవి ఇరువైపులా నిలిచేవాడే కవి అనే శ్రీశ్రీ మాటలకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తాడు. "పీడిత జనగొంతుకగా పిడికిలి కావాలి నీవు" అంటూ కష్టించే సంస్కృతిని ఇష్టపడడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నాడు. ప్రపంచీకరణ సంచిలో చిక్కిన పేదలపక్షాన ప్రశ్నల శరాలు సంధించాలని ప్రేరేపిస్తాడు. కన్నెగంటి వృత్తిపరంగా ఉపాధ్యాయుడు. పాఠ్యపుస్తక రచయిత. విద్యారంగం లోతుపాతులెరిగినవాడు. విశేషించి పిల్లలలో దాగిన సృజనను వెలికితీయడానికి నిరంతరం తపించే ఆదర్శ ఆచార్యుడు. సహజంగానే ఈ కోణం నుండి పలు గజల్స్ రాసారు. "విద్యారంగపు అంగడిలో చదువును ధనమే శాసిస్తుంది", "బడి చదువులు వ్యాపారపు డిజిటల్ తరగతులు" మొదలైన పాదాలు ఇందుకు ఋజువులు. పిల్లల పుస్తకాల బరువును నిరసిస్తాడు. నాన్న, రైతు, చదువు, తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేసే గజల్స్ బాగున్నాయి.

"కవిత్వాన్ని ఆయుధంగ మలచగలిగె నైపుణ్యం సాహితి సంజీవనిచ్చె ప్రజాకవికి తెలుస్తుంది" అనే కన్నెగంటి మాటలు అక్షరసత్యాలు. ఈ గజళ్లను ఈ ప్రజాకవి పలు సామాజిక అపసవ్యాలను రూపుమాపడానికి ఆయుధంగా వాడుతున్నాడు. వీరి నుండి ఉత్తరోత్తర ఇంకా ఉన్నతమైన రచనలు ఆశించడం అత్యాశ కాబోదు.

**22.05.2019, అంకురం**

**నవతెలంగాణ**

# సామాజిక చింతనా తత్వం 'కాగితపు పడవ' కవిత్వం

A good poem is a contribution to reality. A good poem helps to change the shape of the universe, helps to extend everyone's knowledge of himself and the world around him

- Dylan Thomas

మంచి కవిత్వం వాస్తవాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రపంచపు రూపురేఖలు మారుస్తుంది. ప్రతి వ్యక్తికి తన జ్ఞానాన్ని విస్తృతపరుచుకోవడంలో ఇతోధికంగా సాయపడుతుంది. ఇంతటి గొప్ప ప్రయోజనం కలిగింది కనుకనే మేధావులు సమాజ సంస్కరణకు కవిత్వాన్ని ఆయుధంగా ఎంచుకున్నారు. ఈ కోవలోని వారే ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ. ఆంగ్ల సాహితీసంద్రాన్ని తన మేధతో మధించి ఆ అమృతఫలాలను తన శిష్య కోటికి పంచిన ఆంగ్ల ఆచార్యుడాయన. పుట్టింది భువనగిరి. వృత్తిరీత్యా ఆంగ్లాచార్యులైనా తెలుగుసాహిత్యంలో బంగారాన్నే పండించారు. 'అరచేయి-ఆకాశం', 'సూర్యుని వాంగ్మూలం', 'మనిషిని వెతుకుదాం', 'మా ఊరు కన్నతల్లి', 'కాగితపు పడవ' మొదలైన కవితా సంపుటాలు 'మహారాజు కన్న ప్రజలు', 'ఆవాలు - ధన్యాలు' మొదలైన వ్యంగ్య హాస్య నాటికలు, 'Dissonance and desire Post war American fiction' పరిశోధక గ్రంథం వీరి రచనలు.

ఇటీవల ఆవిష్కరించబడిన లక్ష్మీనారాయణ కవితాసంపుటి 'కాగితపు పడవ'. 'మార్పు-మలుపు' అంటూ మొదలైన వీరి కవిత్వం 'నోముల సార్ ఇక లేరు' కవితతో పూర్తి అయింది. ఎటువంటి పదాడంబరం లేకుండా హాయిగా సాగిపోయే 42 కవితలు ఉన్నాయి. ప్రముఖ కవి వేణు సంకోజు గారు నాకు ఈ పుస్తకం కానుకగా ఇవ్వగానే ఏకబిగిన చదువగలిగాను. పాఠకుడిని అంతగా ఆకట్టుకొనే సుందరశైలి లక్ష్మీ నారాయణ గారిది.

"ఒక ప్రజానాయకుని పలుకు / వేలమంది ఏలికల్ని నిలదీస్తుంది
ఒక కవి కలం / కష్టజీవుల కన్నీళ్లను / అక్షరాల్లోకి అనువదిస్తుంది

ఒక ప్రేరణ / ఎవరెస్టు ఎత్తుల్ని ఎక్కిస్తుంది"

అంటూ సమాజంలో మార్పుకు దోహదపడే అంశాలను చక్కగా కవిత్వీకరిస్తారు. 'మాయా రాత్రి' అనే కవితలో కవి చీకటిని ఆకాశపు నల్లని నీడగా అభివర్ణిస్తాడు. తొలిపొద్దు వెలుగు రేఖను చూసి రాత్రి పారిపోయిందనడం కవి చమత్కృతికి తార్కాణం. 'ధీటైన జవాబు' అనే కవితలో సరిహద్దులో అమరులైన జవానులకు నివాళులర్పిస్తూ "ఆకాశం తారల హారతి పడుతుంద"నడం అందమైన అభివ్యక్తి. లక్ష్మీ నారాయణగారు అక్షరం యొక్క అనంతశక్తి తెలిసినవారు. అందుకే "అక్షరం అగ్ని కణం / అది చీకటిని చీలుస్తుంది / అక్షరం ఆకాశమై / కారుణ్య వర్షాన్ని కురిపిస్తుంది / అక్షరం అజేయం / అమరం" అంటారు. 'పూబాలల బతుకమ్మ' అనే కవితలో పువ్వు తాత్వికతను వర్ణిస్తూ "అదృశ్య హస్తాలు త్రుంచి వేస్తాయని తెలిసి కూడా పరిమళాలు పండిస్తందం"టాడు. కవి మనిషితనాన్ని వెతుకుతూ "నా అస్తిత్వాన్ని మట్టు పెట్టాలని/ ఎన్ని ప్రకంపనలు, ప్రతికూల శక్తులు / మార్కెట్ మాయా వీధుల్లో అదృశ్యమై / నన్ను నేను ఎన్నాళ్లుగానో వెతుకుతూనే ఉన్నాను" అంటూ మాయమౌతున్న మనిషి జాడను వెతుకుతాడు. నేను అనే కవితలో మనిషి స్వార్థాన్ని ఎత్తి చూపుతూ "నేను ఎవరికీ అంతు పట్టని సనాతన స్వార్థాన్ని / ఎవరికీ అర్థం కాని నిరంతర ప్రశ్నార్థకాన్ని" అంటూ నాగరికతా ముసుగులో మానవత్వాన్ని కోల్పోతున్న మనిషిపట్ల ఆవేదన చెందుతారు. తన బాల్యపు స్మృతులను నెమరువేసుకొనే నోస్టాల్జియా కవిత 'కందీలు'. విద్యుత్ లేని రోజులలో వెలుగులు పంచిన దీపం కందీల పట్ల కవి కృతజ్ఞత ఈ కవితలో కనిపిస్తుంది. ఇటువంటి మరొక కవిత 'ఆనాటి రోజులు'. ఈ కవితలో అర్ధశతాబ్దానికి పూర్వపు తెలంగాణపల్లె ఆవిష్కృతమైంది. కవి తన అనుభవాలను అక్షరీకరించినా అవి సార్వజనీనమైనవిగా పాఠకులు తమ మూలాలను వెతుక్కునేలా చేస్తుందీ కవిత.

సమాజంలో పెరిగిపోతున్న అకృత్యాలపై స్పందిస్తూ "ప్రతిరోజూ టీ.వి. రక్తసిక్తమౌతుంది" అంటారు. నిజమే, నేరవార్తలు లేని రోజును చూడలేకున్నాం. అందుకే కవి నవచేతన సూర్యోదయం ప్రభవించి ప్రజ్వరిల్లాలని ఆకాంక్షిస్తాడు. ఆడపడుచుల్ని కాపాడుకోవాలనే సందేశమిచ్చే కవిత 'అనాథాశ్రమం'. పసిపిల్లలపై జరుగుతున్న దారుణాలకు స్పందిస్తూ రాసిన కవిత 'మనలోని వారేనా?'. లక్ష్మీనారాయణ గారు సామాజిక చింతనాపరులే కాక అందమైన భావుకులు కూడా. ఆకాశాన్ని వర్ణిస్తూ "చంద్రుని తన హృదయంగా / తారల హారాలను అలంకరించుకొని/రాత్రి వేళ ఏకాంతంగా వెలిగి పోతోంది / సముద్రం తన సోయగాలను / ఆకాశపుటద్దంలో

చూసుకొంటోంది" ఎంత చక్కని ఊహ! అద్భుతమైన భావచిత్రాల్ని పాఠకుడి మనోఫలకంపై చిత్రించే ఇటువంటి కవితా పంక్తులు ఈ పుస్తకం నిండా పరుచుకొని ఉన్నాయి. చివరగా నోముల సార్ స్మృతి కవితలో వారికి నివాళులర్పిస్తూ

"నల్గొండేకె నవాబ్ బగల్ మె కితాబ్
జనాబ్ సత్యనారాయణ సాబ్
ఆప్ కో సౌ బార్ సలామ్
అల్విదా ఖుదాఫిస్ జయహెూ
అమర్ హెూ నోముల సాబ్"

అంటూ నోముల సార్ రూపాన్ని కళ్లకుకట్టి చూపారు.

"నేను కవిత్వాన్ని ప్రేమిస్తాను
ఆరాధించి ఆవాహన చేస్తాను"

అంటూ కవిత్వాన్ని శ్వాసించే లక్ష్మీనారాయణ ఇంతే ప్రేమగా కవిత్వాన్ని ఆరాధించే కవులు వేణు సంకోజు, గోవిందులకు అంకితమివ్వడం బంగారానికి తావి అబ్బినట్లుగా ఉన్నది. ఈ కవి కలంనుండి మరిన్ని కావ్యాలు రావాలని ఆకాంక్షిద్దాం.

**01.05.2019, అంకురం**
**నవతెలంగాణ**

# 20

# మానవతా విలువల నిధి తండు సాయన్నదాసు

సకల చరాచర జీవకోటిలో మానవజన్మ ఉత్కృష్టమైనది. ఇతర జీవులతో పోలిస్తే నైతిక విలువలు, సామాజిక విలువలు మనిషిని సమున్నతుడిగా నిలబెడుతున్నాయి. సమాజంలో అనాదిగా ఈ విలువలను వ్యాప్తి చేసినవారు వేమన, వీరబ్రహ్మం లాంటి తత్వవేత్తలు, ప్రజావాగ్గేయకారులు సంఘసంస్కరణకై ఆజన్మాంతం తపించారు. ఆ కోవలోనే వారే శ్రీ తండు సాయన్నదాసు.

తండు సాయన్నదాసు 1928లో నల్లగొండ పట్టణానికి సమీప గ్రామమైన కాకులకొండారంలో జన్మించారు. తండు మల్లమ్మ, తండు చినరామచంద్రం తల్లిదండ్రులు. నిజాం సంస్థానంలో వెట్టిచాకిరీ వ్యవస్థ ఉన్నకాలంలో చదువుకునే అవకాశం లేకపోవడం వల్ల వ్యవసాయకూలీగా జీవనం సాగించారు. చదువుకునే వారివద్దకు వెళ్లి రాత్రివేళల్లో అక్షరాలు, గుణింతాలు నేర్చుకున్నారు. తెలంగాణ సాయుధపోరాటంలోనూ కార్యకర్తగా పనిచేశారు.

చిన్ననాడే సాయన్నదాసులో ఆధ్యాత్మిక చింతన ప్రారంభమైంది. దైవిక సంబంధ అంశాలపై మక్కువ చూపుతూ జనన మరణ భ్రాంతిని తొలగించే తగిన గురువు కోసం వెతకడం ప్రారంభించారు. 1944లో తన పదహారవ యేట నల్లగొండకు చెందిన అచల సిద్ధాంత ప్రబోధకులు శ్రీ సయ్యద్ హుస్సేన్ రాజయోగికి శిష్యుడిగా మారి ధర్మోపదేశం పొందారు. పగలంతా కష్టించి రాత్రివేళ నల్లగొండకు కాలినడకన వెళ్లి గురు శుశ్రూష చేసేవారు. అక్కడి సత్సంగ సమావేశాలలో ఏక్‌తారను మీటుతూ ఆశువుగా అద్భుతమైన తత్వాలను ఆలపించేవారు. ఇవే కాక రామదాసు కీర్తనలు, బ్రహ్మంగారి తత్వాలు పాడి వినిపించేవారు. 1951లో తన మేనమామ కూతురైన వెంకమ్మను వివాహమాడారు. వెంకమ్మ గారి సహనం, సౌశీల్యం సాయన్నదాసు ఆధ్యాత్మికతకు ఎంతగానో దోహదపడ్డాయి.

శ్రీ సాయన్నదాసు గురుపరంపరతో రాసిన వందలాది గేయాలు నేటికి నల్లగొండ పరిసర ప్రాంతాల ప్రజల నాలుకలపై నడయాడుతుంటాయి.

"ఎన్ని దిక్కుల తిరుగుచుండెదవే ఓ మాయమనసా!
ఎన్ని దిక్కుల తిరిగెదవు!ఎంత జెప్పినా బుద్ధిరాదు
సుద్ది కట్టతోను నీకు బుద్ధి చెప్పెదనంకచూడు"

అంటూ మనస్తత్వ విశ్లేషణ చక్కగా చేశారు. జ్ఞానబోధ చేసిన గురువుకు మించిన దైవం లేదంటారు సాయన్నదాసు. గురుపాద తీర్థం త్రివేణి సంగమ పవిత్రజలంతో సమానమంటారు. మనిషి మంచిమార్గంలో నడవవలసిన ఆవశ్యకతను సాయన్నదాసు తన తత్వాలలో తెలియపరిచారు.

"మానవ జన్మము ఎత్తినందుకు మంచిగ నడువుర ఓరన్నా
మానుమింక నీ దుర్గుణమ్ములను సద్గురుచేరుము మాయన్నా"

అంటూ దుర్గుణములను విడువవలెనని, స్వార్థరహితమైన జీవనం గుడపవలెనని బోధించారు.

బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా ఒకవైపు వ్యవసాయం, గీతవృత్తి నిర్వహిస్తూనే సమాజమార్పుల కోసం తపించిన సంస్కరణశీలి తండుసాయన్నదాసు. "పచ్చి చర్మపు తిత్తి – పసలేని దేహంబు / భ్రాంతి నీకేలననే మనసా" అంటూ నశ్వరమైన శరీరాన్ని చూసి మిడిసిపడకూడదని, ప్రపంచంలో మంచి – చెడు ప్రవర్తనలే మిగిలిపోతాయని హితబోధ చేస్తారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సరాలనే అరిషడ్వర్గాలను జయించాలని తన తత్వగీతాలలో ప్రబోధించారు. మనిషి ప్రవర్తనను నిర్దేశించేది మనసే కనుక మనసును సరైనమార్గంలో నడిపించాలని సాయన్న తత్వాలు బోధిస్తున్నాయి. ఎన్నో తాత్విక అంశాలను సులభరీతిలో పామరులకు సైతం అర్థమయ్యేలా ప్రబోధించారు.

"దుర్జనులతో సహవాసము చేసితె / దు:ఖము యెండగు నీకన్నా
సాధు సజ్జనుల సహవాసముతో / సద్గతి పొందుము ఓరన్నా"

అంటూ మనిషి సజ్జన సహవాసమే చేయాలని ప్రబోధించారు. సయ్యద్ హుసేన్ రాజయోగి పరమపదించిన అనంతరం వరంగల్ జిల్లా బచ్చన్నపేటలో గల శ్రీ శివరాదీక్షిత అచల గురుపీఠ కార్యదర్శి సద్గురు శ్రీ వివేకానంద ఆగోలు సంగయాఖ్య రాజయోగి శిష్యుడిగా మారి అనేక తత్వాలు రాసారు.

తండు సాయన్నదాసు రాసిన తత్వగీతాలను వారి కుమారుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య 'సాయన్న తత్వాలు' పేరిట ప్రచురించారు. ఈ గ్రంథంలో 72 తాత్విక గేయాలు చోటు చేసుకున్నాయి. ఇంకా ఆశువుగా అనేక గీతాలు ప్రజలు పాడుకుంటున్నారు. శ్రీ తండు సాయన్నదాసుపై మరింత పరిశోధన జరిగితే వీరి సాహిత్యం ఇంకా మిక్కిలిగా వెలికివచ్చే అవకాశమున్నది.

**30.01.2019, అంకురం**

**నవతెలంగాణ**

## 21

# బాలసాహిత్యంలో తెలంగాణ భాషా సౌందర్యం

**సా**హిత్యం మొత్తానికి మూలం బాలసాహిత్యమే. సాహిత్య శాఖలన్నిటిలోనూ బాలసాహిత్యం ప్రధానమైనది. రేపటి సమాజాన్ని మనం ఆశించిన రీతిలో తయారుచేయడంలో దాని పాత్ర గణనీయమైనది. తెలంగాణ ఉద్యమాల నేపథ్యంలో సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియలలోనూ తెలంగాణ భాష కనిపిస్తున్నది. కానీ బాల సాహిత్యంలో ఈ తరహా ఆలోచన చేసినవారు ఎవరూ కనిపించరు. ఒకటీ అరా రాసిన వాళ్ళు ఎవరైనా ఉంటే ఉండవచ్చు. కానీ ఒక తపస్సుగా భావించి తెలంగాణ భాషలో పిల్లల కోసం కథలు రాస్తూ, సంపుటాలుగా ప్రచురిస్తూ వస్తున్న వ్యక్తిగా పెండెం జగదీశ్వర్‌నే చెప్పుకోవాలి. వీరి 'బడిపిలగాల్ల కతలు' తెలంగాణ భాషలో తొలి బాలల కథాసంపుటి. అయితే మాండలికాలతో బాలసాహిత్యాన్ని పరిపుష్టం చేసే ప్రయత్నం ఇతర మాండలికాలలో ఒక దశాబ్దానికి పూర్వమే జరిగింది. రాయలసీమ మాండలికంలో నామిని సుబ్రహ్మణ్యం నాయుడు 'మా అమ్మ చెప్పిన కతలు', ఉత్తరాంధ్ర మాండలికంలో బమ్మిడి సరోజిని జగదీశ్వరరావుల 'అమ్మ చెప్పిన కతలు' ఆయా మాండలికాలలో తొలి సంపుటాలుగా కనిపిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నేపథ్యంలో తెలుగు భాషాబోధన ఏవిధంగా ఉండాలి? ఏది తెలంగాణ భాష? ఏది ఆంధ్ర భాష? అనే అంశంపై నేడు విస్తృతమైన చర్చ జరుగుతున్నది. నూతన తెలంగాణ రాష్ట్రంలో రూపొందించుకున్న పాఠ్య పుస్తకాలలో కూడా భాష పట్ల పండితులు పూర్తి ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కనిపించదు. ఈ సంకీర్ణ సమయంలో తెలంగాణ పిల్లల భాషను రికార్డు చేసే గొప్ప ప్రయత్నమే 'బడిపిలగాల్ల కతలు'. జగదీశ్వర్ పిల్లలు చెప్పుకొనే జానపద కథల ద్వారా పిల్లల నిజమైన భాషను ఒడిసిపట్టే ప్రయత్నం చేశారనిపిస్తుంది. బాల సాహిత్యంలో తెలంగాణ భాషను ప్రవేశపెట్టాలనే వినూత్న ఆలోచనతో దాదాపు ఏడాదిపాటు శ్రమించి గ్రామీణ ప్రాంతాలలోని పిల్లల భాషను పరిశీలించి, పరిశోధించి, వారి ఉచ్చారణను గమనించి శాస్త్రీయంగా, ప్రామాణికంగా ఒక అవగాహనకు వచ్చిన తరువాత ఈ సంపుటాన్ని ప్రకటించారు.

జగదీశ్వర్ తెలంగాణ భాషలో ప్రచురించిన రెండవ బాలల కథా సంకలనం 'గమ్మతి గమ్మతి కతలు'. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. జగదీశ్వర్ కథల్లో కాళోజీ చెప్పిన పలుకుబడుల భాష సరళంగా సహజ సుందరంగా సాగుతుంది. కథాకథనం గమనించినట్లయితే పిల్లల నోటినుండి జాలువారినట్లుగానే అక్షరబద్ధం చేయడం చూడవచ్చు.

నేడు ప్రామాణికంగా చెప్పబడుతున్న భాషకంటే సామాన్య జనవ్యవహారంలో ఉన్న జీవద్భాషయే పిల్లలను ఎంతో ఆకర్షిస్తున్నదని జగదీశ్వర్ ప్రయోగపూర్వకంగా నిరూపించారు. ఈ భాషలో ఉన్న సజీవసౌందర్యం అరువుతెచ్చుకున్న భాషలో మచ్చుకైనా కనబడదు. ఈ జీవద్భాషను ముందు తరాలకు అందించడానికి బాల సాహిత్యాన్ని ఒక వాహకంగా ఎంచుకొని స్పష్టమైన భాషా స్పృహతో, బాలల మనస్తత్వాన్ని అతిదగ్గరగా గమనించిన అనుభవంతో రాసిన కథాసంపుటాలివి. సునిశితమైన హాస్యం, వినసొంపైన మాండలికం జగదీశ్వర్ కథాసంపుటాలకు వన్నెచేకూర్చాయి. గ్రామీణుల భాషను, జాతీయాలను, సామెతలను, నుడికారాన్ని పిల్లలకు హత్తుకునేలా రాయడం జగదీశ్వర్ శైలిలోని ప్రత్యేకత.

పెండెం జగదీశ్వర్ తెలంగాణ భాషలో రాసిన 'వొంకాయంత వొజ్రం', 'నాకోసం యెవలేదుస్తరు?' అనే కథలను 2016-17 విద్యాసంవత్సరం నుండి మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగువాచకాలలో పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టింది. ఇది తెలంగాణ భాషకు దక్కిన గౌరవం.

తెలంగాణ భాషలోని సౌందర్యం, మాధుర్యం, సౌకుమార్యం పిల్లలకు తెలిసేలా చాలాకాలం నుండి కథలు రాస్తూ నేటి బాలసాహిత్య రచయితలలో ఓ దీపస్తంభంలా నిలుస్తున్నారు పెండెం జగదీశ్వర్. తెలంగాణ భాషాపరిశోధకులు కూడా భాష కోసం తప్పనిసరిగా బాలసాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన పరిస్థితిని కల్పిస్తున్నారు అని ప్రముఖ పరిశోధక రచయిత డా.వి.ఆర్. శర్మ 'గమ్మతి గమ్మతి కతలు' ముందుమాటలో పేర్కొన్న మాటలు అక్షరసత్యాలు.

'బడి పిలగాల్ల కతలు', 'గమ్మతి గమ్మతి కతలు' రెండు సంపుటాలలోనూ జగదీశ్వర్ తెలంగాణ భాషావ్యవహారాలను సజీవంగా అక్షరీకరించారు. తొవ్వ, సోపతి, లాషిగ, ఒర్లుడు, పుంటికూర, ఆపతి, దోస్తులు, గమ్మతి, సంబూరం, ఇజ్జతి, పోరగాడు, బొక్కలు, జాగ, పొల్ల, జెరంత, గబ్బోడు మొదలయిన సజీవ పదాలు కథలనిండా

పరచుకొని పాఠకులకు సహజత్వాన్ని పట్టి చూపిస్తాయి. తాము నిత్యం మాట్లాడుకొనే భాషలోనే ఉన్న ఈ కథలు పిల్లలకు గొప్ప అనుభూతులను, ఆనందాన్ని కలిగిస్తాయి. బాలసాహిత్యంలో తెలంగాణ భాష విస్తృతమవ్వాలి. తెలంగాణ బాలసాహితీవేత్తలు పిల్లలను సాహిత్యం వైపు మళ్ళించడానికి తమ కలాలను మరింత పదునెక్కించాలి. భాషతో పాటు ఇతివృత్తాలు, నేపథ్యాలు, పాత్రలు, వాతావరణ చిత్రణలలో కూడా తెలంగాణ పరిమళం కనిపించేలా చూసుకోవాలి. 'బడి పిలగాల్ల కతలు', 'గమ్మతి గమ్మతి కతలు' మరెన్నో కథా సంపుటాలకు ప్రేరణగా నిలవాలని ఆశిద్దాం. అప్పుడే భాషాపరంగా, సాంస్కృతికపరంగా తెలంగాణ బాలసాహిత్యానికి మరింత పరిపుష్టి చేకూరుతుంది.

**11.12.2017, దర్వాజ**
**నవతెలంగాణ**

# ఉప్పొంగిన భావలహరి ‘అమరావతి’

భావావేశంతో కలిగిన హృదయస్పందనే కవిత్వం. ఆలోచన, అనుభూతి, సామాజిక స్పృహల సమ్మిళితమే ఆచార్య నందిపాటి సుబ్బారావు గారి ‘అమరావతి’. ఇది ముప్ఫై ఏడు కవితల సంపుటి. దేశభక్తి, ప్రజాస్వామిక చింతన, సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం ‘అమరావతి’ సంపుటి నిండా పరుచుకుని ఉన్నాయి. వృత్తిరీత్యా భూవిజ్ఞాన శాస్త్ర ఆచార్యుడైన డాక్టర్ నందిపాటి సుబ్బారావు ప్రవృత్తిరీత్యా మనసున్న మంచికవి. సమాజంలోని అపసవ్యాలపై స్పందించే హృదయమున్నవారు. అందుకే అలవోకగా సుమారు పదిహేనువందల ఆటవెలది పద్యాలతో సమాజానికి మార్గనిర్దేశనం చేశారు. చేస్తున్నారు.

“నా చూపు విశాలం
నాపలుకు యదార్థం
నా భావం మకరందం”

ఇదీ సుబ్బారావు గారి కవితా దృక్పథం.

తెలుగు భాష పట్ల, సంస్కృతి పట్ల ఈ కవికి మమకారం మెండు. ‘అక్షరమాల’ అనే కవితలో తెలుగు భాష ఔన్నత్యాన్ని హృద్యంగా చాటారు. తెలుగువారు గర్వించదగిన చారిత్రక వైభవం అమరావతి అంటూ సర్వమత సమ్మేళన స్థానమైన అమరావతిని కీర్తిస్తారు. సుబ్బారావుగారి సర్వమత సమానత్వ భావనకు అద్దం పట్టే మూడు కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. “సాగర సంగమ స్థితిలో / పులకించే గోదావరి /పవిత్ర పుష్కర వేళను / పుణ్యలోకాలకు రాదారి” అంటూ గోదారి పవిత్రతను చక్కగా వర్ణించారు. మరో కవితలో లోకానికి శాంతి, కరుణల సందేశాన్ని అందించిన ఏసు మార్గం గురించి చెపుతూ “ఏసు మార్గం ఎంచుకుంటే / కరుణతీరం చేరువయ్యే /ఏసుపాదం అద్దుకుంటే / కఠిన హృదయం కరిగి పోయె” అని క్రైస్తవధర్మాన్ని వివరించారు. ఇంకో కవితలో “హద్దులెరుగని / స్నేహసంపద / పంచి ఇచ్చెను రంజాన్ / మనుషులంతా ఒక్కటేనని / చాటి చెప్పెను రంజాన్” అంటూ పేదల ఆకలి తీర్చే పండుగగా రంజాన్‌ను వర్ణిస్తూ ఇస్లాం గొప్పదనాన్ని పట్టిచూపారు. అన్ని మతాలసారం సాటి మనిషిని మనిషిగా

చూడాలనే సందేశమిస్తుందని తెలుపుతూనే “చిత్త శుద్ధి లేని శివుని భక్తి / ఎంత ఉన్నా ఫలితమివ్వదు / పుణ్య మార్గం / ఎంత వెతికినా కానరాబోదు” అంటూ మూఢభక్తిని నిరసించారు.

సమాజానికి ప్రేరణనిచ్చిన మహనీయులను స్మరిస్తూ రాసిన కవితలూ ఈ సంపుటిలో ఉన్నాయి. ‘నిరాడంబరుడు’ కవితలో “కలల సాకారానికి మార్గదర్శకుడు, సృజనాత్మక ఆలోచనలలో వీరవిక్రముడు” అయిన అబ్దుల్ కలాం గారి గురించి చెపుతూ “ఉన్నత పదవులకే వన్నెతెచ్చిన నిరాడంబరుడు / కులమత ప్రాంతాల కతీతుడు / నాడు క్షిపణులను ఎగురవేసిన మహనీయుడు / నేడు భారతావని ప్రథమపౌరుడు” అంటూ కలాం ఔన్నత్యాన్ని శ్లాఘించారు. అలాగే “ఆర్థిక సంస్కరణలకు ప్రాపంచిక ప్రణాళికలకు దేశంలో తొలి వైతాళికుడు” అంటూ పి.వి నరసింహారావు గారిని సమున్నతంగా కీర్తించారు.

స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా భారతావని దీనంగా రోదిస్తున్నదని కవి ఆవేదన చెందుతున్నారు. అందరికీ చదువులందక, యువతకు ఉద్యోగంలేక, ‘నిర్భయ’లకు రక్షణలేక, అవినీతి తదితర సమస్యలతో తల్లడిల్లుతున్న వైనాన్ని చక్కగా అక్షరీకరించారు.

“కపట ప్రేమకన్నా / కాసింత కరుణ మిన్న / ధూర్తుని అతి వినయం కన్నా/ ఆర్తిని పలకడమే మిన్న” అంటూ ‘కనకపు మెరుపు’ కవితలో మానవ స్వభావాన్ని చక్కగా చెప్పారు. విశేషించి ఈ కవితలో అన్ని పంక్తులూ ఉటంకించదగినవే. “స్వేచ్ఛలేని విద్య / బోధనలేని పాఠం / సాధనలేని చదువు / అధ్యయనంలేని పరిశోధన / తర్కంలేని వాదన లాంటివి” నిజంగా సుబ్బారావు గారి జీవితానుభవం నుండి పుట్టిన కవిత ఈ ‘చిరునామా లేని ఉత్తరం’. వాస్తవాలను అందంగా ఆవిష్కరించిన కవిత. ఇలాంటి మేలిమి కవితలు ఈ సంపుటిలో అనేకం ఉన్నాయి. పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో భూవిజ్ఞాన శాస్త్రసంబంధమైన వందలాది వ్యాసాలు రాసిన సుబ్బారావు గారి కవిత్వంలో పర్యావరణ స్పృహ కనిపించడం సహజమే. ఈ సంపుటిలో ఈ కోవలోని కవితలు అనేకం చోటు చేసుకున్నాయి. ‘ప్రకృతి – వికృతి’, ‘మనిషి చేసిన తప్పిదం’, ‘నేను వృక్షాన్ని’, ‘దాహం’, ‘నీటి కురుక్షేత్రాలు’, ‘ప్రాణధార’ తదితర కవితలు ఇందుకు ఉదాహరణలు.

నన్ను నీవు నరికితే నిన్ను నీవు నరుక్కున్నట్లే అంటూ చెట్టు స్వగతాన్ని తెలియజేసారు. “డబ్బులు దాచుకోవడం కాదు బ్యాంకు ఒరల్లో / నీటి వనరులు దాచుకో భూమి

పొరల్లో" అంటూ శాస్త్రసంబంధమైన అంశాన్ని సామాన్యులకు సైతం బోధపడేలా చక్కగా వివరించారు.

'ఏ ఊరు నీ ఊరు' నోస్టాల్జియా కవితలో తన పల్లె మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. అలాగే 'బ్రతుకు భారమయ్యో', 'పచ్చనైన పల్లెనొదిలి', 'సంపాదన', 'ఇదే ప్రపంచం', 'తరుగుతున్న ప్రజల భ్రమలు', 'తానంటే తందానందురు', 'లేనిదంటూ ఏమీ లేదు', 'దిమ్మ తిరిగే పచ్చినిజం', 'మంచీ చెడూ', 'అదును కోసం', 'అనాగరికత' తదితర కవితలు సమకాలీన సమాజానికి దర్పణంగా నిలుస్తాయి. 'దేశమంటే', 'సాగి కదలాలి' కవితలు దేశభక్తిని పెంపొందించేవిగా ఉన్నాయి. 'దరికి చేరని ప్రాణులు' అన్నదాతల అగచాట్లను చిత్రించిన కవిత.

ఇలా మంచి కవిత్వాన్ని సమాజానికి అందించిన సుబ్బారావు గారు అభినందనీయులు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ సంపుటి పై ఎం.ఫిల్ పరిశోధన జరుగుతుండడం గమనార్హం. ఒక్క మాటలో చెప్పాలంటే కవిత్వప్రియులకు చక్కని విందు 'అమరావతి' కవిత్వం.

**26.12.2018, అంకురం**
**నవతెలంగాణ**

23

# ఊరూరా గ్రంథాలయ ఉద్యమస్ఫూర్తి 'కూరెళ్ళ'

"పుస్తకమున్న గేహమున పుణ్యులు తోడుగ నుండినట్టులే
పుస్తకమున్న హస్తమున పుత్తడి కంకణముండినట్టులే
పుస్తకమున్న నేస్తమున పూర్ణగుణంబులు నుండినట్టులే
పుస్తకమున్న మనస్సుకు పూర్ణత నిచ్చును విఠ్ఠలేశ్వరా!

ప్రముఖ సాహితీవేత్త సాహిత్యప్రపూర్ణ డా. కూరెళ్ల విఠలాచార్య గారి 'విఠ్ఠలేశ్వరా!' శతకంలోని పద్యమిది. పుస్తకం ఔన్నత్యాన్ని లోకానికి చాటిన పద్యం. పుస్తకం విలువేంటో తెలిసినవారు, దానిపై అత్యంత మమకారం కలిగినవారు మాత్రమే రాయగలిగిన పద్యం.

డా. కూరెళ్ళ వారికి గ్రంథాలన్నా, ఆ గ్రంథాలను చదివే పాఠకులన్నా వల్లమాలిన అభిమానం. తాను చిన్ననాడు పుస్తకాలను కొనలేని స్థితిలో అనేక ఇబ్బందులుపడ్డారు. ఆ ఇక్కట్లను నేటి తరంవారు పడకూడదనే సదుద్దేశంతో పల్లెపట్టులలో విద్యార్థులకు, సాహిత్యాభిమానులకు, పోటీపరీక్షలకు వేళ్ళే ఉద్యోగార్థులకు ఉపయోగపడాలనే సత్సంకల్పంతో తన ఇంటినే గ్రంథాలయంగా తీర్చిదిద్ది సమాజానికి అంకితం చేసిన మహానుభావులు డా. కూరెళ్ల విఠలాచార్య.

స్వాతంత్రోద్యమకాలంలోనూ,తెలంగాణలో వెట్టిచాకిరీ విమోచనోద్యమంలోనూ గ్రంథాలయాలు నిర్వహించిన పాత్ర ఎనలేనిది. ప్రజలను జాగృతపరచడంలో, అక్షరజ్ఞానాన్ని అందించడంలో గ్రంథాలయాలు కీలకంగా వ్యవహరించాయి. జాతీయ నాయకులు గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేశారు. ఆ గ్రంథాలయాల వలననే ప్రజలలో చైతన్యం కలిగింది. ఇదంతా డా. కూరెళ్ల వారికి అనుభవైకవేద్యం. చిన్ననాడు గ్రంథాలయాల ఆసరాతో చదువుకున్నారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న చందంగా తన చిన్ననాడే 1954లో స్వగ్రామం వెల్లంకిలో గ్రామ పెద్దలు, మిత్రులతో కలిసి 'శ్రీశంభులింగేశ్వర గ్రంథాలయం' పేరిట ఓ గ్రంథాలయం నెలకొల్పారు. దానిని ఆనాటి గ్రామ దేశ్‌ముఖ్ అనుముల లక్ష్మీనరసింహారావు చేత ప్రారంభింపజేసారు. దీనికోసం ఆనాడు ఇల్లిల్లూ తిరిగి గ్రంథభిక్షకై అభ్యర్థించారు. ఆ గ్రంథాలయం ఎక్కువ కాలం నిలువలేకపోయినా ఇటువంటి మారుమూల ప్రాంతంలో ఓ మంచి గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే బలమైన ఆకాంక్షకు మాత్రం ఆనాడే బీజావాపనం జరిగింది.

గ్రంథాలయాలు నాటి నుండి నేటి వరకు పట్టణాలకే పరిమితమైనాయి. కాని పల్లెపట్టులలో దాదాపు లేవనే చెప్పాలి. గ్రామీణ ప్రజలకు విజ్ఞానం మరింత

చేరువకావాలనే తలంపుతో, పల్లెల్లో సాహితీపరిమళాలు వెదజల్లాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యంవలె దాగిన ప్రతిభాశీలురను వెలుగులోకి తేవాలనే ఉద్దేశ్యంతో కూరెళ్ళవారు తమ కార్యస్థానంగా పల్లెను ఎంచుకున్నారు.

"పల్లియలోనే పుట్టితిని పల్లియయే నను పెంచె తల్లియై
ఇల్లును వాకిలిన్ తనకు మేలిమి బ్రత్కుకు మెరుంగు పెట్టె నా
పల్లియ అమ్మ ఆవనుచు పల్కులు పల్కగా నేరిపించె నా
పల్లియె నాకు దైవతము ప్రాణము ఓ ప్రభు విఠ్ఠలేశ్వరా!"

అంటూ పల్లెపై మమకారాన్ని చాటిన విఠలాచార్య తన బాల్యజీవితంలో ఎదుర్కొన్న కష్టాలకు సరైన పరిష్కారం గ్రంథాలయం స్థాపించడమే అని భావించారు. పల్లెపట్టులలో ఒక నిర్మాణాత్మకమైన సంపూర్ణ సమాచారంతో కూడిన గ్రంథాలయం నెలకొల్పాలని నిర్ణయించుకున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేసిన ప్రతిచోటా ఓ పాఠశాల గ్రంథాలయాన్ని నెలకొల్పడం, ఓ గోడపత్రిక ప్రారంభించి విద్యార్థులలో సృజనను వెలికితీయడం ఓ నియమంగా మార్చుకున్నారు. నాటి నుండి నేటి వరకూ ఇంటికి వచ్చిన అతిథికి ఓ పుస్తకం కానుకగా ఇవ్వడం, పిల్లలకు పద్యాలు వినిపించి ఓ చిరుపుస్తకం కానుకగా ఇవ్వడం వారికి ఆనవాయితీ.

తన ఇంట్లోనే సుమారు ఐదువేల గ్రంథాలతో 'లక్ష్మీవేంకటరాజయ్య గృహ గ్రంథాలయం'ను స్థాపించి తమ విద్యార్థులకు, గ్రామస్థులకు చదువుకునే వెసులుబాటు కల్పించారు. ఒకవైపు ఈ విధంగా విద్యావ్యాప్తి కోసం కృషిచేస్తూనే మరోవైపు సాహితీవేత్తగా సమున్నత శిఖరాలు అధిరోహించారు. ఇంతచేసినా ఇంకా చేయవలసింది ఎంతో ఉందనే తపన వారిలో ఉండేది. తాను కలలుగన్న గ్రంథాలయం స్థాపించలేక పోయాననే వెలితి వారి మాటల్లో స్పష్టంగా కనిపించేది. తన శిష్యుడిగా డా.కూరెళ్ళ వారిని ఎంతో దగ్గరగా చూసిన నాకు (ఈ వ్యాస రచయిత) వారి సమున్నత వ్యక్తిత్వం, తన లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించని తత్త్వం తెలుసు. తన బలమైన ఆకాంక్ష అయిన గ్రంథాలయ స్థాపన కోసం 2014లో నడుంకట్టారు. ఫలితంగా ఆచార్య కూరెళ్ళ ఫౌండేషన్ ఏర్పడింది. గ్రంథాలయ ఏర్పాటుకు తగిన భవనంగాని, స్థలంగాని వెల్లంకిలో లభించలేదు. కార్యసాధకులకు ఇవి అడ్డంకి కాదుకదా! డా.కూరెళ్ల గారు తన 'సాయి సాహితీ కుటీరాన్ని' గ్రంథాలయంగా మార్చివేశారు. 2014 ఫిబ్రవరి 13న నాటి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టరు తొగర్ల చిరంజీవులు గారిచే గ్రంథాలయం ప్రారంభించి సమాజానికి అంకితం చేసారు. తన లక్ష్మీవేంకటరాజయ్య గృహ గ్రంథాలయాన్ని ఈ గ్రంథాలయంలో విలీనం చేసి సుమారు ఐదువేలకు పైగా గ్రంథాలతో ఈ గ్రంథాలయం ప్రారంభించారు.

డా. కూరెళ్ళవారి శిష్యులు, మిత్రులు, సాహితీవేత్తలు, సంస్థలు ఈ యజ్ఞానికి ఇతోధికంగా సహకరిస్తున్నారు. నేడు యాభైవేలకు పైగా గ్రంథాలతో ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయం అలరారుతోంది.

తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద గ్రామీణ గ్రంథాలయంగా కూరెళ్ళ ఫౌండేషన్ స్థాపించిన ఈ గ్రంథాలయం తన లక్ష్యసాధనలో ముందుకు సాగుతున్నది. దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ గ్రంథాలయంలో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొనే అన్ని ప్రక్రియలకు చెందిన పుస్తకాలు ఉన్నాయి. విద్యార్థులకు బాలసాహిత్యం, సాహిత్యాభిమానులకు కథ, నవల, కవిత్వం, ఇత్యాది గ్రంథాలు, పోటీ పరీక్షార్థులకు చారిత్రక, వైజ్ఞానిక, భాషాచరిత్ర, సమకాలీన అంశాలకు చెందిన గ్రంథాలెన్నో ఉన్నాయి. భారత రామాయణాది ఇతిహాసాలు, పురాణాలు, వాటిపై వ్యాఖ్యాన గ్రంథాలు, ఆంగ్ల సాహిత్యం, విమర్శా గ్రంథాలు మొదలగు అరుదైన గ్రంథాలకు నెలవైన గ్రంథాలయమిది. విశేషించి వివిధ విశ్వవిద్యాయాలలో పరిశోధనలు చేస్తున్న పరిశోధక విద్యార్థులకు ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయం ఒక వరప్రదాయిని అని చెప్పవచ్చు. వందేళ్ళ క్రితం ప్రముఖులు రాసిన వ్యాసాలతో కూడిన పత్రికలు, ప్రత్యేక సంచికలు, వందలాది పరిశోధనా గ్రంథాలు ఇక్కడ లభిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పరిశోధక విద్యార్థులు నేడు మారుమూల గ్రామమైన వెల్లంకికి వస్తున్నారంటే ఈ గ్రంథాలయ విశిష్టత మనకు అవగతమవగలదు. ఇప్పటి వరకు సుమారు ఆరుగురు విద్యార్థులు ఈ గ్రంథాలయంపై ఆధారపడి డాక్టరేట్లు సాధించడం విశేషం. ఒక రకంగా ఈ గ్రంథాలయం పరిశోధక గ్రంథాలయంగా రూపాంతరం చెందినా ఆశ్చర్యపోవాల్సిన విషయం కాదు.

ఇంతటి అపురూప గ్రంథాలయానికి పక్కా భవన నిర్మాణం చేయాలని ఆచార్య కూరెళ్ళ ఫౌండేషన్ నిర్ణయించింది. దాతల సహకారంతో ఈ నిర్ణయం త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయం ద్వారా విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యగారు ఎందరికో స్ఫూర్తిదాయకమవుతున్నారు. వీరి గ్రంథాలయం స్ఫూర్తిగా ఇటీవల సూర్యాపేట జిల్లా అమీనాబాద్‌లో ఓ గ్రామీణ గ్రంథాలయం ప్రారంభమైంది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా తంగడపల్లి, కక్కిరేణి గ్రామంలో గ్రంథాలయం స్థాపించారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని పల్లెపట్టులను అక్షరాలకు ఆటపట్టులు చేయాలన్న ఆరాటంతో పోరాటం చేస్తున్న ఈ సాహిత్య సమరయోధుడు అభినందనీయుడు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను కూడా తన లైబ్రరీ సిబ్బందికి జీతాలుగా ఇస్తూ వస్తున్న ఈ అక్షర తపస్వికి మొన్నీమధ్య భాగ్యనగరంలో జరిగిన తెలంగాణ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం విశిష్ట పురస్కారం అందించడం వారికి లభించిన అత్యున్నత గుర్తింపుగా చెప్పొచ్చు. ఎనభై ఏండ్ల వయసులో ఇంకా నవ యువకునిగా తిరుగాడుతూ గ్రంథాలయోద్యమానికి ఎనలేని సేవ చేస్తున్న విఠలాచార్యగారు ఎందరికో ఆదర్శనీయం.

**15.07.2018, సోపతి, నవతెలంగాణ**

# సామాజిక తత్వం - మందపాటి కవిత్వం

**“క**ష్టజీవికి ఇరువైపులా నిలబడ్డవాడే కవి” అని మహాకవి శ్రీశ్రీ పలికిన మాటలు నల్లగొండ పట్టణానికి చెందిన కవి శ్రీ మందపాటి వెంకటరాజు గారికి అక్షరాల వర్తిస్తాయి. సామాన్యుడి కడగండ్లు, దేశాన్ని దోచుకునే అవినీతి నేతల భాగోతాలు, స్త్రీ సమస్యలు, యుద్ధోన్మాదం మొదలైన సామాజిక సమస్యలే ఇతివృత్తాలుగా సాహితీసృజన గావించిన కవిశ్రేష్టులు శ్రీ మందపాటి వెంకటరాజు.

‘కవిశ్రీ’ బిరుదాంకితులైన వీరి లేఖిని నుండి అనేక గ్రంథాలు వెలువడ్డా ఏ కారణం చేతనోగాని అవి ముద్రణకు నోచలేదు. ఇటీవలే వారి వారసులు వెలుగులోకి తెచ్చిన కవితాసంపుటి ‘మంచువాన’ సాహిత్యం వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఉంది. కవిగా, నాటకకర్తగా, కథకుడిగా వారు వివిధ ప్రక్రియల్లోనూ సాహితీసేద్యం గావించారు. ‘సుకవి జీవించు ప్రజల నాలుకలయందు’ అన్నట్టు శ్రీ వెంకటరాజు గారు భౌతికంగా లేకపోయినా వారి సాహిత్యం తెలుగు సాహితీ వినీలాకాశంలో వెలుగుతూనే ఉంటుంది.

గొప్ప సామాజిక స్పృహతో రాసిన కవితాసంపుటి ‘మంచువాన’. “పావలా పట్టిన చిరుద్యోగి లంచగొండి / కోట్లకు కోట్లు స్వాహా చేసే ఆసాములు / అప్‌లిఫ్టర్స్ ఆఫ్ ది నేషన్” అని దేశంలో అంతకంతకు పెరిగిపోతున్న స్కాంలు, కుంభకోణాలను తూర్పారా బట్టారు. చిరుద్యోగులను మాత్రమే బలి చేస్తూ అవినీతి నిర్మూలన చేస్తున్నామని భీరాలు పలికే రాజకీయనేతలకు చెంపపెట్టులాంటి కవిత ఇది.

శ్రీ వెంకటరాజు గారు స్త్రీ సమానత్వాన్ని కాంక్షించారు. స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల పట్ల, తన కవితాశరధిని సంధించారు. పురాణాలు, చరిత్రల్లో నేటి సమాజంలో స్త్రీని అణచివేస్తున్న తీరును తెలియజేశారు. స్త్రీకి అవకాశమివ్వాలే గానీ అందుకోలేని రంగమే లేదని, అందుకు వారిని ఆ దిశగా ప్రోత్సహించాలని కాంక్షించారు. “తల్లిగా చెల్లిగా కల్పవల్లిగా / ప్రేమలు పంచే ఆడది / మగాడిని కన్నదీ ఆడదే / గుర్తించరుగా పురుషపుంగవులు మరి” అంటూ స్త్రీ గొప్పదనాన్ని సమున్నతంగా కీర్తించారు.

సర్కస్ అనగానే ఒక వినోద సాధనంగా మాత్రమే భావిస్తుంటాం. కానీ వారి జీవితాల వెనుక ఉన్న కన్నీళ్లను గుర్తించగలిగారు శ్రీ వెంకటరాజుగారు.

"పిల్లికి చెలగాటం
ఎలుకకు ప్రాణసంకటం
పది రూకలతో ప్రజలకు వినోదం
ప్రదర్శకుల పాలిట మాత్రం విషాదం"

అంటూ సర్కస్‌లో పనిచేసే కళాకారుల దైన్యస్థితిని చిత్రీకరించారు. నేడు ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న సమస్య ఉగ్రవాదం. దీనిని నిరసిస్తూ రాసిన కవిత 'యుద్ధం'. ఉగ్రవాదాన్ని మూడవ ప్రపంచయుద్ధంగా అభివర్ణించారు. ఈ కవితాసంపుటికే వన్నె తెచ్చిన కవిత 'మంచువాన'. మనోహరమైన ప్రకృతి వర్ణన ఇందులో కవితా వస్తువు. అలంకార శోభితంగా ప్రకృతి రమణీయతను వర్ణించారు. "వేడిపాలపై మీగడ తట్టులా/ నీటిపై గడ్డకట్టిన మంచుతెరల పొరలు" లాంటి అందమైన అలంకారాలెన్నో వీరి కవిత్వంలో కనిపిస్తాయి. తాత్వికమైన చింతనలో 'వేదాంతం' కవిత మనిషి బతికినన్ని రోజులు ఆనందంగా జీవించమనే సందేశాన్నిస్తుంది. మారుతున్న శాస్త్రసాంకేతిక రంగాలతో పోటీపడుతూ నిస్సారమైన ఉరుకులు పరుగుల ఆధునిక జీవితాన్ని ప్రతిబింబించే కవిత 'పరుగో పరుగు'. నేటి భారతదేశం ఎదుర్కొంటున్న అవినీతి, పేదరికం, నిరుద్యోగం మొదలయిన సమస్యలపై స్పందన 'నేటి భారతావని' కవితలో కనిపిస్తుంది. మద్యం అనర్థాలపై రాసిన కవిత 'సంపూర్ణ మద్య నిషేధం'.

మొత్తం పదకొండు కవితలు ఉన్న 'మంచువాన' కవితా సంపుటి పాఠకులను హాయిగా చదివించేలా ఉంది. కవితా ప్రియులకు పసందైన విందు ఈ 'మంచువాన'.

**30.11.2016, అంకురం**
**నవతెలంగాణ**

# చరిత్రకు సజీవ సాక్ష్యం - హైదరాబాద్ విషాదం

చరిత్ర రచనకు ప్రధాన ఆధారాలు రెండు రకాలు. ఒకటి ఆయా కాలాలకు సంబంధించిన శాసనాలు, నాణేలు, ఇతరత్రా పురావస్తు ఆధారాలు. రెండవది ఆనాటి ప్రత్యక్ష సాక్షుల రచనలు. ఈ రెండవ కోవలోనిదే మీర్ లాయక్ అలీ రాసిన 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్'. 1948 నాటి హైదరాబాద్ రాజ్య పరిస్థితులు, భారత భూభాగంలో విలీనం సంగతులను వివరిస్తుంది ఈ గ్రంథం. దీనిని 'హైదరాబాద్ విషాదం' పేరిట తెలుగులోకి చిట్యాలకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అనువదించారు.

హైదరాబాద్ విలీనం జరిగే నాటికి హైదరాబాద్ సంస్థాన ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీ. సెప్టెంబర్ 17, 1948న భారత సైన్యంచే నిర్బంధించబడ్డాడు. తర్వాత కరాచి పారిపోయి పాకిస్థాన్‌లో స్థిరపడ్డాడు. బ్రిటీష్ పాలన నుండి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి హైదరాబాద్ విలీనం జరిగే వరకు పదమూడు నెలల సంక్షుభిత సమయాన్ని, రాజకీయ పరిస్థితుల్ని కళ్ళారా చూసినవాడు కనుకనే తనదైన శైలిలో నాటి చరిత్రను విశ్లేషించాడు. ఏ చరిత్రనైనా నాణెముకు ఒకవైపు మాత్రమే చూసి ఇదే నిజమైన చరిత్ర అనే నిర్ణయానికి రావడం సహేతుకం కాదు. భిన్న వర్గాల వారి దృక్కోణం నుండి చరిత్రను అధ్యయనం చేసినప్పుడే నిజమయిన చరిత్ర నిర్మాణం జరుగుతుంది. హైదరాబాద్ సంస్థాన చరిత్ర నిర్మాణంలో మరో పార్శ్వం ఈ 'హైదరాబాద్ విషాదం'.

'దేశ విభజన తర్వాత' అనే మొదటి అధ్యాయంలోనే మైనారిటీల్లో అభద్రతాభావం, కాందిశీకుల వలసలాంటి అంశాలను ఆకట్టుకునే కథనంతో చర్చించాడు రచయిత. ఆత్మకథను పోలిన చారిత్రక రచన ఇది. ఉత్తమ పురుష కథనంలో సాగింది. సమకాలీన అంశాలను కూలంకషంగా చర్చించాడు. మహ్మద్ అలీ జిన్నాకు హైదరాబాద్ పట్ల ఉన్న వైఖరిని రెండవ అధ్యాయంలో చక్కగా వివరించాడు. హైదరాబాద్ సంస్థానం చరిత్ర పూర్వపరాలు నేటి తెలంగాణ చరిత్ర రచనకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పవచ్చు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ,

ఇత్తెహదుల్ ముస్లిమీన్ విషయంలో చర్చించిన అంశాలు రచయిత స్వంత అభిప్రాయాలుగా భావించవచ్చు. 'రజాకార్లు' అనే అధ్యాయం నేటి వరకు మనం చదువుతున్న చరిత్రకు భిన్నమైన పార్శ్యాన్ని చూపిస్తుంది. ప్రధానిగా లాయక్ అలీ అనుభవాలు, గాంధీజీతో చర్చలు, గాంధీ హత్య తదితర అంశాలన్నీ క్షుణంగా చర్చించాడు. దేశ విభజన అనంతరం సంస్థానాధీశుల మానసిక స్థితి, రాజకీయ అస్థిరత చక్కగా వివరించబడింది. భారత భూభాగంలో విలీనమయితే జరిగే పరిణామాలు, భవిష్యత్‌పై భయాందోళనను వ్యక్తం చేసిన నాటి సగటు మైనారిటీ ముస్లింల మనోస్థితికి ఈ గ్రంథం దర్పణం పడుతుంది.

ఇక చివరిగా 1950 మార్చి 3న గృహనిర్బంధం నుండి మీర్‌లాయక్ అలీ తప్పించుకున్న వైనం డిటెక్టివ్ కథను మరిపించేలాగా ఉన్నది. సాధారణంగా అనువాద రచనలలో భాష కాస్త కృత్రిమంగా, రీడబిలిటీ తక్కువగా ఉంటుందనే అపవాదు ఉంటుంది. కానీ ఈ 'హైదరాబాద్ విషాదం' తద్విరుద్ధంగా చక్కని సహజమైన తెలుగులో ఆద్యంతం చదివించేదిగా ఉన్నది. అనువాదకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారు అభినందనీయులు. నిష్పక్షపాతంగా చరిత్రను అధ్యయనం చేయాలనుకునే అందరూ చదవదగిన మంచి పుస్తకమిది.

**14.09.2016, అంకురం**

**నవతెలంగాణ**

## 26

# తెలంగాణ వైతాళికుడు షబ్నవీసు

అజ్ఞానాంధకారంలో మగ్గిపోతున్న జాతిని మేల్కొలిపేది, చైతన్యశీలతను కల్పించేది పత్రికలు, గ్రంథాలయాలే. నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష మాట్లాడడం, చదవడం నేరంగా పరిగణింపబడుతున్న కాలంలో ప్రజలలో ఒక భాషాచైతన్యాన్ని కలిగించడానికి నడుంకట్టిన వైతాళికుడు షబ్నవీసు వెంకటరామ నర్సింహారావు 'నీలగిరి' పత్రికను స్థాపించి తెలుగు భాషావ్యాప్తికి కృషిచేశారు. అటు గ్రంథాలయ ఉద్యమంలోనూ, ఇటు పత్రికా రంగంలోనూ విశేష కృషి సల్పి నల్లగొండ కేంద్రంగా సంఘసంస్కరణకు శ్రీకారం చుట్టారు. వలసవాదుల పాలనలో వెలుగు చూడని ఈ వైతాళికుని నేడు తెలంగాణ సమాజం గుర్తించి గౌరవించుకోవడం ఎంతో సముచితం.

నల్లగొండలోని మామిళ్లగూడెంలో 1896లో లక్ష్మినారాయణ – రంగనాయకమ్మ దంపతులకు షబ్నవీసు వెంకటరామ నర్సింహారావు జన్మించారు. తాతతండ్రుల ద్వారా ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ వారసత్వంగా పుణికిపుచ్చుకున్నారు. నల్లగొండలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, పారసీ, ఉర్దూ, ఆంగ్లం తదితర భాషల్లో ప్రావీణ్యం సాధించిన బహుభాషాకోవిదుడు. నల్లగొండలో 1918 మార్చి 18న 'ఆంధ్ర సరస్వతీ నిలయం' అనే గ్రంథాలయాన్ని స్థాపించినాడు. మాడపాటి మనుమంతరావు తదితరులతో కలిసి 1921లో హైదరాబాద్‌లో 'నిజాం రాష్ట్రాంధ్ర కేంద్ర జనసంఘం' స్థాపనలో కీలకపాత్ర పోషించారు. నిజాం రాష్ట్రంలో ప్రజల కడగండ్లను ప్రత్యక్షంగా చూసిన షబ్నవీసు ప్రజల్లో చైతన్యం రగిలించడానికి 1922 ఆగస్టు 24వ తేదీన 'నీలగిరి' పత్రికను స్థాపించారు. గోల్కొండ పత్రిక కంటే ముందే నల్లగొండ నుండి వెలువడిన ఈ పత్రిక తెలంగాణ ఆత్మగౌరవ పతాక, సంఘ సంస్కరణాభిలాషకు ప్రతీక. ఈ పత్రిక ద్వారా వితంతు పునర్వివాహాల ఆవశ్యకతను చాటిచెప్పారు. నాటి సుప్రసిద్ధ రచయితలు గంగుల శాయిరెడ్డి, శేషభట్టర్ వెంకట

రామనుజాచార్యులు, ఆదిరాజు వీరభద్రరావు వంటి ఉద్దండులు నీలగిరి పత్రికలో రచనలు చేశారు.

ఇంతటి ఘన చరిత్ర కలిగిన షబ్నవీసు వెంకటరామ నర్సింహారావు గారి గురించి ఇటీవల వెలుగులోకి తెచ్చినవారు శ్రీమతి షబ్నవీసు ఇందిరారావు. వీరు స్వయానా షబ్నవీసు గారి కోడలు. ఈ నెల 10న త్యాగరాయగానసభలో ఆవిష్కరించిన 'తెలంగాణ వైతాళికుడు షబ్నవీసు జీవితం–సాహిత్యం' గ్రంథాన్ని రూపొందించి తెలంగాణ సాహిత్యానికి గొప్ప మేలు చేశారు. గతంలో షబ్నవీసు గురించి సంగిశెట్టి శ్రీనివాస్, కుర్రాజి తేంద్రబాబు, పున్న అంజయ్య మొదలగు రచయితలు వ్యాసాలు రాసినా సమగ్రంగా ఒక పుస్తకం రాలేదు. సంగిశెట్టి శ్రీనివాస్ 'షబ్నవీసు' పేరిట వ్యాససంకలనం తెలంగాణ పత్రికారంగ చరిత్రను అందించారు. కానీ షబ్నవీసు జీవితం, సాహిత్యంపై వచ్చిన తొలిగ్రంథమిది. షబ్నవీసు గారి దత్తపుత్రులు శ్రీ షబ్నవీసు వెంకటరావు, వారి ధర్మపత్ని ఇందిరారావులు ఈ గ్రంథ రచనకై పడిన శ్రమ అంతా ఇంతా కాదు. అనేక మంది సాహితీవేత్తలను కలిసి అనేక గ్రంథాలు శోధించి ఏర్చికూర్చిన గ్రంథమిది. వీరి కృషికి ఈ వ్యాసకర్త ప్రత్యక్ష సాక్షి.

'షబ్నవీసు జీవితం – సాహిత్యం'లో కుర్రా జితేంద్రబాబు, పులిజాల రంగారావు, కోదాటి నారాయణరావు, శ్రీ పున్నయ్య, సాగి కమలాకరశర్మ, శ్రీమతి భిన్నూరి మనోహరి, శ్రీరంగాచార్య గార్ల వ్యాసాలు, డాక్టర్ ఎం. పురుషోత్తమచార్య పద్యకవిత, షబ్నవీసు గారి సమగ్ర జీవితాన్ని, సాహితీ, పత్రికారంగ సేవను ఆవిష్కరిస్తున్నాయి. షబ్నవీసు గారి ధర్మపత్ని శ్రీమతి జానకీబాయి జీవితం ఇతివృత్తంగా శేషాద్రి రమణ కవులు రాసిన 'ఉదయలక్ష్మి' పద్య కావ్యం అనుబంధంలో చేర్చారు. షబ్నవీసు రాసిన 'బాలికా విలాపం' కూడా అనుబంధంగా చేర్చబడింది.

ప్రముఖ సాహితీవేత్త వేణుసంకోజు గారు షబ్నవీసు గురించి మాట్లాడుతూ షబ్ అనగా రాత్రి అనీ, నవీస్ అనగా పనిచేయువాడు అనీ షబ్నవీసు అంటే రాత్రివేళలో పనిచేయువాడనీ అన్నారు. సాధారణంగా పత్రికల్లో పనిచేసేవారు రాత్రివేళల్లో పనిచేస్తుంటారు. కాబట్టి షబ్నవీసు అనేది వెంకటరామ నర్సింహారావు గారి కలం పేరు అయి ఉండవచ్చునని తదనంతర కాలంలో అది ఇంటిపేరుగా స్థిరపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ గ్రంథకర్తకూడా ఈ విషయాన్ని ప్రస్తావించినా షబ్నవీసు బిరుదనామమని పేర్కొన్నారు. ఆసక్తికరమైన కథనంలో నాటి సంఘటనలు వివరించారు. ఈ విధంగా పరిశోధనాత్మక దృక్పథంతో సాగిన రచన ఇది.

షబ్నవీసు గారు పత్రికారంగంలో గ్రంథాలయోద్యమంలో తొలితరం సాహితీవేత్తగా విశిష్టసేవలందించారు. చరిత్రకెక్కని వైతాళికుడీయన. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికైనా షబ్నవీసు మీద విస్తృత పరిశోధనలు జరగాలి. నాటి నీలగిరి పత్రిక సంపాదకీయాలు, రచనలపై పరిశోధనలు జరగాలి. నల్లగొండ జిల్లా కేంద్రంలో షబ్నవీసు పేరిట ఒక గ్రంథాలయాన్ని ప్రభుత్వం నెలకొల్పాలి. పత్రికారంగంలో, సాహితీరంగంలో విశిష్టసేవలందించిన వ్యక్తులకు షబ్నవీసు పేరిట రాష్ట్రస్థాయి పురస్కారాన్ని ఏర్పాటు చేయాలి. మరీ ముఖ్యంగా షబ్నవీసు జీవితం, సాహిత్యసేవను విద్యార్థులకు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. 'షబ్నవీసు – జీవితం సాహిత్యం' గ్రంథాన్ని అన్ని పాఠశాలల గ్రంథాలయాలకు ప్రభుత్వం సరఫరా చేయాలి. ఇవి చేయడమే షబ్నవీసుకు తెలంగాణ ఇచ్చే ఘనమైన నివాళి.

**16.08.2017, అంకురం**

**నవతెలంగాణ**

# సామాజిక రుగ్మతకు అక్షర చిత్రం 'రహస్య భూతము'

"సంగీత మపిసాహిత్యమ్ – సరస్వత్యాస్తనద్వయమ్
ఏక మాపాత మధురమ్–అన్యదాలోచనామృతమ్"

చెవికి సోకగానే రసానుభూతిని కలిగించేది సంగీతం. చదవగానే ఆలోచనాధారలో ముంచెత్తేది సాహిత్యం. ఈ రెండు వాగ్దేవి స్తనద్వయంగా పెద్దలు చెప్పారు. ఇంతటి గొప్పవైన సంగీత సాహిత్యాలను తనలో ఇముడ్చుకున్న సంగీత సాహిత్య సమలంకృతులు, సరస్వతీ పుత్రులు, శ్రీ వత్ససగోత్ర సంభూతులు సంస్కృతాంధ్ర భాషాప్రవీణులు డాక్టర్ శ్రీమన్ముడుంబై పురుషోత్తమాచార్యులు. 'నల్లగొండ అన్నమయ్య' గా పండితుల ప్రశంసలు అందుకుంటున్న వీరి లేఖిని నుండి ఇటీవల వెలువడిన ఆధునిక పద్యకావ్యం 'రహస్య భూతము'.

'సహితస్య భావ సాహిత్యం' అని ఆర్యోక్తి. అనగా హితమును కూర్చేది సాహిత్యం. చతుష్షష్టి కళలలోనూ సంగీత సాహిత్యములు ఉత్కృష్టమైనవి. అందులోనూ ఆలోచనామృతాన్ని అందించే సాహిత్యమే సర్వశ్రేష్ఠమని పెద్దలు నుడివినారు. కళయొక్క సద్య:ప్రయోజనం ఆనందమే. అయినా అది సమాజ హితమునకు ఉద్దేశించినదని సాహిత్యం చెపుతుంది. ఈ విధంగా సమాజహితాన్ని గోరి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తనవంతు బాధ్యతగా డా.పురుషోత్తమాచార్యులు అందించిన పద్యకావ్యమే 'రహస్య భూతము'.

ఈ పద్యకావ్యంలో తొమ్మిది కాండలు, ఒక వేయి ఎనిమిది గద్య, పద్యాలు ఉన్నాయి. కథావస్తువు నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న భయంకరమైన రుగ్మత ఎయిడ్స్. యువత దుర్వ్యసనాలు, సమాజ సంస్కరణ ఆవశ్యకత.

పండితవంశంలో జన్మించి, మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకత్వం నెరపిన ఆచార్యుల వారు ఇటువంటి కథా వస్తువులను ఎంచుకోవడమే ఆశ్చర్యం కలిగించింది. సాధారణంగా పద్యకావ్యం రాయాలనుకునేవారు పురాణేతిహాసాలనుండో, చారిత్రకమైన

అంశాన్నో ఎంచుకోవడం గమనించవచ్చు. కానీ సమకాలీన సమస్య, అందులోనూ ఎయిడ్స్ వంటి సమస్యను పద్యాలలో చిత్రించడం సాహసమే అనాలి. ఆంగ్ల భాషలో ఉన్న వైద్య పారిభాషిక పదాలను పద్యాలలో కూర్చడంలో ఉన్న శ్రమను ఆ ప్రయత్నం చేసేవారు తప్ప అన్యులెరుగరు. అంతటి సంక్లిష్టతను కూడా అలవోకగా అధిగమించారు పురుషోత్తమాచార్యులు.

ప్రముఖ కవి శ్రీ వేణు సంకోజు అన్నట్లు "పద్యమంటే మరేమిటో కాదు ధారాళంగా సాగే గద్యమే". ఈ మాటలు పురుషోత్తమాచార్యుల శైలికి అక్షరాలా సరిపోతాయి. వచనమంతటి తేలికగా ఛందోబద్ధమైన పద్యాలల్లడం నిజంగా గొప్ప విన్యాసమే. పదబంధాల అల్లికలోనూ, ఆంగ్ల పదాల అనువాదంలోనూ విశేషం కనిపిస్తుంది. ప్రభుత్వారుణ ప్రజావాహనము (ఎర్రబస్సు), జలకోశములు (వాటర్‌బాటిల్స్), పంచనక్షత్ర భోజనశాల (ఫైవ్‌స్టార్ హోటల్), బాధహంతక గుళిక (పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్), దూర శ్రావణ పెట్టె (మైక్) మొదలైన పదాలు ఇందుకు ఉదాహరణ. అవసరానికి అనుగుణంగా గ్రామ్య పదాలను అంతే అలవోకగా రాశారు. నాదాను, పోరలు, కానూను, మొదలైన పదాలు ఇందుకు సాక్ష్యం. ఆంగ్ల పదాలను సైతం ఛందస్సులో పొందికగా రాసిన నిపుణత్వం వీరి శైలిలో కనిపిస్తుంది. ఉదాహరణకు రాజు అండ్ వాసంతి మోటార్ వర్క్సు, ఆటోమొబైల్‌షాప్, మెకానిక్ ఇంజనీరు, గ్యారేజీ, డ్రైవర్, లోపినావిర్, హెటెరోలోగస్, ఫ్రైంబూస్ట్ మొదలైనవి. కరుణరసభరితమైన పండితపామర జనరంజకంగా సాగినదీ రచన.

ఇక కథాంశాన్ని పరిశీలించినట్లైతే ఒక వ్యక్తి చేసిన తప్పు ఎన్ని జీవితాలను ఛిద్రం చేస్తుందో కరుణరసమొలుకునట్లుగా రాశారు. ఉన్నతి అనే అమ్మాయి తన తండ్రికి ఉన్న జబ్బు తనకు జన్మత: సంభవించడంతో ఎదుర్కొన్న కష్టాలు కంటనీరు తెప్పిస్తాయి. ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ కాగానే తల్లి ఆవేశంతో తండ్రిని దూషించగా ఆ తండ్రి పురుష అహంకారంతో తల్లి తలను గోడకు కొట్టడం, ఆస్పత్రిలోనే తల్లి చనిపోవడం, తర్వాత తండ్రి ఆత్మహత్య చేసుకోవడం, ఉన్నతి అనాథ కావడం పాషాణ హృదయులను సైతం కన్నీరు పెట్టించేదిగా ఉంది. తనకు జరిగిన అన్యాయానికి ఉన్నతి చివరి దశలో తనతోపాటు ఈ సమాజం కూడా నశించాలనే భావంతో ఇతరులకు ఈ వ్యాధి అంటించడానికి ప్రయత్నిస్తుంది. మానవ సహజమైన ఈర్ష్యాసూయలను, మనోవిశ్లేషణను ఉన్నతి పాత్ర ద్వారా చిత్రించారు. అజగరు పాత్ర ద్వారా మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత తమ చావును తామే కొనితెచ్చుకుంటున్న

దుస్థితిని చిత్రించారు. సినిమాల్లో అశ్లీలత, నాయికల పిచ్చి దుస్తులు, ప్రసారమాధ్యమాల విపరీత పోకడలు సందర్భానుసారం చర్చించారు. చదువు అంతిమ లక్ష్యం సంస్కారమే కానీ ఉద్యోగం కాదంటారు.

"చదువు ఉద్యోగము కొరకె చదువరాదు
ఎటుల జీవింపబలెనొ నేర్పించు నదియ
జగతి వ్యాపించు మనుజ సంస్కారమంత
అదియె బ్రతుకును నడిపించు నధిపతియయి"

సుధీరు, ప్రబంధ పాత్రల ద్వారా సమాజానికి చక్కని సందేశమిచ్చారు. "చదువు తప్పిన జీవిత మదుపుదప్పు / మహిళలకు చదువు మహితాయుధమ్ము/ రాలువేయుట సులభము పూలకన్న" మొదలైన కవితాపంక్తులు వీరి కవిత్వంలో కోకొల్లలు. పెడదోవపడుతున్న నేటి యువత ఆధునిక సప్తవ్యసనాలుగా యౌవనము, చరవాణి, అశ్లీలసాహిత్యం, డ్రగ్సు, ఛానల్సు, స్వైరవిహారం, సకలలోలతలుగా చెప్పడం వీరి సామాజిక స్పృహకు నిదర్శనం.

అందమైన ఉపమలు, ఉత్ప్రేక్షలు, కాండం చివర విశేష ఛందోబద్ధమైన వృత్తాలు, ద్విపదలు ఈ కావ్యానికి మరింత వన్నె తెచ్చాయి. ఎయిడ్స్ కారకాలు, రోగి ఎలా మసలుకోవాలి, ఈ సమస్యకు పరిష్కారం ఏమిటని వివరించడంలో కవి కృతకృత్యులయ్యారు.

ఈ పద్యకావ్యాన్ని గద్యంగా రాస్తే అద్భుతమైన నవల అవుతుంది. చిత్రీకరిస్తే సందేశాత్మక సినిమా అవుతుంది. ఇంటర్, డిగ్రీ స్థాయి పిల్లలకు ఉపవాచకంగా బోధించదగిన గ్రంథమిది. ఎయిడ్స్ నియంత్రణకు కోట్లు కుమ్మరిస్తున్న ప్రభుత్వాలు ఇటువంటి రచనలను ప్రోత్సహించాలి. సమాజహితాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ చదవదగిన గ్రంథమిది.

**05.10.2016, అంకురం**

**నవతెలంగాణ**

# సప్రమాణ పరిశోధన గ్రంథం 'విఠలాచార్య విఠ్ఠలేశ్వర శతకం' ఒక పరిశీలన'

విశ్వవిద్యాలయస్థాయిలో పద్యంపై పరిశోధనలు ఎక్కువగానే జరిగాయి. జరుగుతున్నాయి. పరిశోధకులు కేవలం పట్టా కోసమే కాక ప్రజలకు చేరువయ్యే పరిశోధన చేసినప్పుడే ఆ సిద్ధాంతానికి సార్థకత చేకూరుతుంది. సమాజ అవసరాల కోసం చేసిన పరిశోధన, ఆ సిద్ధాంత గ్రంథం నాలుగు కాలాల పాటు నిలుస్తుంది. నేడు సిద్ధాంత గ్రంథాలు అచ్చురూపం పొంది, పాఠకుల చేతికి వచ్చి ఆమోదం పొందుతున్న గ్రంథాలు అరుదుగానే కనిపిస్తున్నాయి. దీనికి కారణాలు అనేకం. ముఖ్యంగా తమ పరిశోధనా గ్రంథాలను అచ్చువేసుకోవడానికి తగిన ఆర్థిక సదుపాయం కల్పించే వ్యవస్థ లేకపోవడం అందులో ప్రధానమైంది. ఈ కారణంగా అనేక సిద్ధాంత గ్రంథాలు వెలుగులోకి రావడంలేదు. ఈ పరిస్థితిని అధిగమించి తమ పరిశోధనలు పాఠకుల ఆమోదం పొందాలని అంతేకాక సమాజంలో ప్రజల ఆలోచనలలో పరివర్తన తేవాలనే తలంపుతో ఎలాగో కష్టపడి అచ్చువేసుకునే వాళ్లు చాలా తక్కువ మంది ఉ న్నారు. అలా వెలుగు చూస్తున్న అతి తక్కువ గ్రంథాలలో ఒకటి ఇటీవల వలిగొండలో విడుదలైన రెబ్బ మల్లికార్జున్‌గారి 'విఠలాచార్య విఠ్ఠలేశ్వర శతకం ఒక పరిశీలన'. డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యగారి బహుముఖ ప్రజ్ఞ, రెబ్బ మల్లికార్జున్ గారి పరిశోధనా పటిమకు దర్పణమీ గ్రంథం.

వెయ్యేండ్ల తెలుగు సాహితీచరిత్రలో శతకానికి విశిష్టస్థానమున్నది. ప్రత్యేకించి తెలంగాణ గడ్డపై శతకం ఉద్భవించింది. నైతికంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా సమాజానికి దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపిస్తున్నది. ఈ గ్రంథంలో గ్రంథకర్త మొదటి అధ్యాయంలో శతక స్వరూప స్వభావాలను మిక్కిలి పరిశోధనాత్మకంగా వివరించారు. ముఖ్యంగా సంస్కృత సాహిత్యంలో ఉన్న శతక మూలాలను ఒడిసిపట్టే ప్రయత్నం చేశారు. శత సంఖ్యకు గల ప్రాధాన్యతను సోదాహరణంగా వివరించారు. రెండవ అధ్యాయంలో తెలుగు శతకం ప్రారంభ వికాసాలను గుర్తించి చర్చించారు.

'శ్రీగిరి మల్లికార్జున శతకం' తొలి తెలుగు శతకమని ఈ పరిశోధకుడు వివరించినా నేటికీ ఆ గ్రంథం అలభ్యమే. అనేకమంది శతకకారులను ఈ అధ్యాయంలో స్పృశించారు. 'తెలంగాణ సాహిత్య సమీక్ష'గా మూడవ అధ్యాయంలో పరిశోధన సాగింది. తెలంగాణ ప్రాంతం అనేక రంగాలలో విశిష్టత సాధించినట్లే సాహిత్య రంగంలోనూ అనేక ప్రక్రియలకు పుట్టినిల్లుగా భాసిల్లింది. ద్విపద, శతకం, అచ్చతెనుగు, నిరోష్ఠ్యం, అష్టకం, వంటి ప్రక్రియలు తెలుగు సాహితీక్షేత్రాన్ని పరిపుష్టం చేశాయి. తెలంగాణ సాహిత్యంపై నూతన పరిశోధనలు జరుగుతున్న నేటి తరుణంలో మల్లికార్జున్ కృషిని అభినందించకుండా ఉండలేము.

డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య జీవనరేఖలు, విఠ్ఠలేశ్వర శతకరచనా నేపథ్యం, పవిత్ర పండరీపురంలోని పాండురంగ విఠ్ఠలేశ్వర క్షేత్ర విశిష్ట చరిత్ర ఆ తదుపరి అంశాలుగా పరిశోధన గ్రంథంలో పొందుపరిచారు. విఠ్ఠలేశ్వర శతకం బహుముఖ కోణంలో పరిశీలించడం గమనించవచ్చు. కవితాదృక్పథం, సామాజికాంశాలు, ఆధ్యాత్మిక పద్యాలు, మానవీయసంబంధాలు మొదలయిన అంశాలు సవివరంగా చర్చించారు. శతకకర్త విఠలాచార్య గారితో పరిశోధకుడు చేసిన ముఖాముఖి ముందు తరాల విద్యార్థులకు స్ఫూర్తిని నింపేదిగా ఉంది.

పరిశోధనకు మూలమైన ఏడవ అధ్యాయంలో డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య గారి విఠ్ఠలేశ్వర శతకం పరిశీలనలో కూరెళ్ల వారి రచనా విన్యాసాన్ని పండితపామర జనరంజకంగా, అలవోకగా, ధారాశుద్ధిగా సాగిన ఆ పద్యఝరిని బహుముఖంగా దర్శించగలిగారు. కూరెళ్ళ వారి సమున్నత వ్యక్తిత్వాన్ని శతకంలోని పద్యాల ద్వారా సోపపత్తికంగా పాఠకుల కళ్ళముందుంచారు. శతకకర్త డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, పరిశోధకుడు రెబ్బ మల్లికార్జున్, పర్యవేక్షకులు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, తమ సంస్థ తేజ ఆర్ట్స్ క్రియేషన్స్ ద్వారా ఈ గ్రంథాన్ని వెలుగులోనికి తెచ్చిన డాక్టర్ పోరెడ్డి రంగయ్యలకు ప్రత్యేక అభినందనలు. కేవలం ఎం.ఫిల్ కోసమే ఈ పరిశోధన చేసినా పీహెచ్‌డీ పట్టా పొందేటంతటి అర్హత గలిగిన గ్రంథమిది. ప్రతి సాహిత్య విద్యార్థి చదివి తీరవలసిన గ్రంథం.

**31.08.2016, అంకురం**

**నవతెలంగాణ**

# మానవతా పరిమళం కౌండిన్య కవిత్వం

"మనిషి మనిషిగ తీర్చిదిద్దగ ఉపకరించును మేటి కవనం
మానవత్వపు పరిమళాలను గుండె గుండెలో నింపు కవనం
మంచియే కాసింత ఉన్న చాటుచు నుండు కవనం
మమత సమతలకాలవాలంబయి నిలుచును సదా కవనం"

అంటూ మానవత్వపు పరిమళాలను వెదజల్లే కవిత్వాన్ని రాస్తున్న కవి, గాయకులు, వాగ్గేయకారులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య. దోపిడీదారుల పీచమణచడానికి, ఈ ధరణిలో అవినీతిని అంతం చేయడానికి, శ్రామికుల శ్రమను బాపే శక్తిరూపిణిగా, అమ్మ చేతిముద్ద రీతిగా, విశ్వహితమును కోరే కవిత్వము కావాలని కాంక్షించే నికార్సైన కవి డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య. నల్లగొండకు అతి సమీపంలో ఉన్న కాకుల కొండారం వీరి స్వగ్రామం. తండు సాయన్న, వెంకమ్మ పుణ్యదంపతులకు చివరి సంతానంగా జన్మించారు. డాక్టర్ కౌండిన్య తండ్రి సాయన్న జానపద బాణిలో ఆధ్యాత్మిక చింతనతో అనేక తత్వాలు అల్లుకొని పాడేవారు. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న కృష్ణ కౌండిన్య కవిత్వంలోనూ గాన యోగ్యత, మాత్రా ఛందస్సు అత్యంత సహజంగా కనిపిస్తాయి. ఇది వీరి శైలి. అత్యంత సాధారణమైన కుటుంబంలో జన్మించి అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి బోధన, సాహిత్య రంగాలలో తనదైన ముద్ర వేస్తున్నవారు డాక్టర్ కౌండిన్య. వీరి అక్షరాభ్యాసం కాకుల కొండారంలో జరిగింది. ఒకటి రెండు తరగతులు మాత్రమే అక్కడ అవకాశం ఉంది. ఏడేండ్ల చిరుప్రాయంలోనే రోజుకు ఐదు కిలోమీటర్లు కాలినడకన రాములబండలో మూడవ తరగతి పూర్తి చేశారు. రోజుకు పది కిలోమీటర్లు కాలినడకన 4 నుండి 7 తరగతుల వరకు కంచనపల్లిలో నాలుగేండ్లు విద్యనభ్యసించారు. 8 నుండి 10 తరగతుల వరకు దోమలపల్లిలో చదువుకున్నారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నల్లగొండలో, డిగ్రీ నాగార్జున డిగ్రీ కళాశాలలో, స్నాతకోత్తర విద్య కాకతీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలు

అందుకున్నారు. 'లెక్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖంబున్ సుఖంబున్ మదిన్' అన్న చందంగా ఎన్నో కష్టాలకోర్చి ఉన్నత విద్యను అభ్యసించాడు. అధ్యాపక నియామకానికై నిర్వహించిన పోటీ పరీక్షలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సర్వప్రథముడిగా నిలిచి ఆదర్శప్రాయుడైనాడు. డాక్టర్ కృష్ణ కౌండిన్య సామాజిక స్పృహ మెండుగా కలవారు. పలు సాహిత్య సామాజిక ఉద్యమాలకు తన కలం, గళం ద్వారా ఊతమిచ్చినారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో మాకొద్దీ ఆంధ్ర దొరతనము అంటూ వీరు రాసి పాడిన పాట ప్రజలలో చైతన్యాన్ని నింపింది. ప్రజల గొడవనే తన గొడవగా భావించి పరితపించిన బాపు కాళోజీ అంటూ వీరు రాసిన కాళోజీ స్మృతిగీతం కాళోజీ వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించింది. వేణు సంకోజు, డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య వంటి సాహితీవేత్తలతో కలిసి విశ్వవిద్యాలయానికి పోతన నామ సాధన ఉద్యమంలో పనిచేశారు. అనేక కళాశాలల్లో, పాఠశాలల్లో తన ఉపన్యాసాల ద్వారా విద్యార్థులను జాగృతపరిచారు. టీ-సాట్ తదితర ప్రభుత్వ టీవీ చానల్ ద్వారా పోటీ పరీక్షార్థులకు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించడమే కాకుండా తెలంగాణ సాహిత్యచరిత్రను బోధించారు. గురుకుల టీచర్ల నియామకంలో పోటీ పరీక్షార్థులకు తెలుగు అకాడమీ ద్వారా సమగ్ర సాహిత్య చరిత్రను అందించిన రచయితల బృందంలో వీరు సభ్యులు. సాహితీ మాగాణంలో కృష్ణ కౌండిన్య సాహితీసిరులనే పండించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్రను ఉయ్యాల పాటగా రాసి ప్రచురించారు. నేటికీ బతుకమ్మ ఉత్సవాలలో మహిళలు వీరి ఉయ్యాల పాటను ఆనందంగా పాడుకుంటూ ఉంటారు. వీరు రాసిన సామాజిక గీతాలు 'కృష్ణ కౌండిన్య గీతాలు' పేరిట గ్రంథంగా వెలువడినవి. సాహిత్య సాంస్కృతిక సమాఖ్య దేవరకొండ వారు ఈ గ్రంథాన్ని ప్రచురించారు. వీరు రాసిన మరొక ఆధ్యాత్మిక శతకం 'సంగమేశ శతకం'. "శరణు సంగమేశ శరణు శరణు" అనే మకుటంతో నడిచే ఈ శతకంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరిసాయి. శతక సాహిత్యంలో మకుటాయమానంగా నిలిచే వీరి మరొక సుప్రసిద్ధ శతకం 'శ్రీనివాస శతకం'. అధిక్షేప ధోరణిలో సాగిన ఈ శతకంలో అనేక సామాజిక, ఆధ్యాత్మిక అంశాలు ప్రస్తావించబడినయి.

"సప్తగిరి వాస కలియుగ సాధుపోష
శిష్టరక్షక తిరుమల శ్రీనివాస"

అనే ద్విపాద మకుటంలో సాగిన ఈ శతకంలో ప్రతి పద్యము అనర్ఘరత్నమే. "శోధన సుజ్ఞానమును బెంచి సంస్కార మందించు చదువు చదువు / జయమును గలిగించు చదువు చదువు" ఇలా చక్కని శబ్దాలంకార శోభితమైన శ్రీనివాస శతకంలో అనేక లాటానుప్రాసలు, అంత్యానుప్రాసలు అలవోకగా ప్రయోగించబడి పాఠకునికి మనోవిందును కలిగిస్తాయి. పండిత పామర జనరంజకమైన ఈ శతకం సరళమైనది. సుభోధకమైనది. స్వయంగా గాయకుడైన కవి కావడం వలన కౌండిన్య కలం నుంచి గేయసాహిత్యమే అధికంగా వెలువడింది. 'రాజయోగ మాలిక', 'శిరిడిసాయి అష్టకం', 'బంగరు శిఖరం', 'ఆఖరి పోరు' మొదలైన పాటల సీడీలను వెలువరించారు. ఇందులో అయ్యప్పస్వామిపై రాసిన 'బంగరు శిఖరం' పాటలు అయ్యప్పదీక్ష సమయాలలో వాడవాడలా మారుమోగుతుంటాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా వెలువరించిన 'ఆఖరి పోరు' పాటలు ఉద్యమకాలంలో ఉద్రూతలూగించాయి. డాక్టర్ కౌండిన్య గారిలో మరొక కోణం పరిశోధన. పరిశోధకుడిగా వీరు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వీరు ఎం.ఫిల్ కోసం చేసిన పరిశోధన 'యక్షగాన సాహిత్యం – కల్పిత కథలు'. యక్షగానంలో అనేక నూతన అంశాలను వెలుగులోనికి తెచ్చింది. పేరుకే ఎం. ఫిల్ గ్రంథమైనా, పిహెచ్ డి పట్టాకు అర్హమైన పరిశోధన అది. ఎన్నో తాళపత్రాలను చదివి, క్షేత్రస్థాయిలో తిరిగి, వెలుగులోనికిరాని ఎన్నో యక్షగానాలను సేకరించి ఒక సప్రమాణమైన గ్రంథంగా రూపొందించారు. వీరి సిద్ధాంత గ్రంథం 'ఆత్రేయ రచనలు సమగ్ర పరిశీలన'కు నాటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందుకున్నారు. వీరి మరో రెండు గ్రంథాలు 'కాలగీతం', 'వ్యాసప్రసూనాలు'. పలు సాహిత్య సామాజిక అంశాలపై రాసిన వీరి వ్యాస సమాహారం 'వ్యాసప్రసూనాలు'. 'కాల గీతం' సంపుటి డాక్టర్ కృష్ణ కౌండిన్య గారిని ఒక సమున్నతమైన కవిగా ఆవిష్కరిస్తుంది. రవిగాంచని చోటును కవిగాంచును అన్నట్లు లోకంలో ప్రతి వస్తువు అందమైనదే అనే భావనను ప్రతిఫలిస్తూ వీరు రాసిన కవిత 'కాకి'.

> "కాకి కన్నా మించిన వేదాంతి ఎవరు లోకంలో
> కాకి కన్నా మించిన సద్గురువు ఎవరు భువనంలో
> స్వార్థం ఏ కొంచమైనా లేని పరమ సాధువు
> అహమును అడుగంటనచినట్టి జ్ఞాన సింధువు
> పరస్పర సహకారం సమభావన మమకారం

పరుల కొరకు పాటుపడే పరమ సుగుణ సుమహారం"

అంటూ కాకి గుణగణాలను మానవునికి ఆదర్శప్రాయమైన కాకి స్వభావాన్ని చక్కగా చిత్రీకరించారు. 'కాలగీతం'లో కాలాన్ని వస్తువుగా తీసుకుని

"కాలమా నీవెంత కఠినాత్మురాలివే
కాలమా నీవెంత దయలేని దానవే
అంబరాన్ని తాకే సంబరాన ముంచి
అంతలోనే నరక కూపాన దోస్తావు"

అంటూ కాలం చేసే మాయలను, విధివైపరీత్యాలను చక్కగా కవిత్వీకరించారు. ఉన్న ఊరును, కన్నతల్లిని గురించి కవిత రాయని కవి బహుశా ఉండడేమో! డాక్టర్ కృష్ణ కౌండిన్య అమ్మను గురించి రాసిన కవిత డాక్టర్ పోరెడ్డి రంగయ్య సంపాదకత్వంలో వచ్చిన 'అమ్మ' కవితాసంకలనంలో చోటుచేసుకుంది. మాతృమూర్తి ఔన్నత్యాన్ని సున్నితంగా చూపిన కవిత అది. అలాగే 'మా ఊరు' కవితలో..

"త్యాగాల జెండాయే మా ఊరు
యోగభోగాలు కలిగించు మా ఊరు
మాయమర్మము లేని మా ఊరు
మంచితనముకే చిరునామా మా ఊరు
వెన్నెలకాంతుల్లో మా ఊరు
వెన్నెల కుప్పమ్మ మా ఊరు"

అంటూ తన ఊరి జ్ఞాపకాలను తలపోస్తాడు. మారుమూల ప్రాంతమైన రామన్నపేటలో సాహితీమిత్రమండలిని స్థాపించి సాహిత్యసేవ చేస్తున్నారు. ఈ సంస్థ నేటికి 13 గ్రంథాలు ప్రకటించి నగరాలలోని సాహిత్యసంస్థలకు దీటుగా నిలుస్తున్నది. వీరి సంపాదకత్వంలో 'సురగిరి' దేవరకొండ డిగ్రీ కళాశాల వార్షిక సంచిక, 'చిగురు', 'గులేరు' కవితా సంకలనాలు వెలువడ్డాయి. వీరి తండ్రి తండు సాయన్న రాసిన తత్వ గీతాలు 'సాయన్న తత్వాలు' పేరిట వీరి సంపాదకత్వంలో వెలుగుచూశాయి. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వేమవరం మనోహర పంతులు జీవిత చరిత్ర 'జనం మనిషి' గ్రంథానికి వీరు ప్రధాన సంపాదకులు. కవిగా, గాయకుడిగా, పరిశోధకుడిగా, వక్తగా, బహుముఖ ప్రజ్ఞాశీలి అయినా వీరి కలం నుండి మరిన్ని కావ్యాలు జాలువారాలని ఆశిద్దాం.

**14.03.2018, అంకురం, నవతెలంగాణ**

# 30

## జీవన విలువల సారం – సురేంద్ర కవిత్వం

**P**oetry is the revelation of a feeling that the poet believes to be interior and personal which the reader recognizes as his own.

\- Aristotle

కవి వ్యక్తం చేసిన భావాలను పాఠకుడు అవి తన సొంత భావాలుగా అనుభూతి చెందితే అది నిజమైన కవిత్వం అంటాడు అరిస్టాటిల్. కవి తన అనుభవాలు, అనుభూతులను కవిత్వంలో వ్యక్తీకరించినా అవి సార్వజనీనం అయినప్పుడు పాఠకులు అవి తమ భావాలుగా తాదాత్మ్యం చెందుతారు. ఇలా తన కవిత్వంతో తెలుగు పాఠకలోకాన్ని ఆకట్టుకున్న విశిష్ట కవి సురేంద్ర రొడ్డ. సురేంద్ర గారు రాసిన 'నాన్న పచ్చి అబద్దాలకోరు' అనే కవిత సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారానికి నోచుకుంది. కవిత్వం అంటే తెలియని వాళ్ళు కూడా ఆ కవితను ఎంతగానో ఇష్టపడ్డారు. తమకు తెలిసిన వారికి ఫేస్‌బుక్‌లో, వాట్సాప్‌లో పోస్ట్ చేశారు. ఈ కవితతో సురేంద్ర రొడ్డ గారి పేరు ఉభయ తెలుగు రాష్ట్రాలలో మార్మోగిపోయింది. కారణం ఆ కవిత చదివిన ప్రతి పాఠకుడు ఆ కవితలో తన నాన్నను దర్శించడమే. ఇదీ కవిత్వం అంటే.

"నాకు కొత్త చెప్పులు కొని నా పాత చెప్పులు తను వేసుకుంటూ
కొత్త చెప్పులు తనను కొరుకుతాయన్నప్పుడు నాకు తెలియలేదు
నాన్న అబద్ధం ఆడుతున్నాడని
... ..... ...... ......
నాకు అన్నింటినీ ఇవ్వడానికి
తను ఎన్నింటిని కోల్పోయాడో
నాన్న డైరీ చదివేదాకా నాకు తెలియలేదు
నాన్న అబాద్ధం ఆడుతున్నాడని!
అవును.... నాన్న పచ్చి అబద్దాలకోరు"

అంటూ పిల్లల కోసం తన పేదరికాన్ని కనిపించనివ్వకుండా నాన్న చేసే త్యాగం అత్యద్భుతంగా చిత్రించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'నాన్న పచ్చి అబద్దాలకోరు'

అనే ఒక్క కవిత చాలు సురేంద్ర రొడ్డ తెలుగు సాహిత్యంలో నిలబడడానికి. నాన్న త్యాగాన్ని చిత్రించడానికి ఇంతకంటే గొప్ప మాటలు ఉంటాయని నేను అనుకోను. సురేంద్ర గారికి అమ్మ, నాన్నల పట్ల గౌరవం మెండు. అంతేకాదు నేటి యువతరం అమ్మానాన్నల పట్ల ఆదరాభిమానాలు చూపాలనే సందేశాన్ని ఈ కవితాసంపుటి ద్వారా బలంగా వినిపించారు. 'అమ్మకు చెప్పకురా' అనే కవితలో బిడ్డ కోసం తండ్రి చేసే త్యాగాలను తెలుపుతూ నాన్నను అనాథాశ్రమంలో చేర్చానని అమ్మకు చెప్పవద్దని తల్లి తట్టుకోలేదని పలికిన కవితాపంక్తులు హృదయాన్ని ద్రవింపజేస్తాయి. 'నడుస్తున్న పండ్ల చెట్టులా నాన్న' అనే కవితలో..

"రెండు భుజాల్లో
తినుబండారాల సంచులు
రెండు చేతుల్లో
ఉతికిన బట్టలు సంచులు
మెడలో పెరట్లో పండిన పండ్లు
నడుస్తున్న పండ్ల చెట్టులా నాన్న
కనపడగానే
పిల్లల కళ్ళల్లో మెరుపులు"

అంటూ హాస్టల్లో ఉన్న తన బిడ్డల వద్దకు వెళ్లే నాన్న రూపాన్ని దృశ్యమానం చేస్తారు. నడుస్తున్న పండ్లచెట్టులాంటి నాన్నను పొందిన జ్ఞాపిక, శీర్షికలు ఎంతటి అదృష్టవంతులో కదా!

"మండుటెండలో నిండు గొడుగు అమ్మ కోక
ఉక్కపోతలో చల్లటి వింజామర అమ్మ కోక"

అంటూ 'అమ్మ కోక' కవితలో తల్లి బిడ్డలను కాపాడుకునే విధానాన్ని చక్కగా అభివర్ణించారు. 'అమ్మ మనసు', 'అమ్మ ఆవేదన', 'మా అమ్మ అమృతపు పలుకులు', 'అమ్మా...నీకు వందనం', 'అమ్మ మనసులో చూడు' తదితర కవితలలో అమ్మ ఔన్నత్యాన్ని అద్భుతంగా వ్యక్తీకరించారు.

సురేంద్ర గారిలో గొప్ప స్త్రీవాది కనిపిస్తారు. 'అనాదిగా ఆటబొమ్మ' అనే కవితలో స్త్రీపురుష వివక్ష ఇంటిలోనే మొదలవుతుందని ఆడపిల్లపట్ల తల్లిదండ్రులు కూడా వివక్షత చూపడం ఫలితంగా చిన్ననాటి నుండి ఒక బిడ్డకు తల్లి అయినంతవరకు కూడా ఈ వివక్షత కొనసాగడం తరతరాల స్త్రీ అణచివేతకు మూలమని విశదీకరించారు. అలాగే 'అర్ధాంగి' అనే కవితలో స్త్రీ ఇష్టాయిష్టాలతో పనిలేకుండా పురుషుడు స్త్రీ

నుండి సేవలు కోరుకోవడం గురించి పశ్చాత్తాపం ప్రకటిస్తూ కంటికి రెప్పలా కాచుకుంటా అని హామీ ఇస్తున్నాడు. 'బాలికలను బతకనిద్దాం' కవితలో భ్రూణహత్యలను నిరసించారు. 'శిథిలాలయం' కవితలో స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండించారు. పుట్టింటిని విడిచి మెట్టింటిలో అడుగుపెట్టిన స్త్రీ మనోస్థితిని, భర్త పట్లగల అనురాగాన్ని ఆవిష్కరించిన కవిత 'తాళి బంధం'.

కలలు ఎరుగని కనురెప్పల పరదాలు
నిను కానక ఎన్ని కన్నీటి మేఘాలయ్యాయో
.... ..... .....
చిరునామా విడిచావో నన్నే మరిచావో
చిరునవ్వా ఓసారొచ్చి పోవూ

ఎంత గొప్ప పదచిత్రాలు! కనురెప్పలను పరదాలుగా, కన్నీటి మేఘాలుగా కవి గొప్ప భావనాబలంతో వ్యక్తీకరించారు. మానస గగనం, రెప్పల చూరు, హృదయపు భరిణి, ప్రేమ కుంకుమ, జ్ఞాపకాల వారధి, జీవన నౌక, నమ్మకపు కోట లాంటి పదచిత్రాలు ఈ సంపుటిలో కోకొల్లలుగా కనిపిస్తాయి. చిత్తూరు మాండలికంలో రాసిన 'అంతరాలు', 'మరో కూలి' వంటి కవితల్లో మట్టి పరిమళం గుబాళిస్తుంది.

సురేంద్ర రొద్ద సామాజిక స్పృహ ఉన్న రచయిత. 'నీటికోసం నినాదం' అనే కవితలో "ఇంటింటికి ఇంకుడు గుంత / భావితరాలకు అదే అమృతపు ముంత" అంటూ నీటికోసం నినదిస్తారు. తరువులు లేకపోతే కరువులు వస్తాయని హెచ్చరిస్తారు. వనాలను పెంచితే వానలు వస్తాయని సందేశం ఇస్తారు. 'వలస పక్షులు' కవితలో ప్రపంచీకరణ పుణ్యమా అని విధ్వంసం అవుతున్న పల్లెల దుస్థితిని చిత్రించారు. 'ఏడవకమ్మా ఏడవకు' అనే కవితలో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ భారతదేశపు దు:ఖము తొలగిపోలేదని, విలువలు అంతరిస్తున్నాయని, పేదరికం పెరిగిపోతుందని, నోటుకు ఓటును అమ్ముకునే దుస్థితి ఇంకా పోలేదని, యువత నిర్వీర్యం అవుతున్నదని, కులాల కుంపట్లు రగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తారు.

శ్రీశ్రీలోని సామాజిక స్పృహ, కృష్ణశాస్త్రిలోని భావుకతల కలబోత సురేంద్ర రొద్ద. సురేంద్ర గారిలో గొప్ప ప్రేమికుడు ఉన్నాడు.

"గుండె గోడలపై నీ చిత్రాన్ని
గతమంతా నీ జ్ఞాపకాన్ని
చిత్రించుకున్నది నేనే కదా
మానసికంగా భారమై

మరమనిషిలా నేనిప్పుడు
నేను నేనేనా ప్రియా'

అంటూ ప్రియురాలు కోసం తపించే ప్రియుడి ఆరాటాన్ని అందంగా అక్షరీకరించారు. 'నివేదన' అనే కవితలో ఓ భగ్న ప్రేమికుడి అంతరంగాన్ని ఆవిష్కరిస్తారు.

"నా సర్వస్వం నువ్వే నని
నన్ను మరచి అన్ని విడిచి
నీకై చకోరంలా నిరీక్షించాను
నీవు నన్ను ప్రేమించక పోతే
అది నీ తప్పు కాదు
నీ మనసు గెలవక లేక
పోయిన నాది"

అంటూ నిజమైన ప్రేమికుని అంతరంగాన్ని తెలియజేస్తారు. ఏకపక్షంగా ప్రేమించు లేకపోతే యాసిడ్ దాడులు చేస్తా అంటూ వెర్రితలలు వేస్తున్న నేటి యువతకు పరోక్షంగా సందేశం ఇస్తున్న కవితలా ఇది కనిపిస్తుంది. 'నిరీక్షణ', 'మధుర భావాలు', 'ప్రేమ', 'ఎప్పుడు నను చేరునో', 'నేనో బొమ్మలా', 'ప్రియా' తదితర కవితలన్నీ సురేంద్రలోని ప్రేమికున్ని పట్టిచూపుతాయి.

సురేంద్ర రొడ్డ అచ్చమైన పల్లెప్రేమికుడు. 'నవ నాగరికత' కవితలో సాంకేతిక అభివృద్ధి పేరిట పల్లెల్లో కనుమరుగవుతున్న అనుబంధాలను నెమరువేసుకుంటారు. అంతా కృత్రిమమయమై ఉరుకులు పరుగుల జీవితంలో మమతలు మమకారాలు కోల్పోతున్నామనే దిగులును వ్యక్తం చేశారు.

మానవీయ సంబంధాల పతాక ఈ కవితాసంపుటి. 'ఉమ్మడి కుటుంబాలు' అనే కవిత నేటి వ్యష్టి కుటుంబాల ఫలితంగా ఏం కోల్పోతున్నామో తెలియపరుస్తుంది. 'ప్రేమ కుటీరం' అనే కవిత గొప్ప నోస్టాల్జియా పోయెమ్. పేదరికంలో ఉన్నప్పటికీ కవి ప్రేమ కుటీరంలో ఉన్నట్లుగా తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇది సురేంద్ర రాసిన తొలి కవితాసంపుటి. కానీ కవిత్వంలో ఎక్కడా ప్రాథమికమైన స్థాయిలో ఉన్నట్లు కనిపించదు. ఒక చేయి తిరిగిన కవి, పదుల సంఖ్యలో పుస్తకాలు ప్రచురించిన కవి వలె చక్కని శిల్పం, అద్భుతమైన భావనాపటిమతో మానవీయ సంబంధాలను, సామాజిక స్థితిగతులను చక్కగా ఆవిష్కరించిన కవిత్వం ఇది.

**23.09.2019, ఆదాబ్ హైదరాబాద్**

# అలుపెరుగని ఉద్యమ కవి వేణు సంకోజు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకులు అనేక విధాలుగా పోరాటం చేశారు. కొందరు తమ రచనలతో ప్రజలను ప్రభావితం చేశారు. ఇంకొందరు తమ వాగ్ధాటితో ప్రజలలో చైతన్యం కలిగించారు. మరికొందరు ఉద్యమాల ద్వారానే తెలంగాణ సాధ్యమని తలచారు. ఈ మూడింటిని సాధనాలుగా చేసుకొని తమ కలం ద్వారా, గళం ద్వారా ముందుండి ప్రజలను నడిపించడం ద్వారా తెలంగాణ సాధనకు అహర్నిశలు పోరాటం చేసిన వారు ఇంకొందరు. అదిగో... ఆ చివరి కోవకు చెందిన వారే ప్రముఖ కవి, రచయిత, వక్త, విమర్శకులు వేణు సంకోజు. వేణు సంకోజు అనగానే నరనరాన తెలంగాణవాదాన్ని పుణికిపుచ్చుకున్న మేధావిగా, సాహితీవేత్తగా, ఉద్యమకారుడిగా తెలంగాణ ప్రజలకు సుపరిచితం. సాహిత్యపరంగా, సాంస్కృతికపరంగా నల్లగొండ జిల్లాలో అత్యంత చైతన్యవంతమైన ప్రాంతంగా చండూరుకు గుర్తింపు ఉంది. అంబటిపూడి వెంకటరత్నం, దవళా శ్రీనివాసరావు, మద్దోజు సత్యనారాయణ వంటి సాహితీ దిగ్గజాలకు నెలవైన నేల అది. దాశరథి కృష్ణమాచార్యులు 'అగ్నిధార'ను ఆవిష్కరించుకుని పునీతమైన పుణ్యభూమి అది. ఆ చండూరు గ్రామంలో సంకోజు వీరబ్రహ్మం - శాంభవి పుణ్యదంపతులకు వేణు సంకోజు జన్మించారు. వీరబ్రహ్మం గారు వృత్తిరీత్యా ఇత్తడి, కంచు శిల్పి. ఎంతో నైపుణ్యం ఉన్నా చేతినిండా పని దొరికే స్థితి నాటి తెలంగాణ పల్లెల్లో లేదు. కుటుంబ పోషణకై విధిలేని పరిస్థితుల్లో పల్లెనొదిలి పట్నం దారి పట్టాడు. సికిందరాబాద్ కంచర బస్తికి చేరుకొని అక్కడే కులవృత్తిని సాగిస్తూ స్థిరపడ్డాడు. వేణు సంకోజు బాల్యమంతా సికిందరాబాద్‌లోనే గడిచింది. కళాసిగూడ గవర్నమెంట్ హైస్కూల్లో హెచ్.ఎస్.సి వరకు విద్యనభ్యసించారు. చిన్నతనం నుండే మిక్కిలి చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు వేణు సంకోజు. ఆరవ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన తర్వాత పట్టుబట్టి మరీ ఆంగ్లమాధ్యమంలో చేరారు. ఉపాధ్యాయులు ఫెయిల్ అవుతావని భయపెట్టినా పట్టుదలతో చదివి ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవడం చిన్నప్పటి నుండే వారిలో ఉన్న పట్టుదలకు నిదర్శనం. తాను ఏదైనా తలపెడితే విజయవంతం అయ్యేంతవరకు నిరంతరం శ్రమిస్తూ ఉంటారు.

శ్రీశ్రీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా నల్గొండలో ప్రతి నెలా గొప్ప సభలు నిర్వహించడం, ఆ సభలో వక్తల ప్రసంగవ్యాసాలతో 'ప్రజలపక్షాన ప్రతిజ్ఞ'గా ప్రకటించడం దాని వెనుక వేణు సంకోజు కృషి చూసిన వారు తప్ప ఇతరులు ఊహించలేరు. ఇది వారి కార్యదక్షత. విద్యార్థి ఉ ద్యమనాయకుడిగా, తెలంగాణవాదిగా, ఉద్యమాల్లో చురుగ్గా ఉన్న రోజుల్లో 1969లో తండ్రి మరణంతో కుటుంబ భారాన్ని తలకెత్తుకున్నారు. తమ్ముళ్లను, చెల్లెళ్లను పోషించడానికి గుమస్తాగా బుక్ బైండర్ పని చేశారు. కానీ ఉద్యమాన్ని మాత్రం వీడలేదు. కార్యసాధకులకు కుటుంబ సమస్యలేవి అవరోధంకాదని నిరూపించారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌లో యూడిసీగా, హెడ్‌క్లర్క్‌గా హైదారాబాద్, గుంటూరులలో పనిచేశారు. 1982లో జూనియర్ లెక్చరర్‌గా అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, నర్సాపూర్‌లలో అధ్యాపకులుగా విద్యార్థుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అనంతరం డిప్యుటేషన్‌పై ఇంటర్మీడియట్ బోర్డులో ఆడియో విజువల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. తరువాత సంగారెడ్డిలో అధ్యాపకులుగా ఉన్నప్పుడే 1999లో పదోన్నతిపై రామన్నపేట డిగ్రీ కళాశాలకు వచ్చారు. అనంతరం నల్గొండ మహిళా కళాశాల నుండి ఉద్యోగ విరమణ పొందారు. వేణు సంకోజు ఎక్కడ పనిచేసినా అక్కడ విద్యార్థుల మనోఫలకాలపై చెరగని ముద్రవేశారని చెప్పవచ్చు. దీనికి నిదర్శనం 'చలనం' సంకలనం. పల్లెల్లో నుంచి సాధారణమైన ప్రభుత్వ పాఠశాలలో చదివి వచ్చిన విద్యార్థులను పఠనం వైపు మళ్ళించి, వారి చేతనే సమీక్షలను రాయించి ఆ సమీక్షలను గ్రంథంగా ప్రకటించడం ఓ ప్రయోగం. అపూర్వం కూడా. ఇలా విద్యార్థినుల చేత కవిత్వం రాయించడం, విమర్శనాత్మకంగా ఆలోచించేలా తర్ఫీదు ఇవ్వడం వేణు గారికి విద్యార్థి లోకంలో ఓ అపూర్వ గౌరవాన్ని సంపాదించి పెట్టింది. వేణు సంకోజు వృత్తిరీత్యా రాజనీతి శాస్త్ర అధ్యాపకులు. ప్రవృత్తి సాహితీ సృజన. ఈ రెండింటిని సమన్వయం చేస్తూ వీరు ఎం.ఫిల్ కోసం చేసిన పరిశోధన 'తెలుగు నవలల్లో చిత్రితమైన రాజ్యము – రాజ్యాంగ యంత్రాంగం' రాజనీతిశాస్త్ర పండితులను సైతం ఆశ్చర్యపరిచింది. కవిగా, రచయితగా వేణు సంకోజు తెలుగు సాహితీక్షేత్రంలో బంగారాన్నే పండించారు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే జవహర్‌లాల్ నెహ్రూ మరణం వేణు గారిని ఎంతో కదిలించింది. నెహ్రూ మీద ఎలిజీ (స్మృతి గీతం) రాశారు. అదే అతని తొలి రచన. తరువాత వీరి తొలి కవితా సంపుటి 'మనిషిగా పూచే మట్టి' 1995లో వెలువడింది. తర్వాత 'మనం' (2001), ఉద్యోగ

విరమణ సందర్భంగా 'నేల కల', 'ప్రాణప్రదమైన' (2008) కవితా సంపుటాలు వెలువరించారు. వీరి కథాసంపుటి 'స్పర్శ'. వీరు రాసిన సుద్దాల హనుమంతు జీవితచరిత్రను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. అనంతరం ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు అకాడమీ కూడా వీరు రాసిన సుద్దాల హనుమంతు జీవితచరిత్రను ప్రచురించింది. 'ప్రజలపక్షాన ప్రతిజ్ఞ', 'కాళోజీ ఉత్సవ్', 'చలనం' తదితర పదికిపైగా గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమం ఉ ధృతంగా నడిచే రోజుల్లో 'వీర తెలంగాణ' పత్రిక నడిపారు. 18 సంచికలు వెలువరించారు. వీర తెలంగాణ పత్రిక సంపాదకీయవ్యాసాలు వలసవాదుల గుండెలపై ఎక్కుపెట్టిన ఫిరంగి గుండ్లుగా వాస్తవాల్ని తేటతెల్లం చేశాయి. ఓవైపు వీర తెలంగాణ పత్రిక నిర్వహణ, మరోవైపు తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీ అధికార ప్రతినిధిగా, ఇంకోవైపు సాహితీ వ్యాసంగంతో వేణు సంకోజు మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేంద్రబిందువై నిలిచారు. సకలజనుల సమ్మె కాలంలో నల్లగొండ తెలంగాణ చౌరస్తా (క్లాక్ టవర్ సెంటర్) వారి చిరునామాగా మారిపోయింది. ఇప్పటికీ వారి ఇల్లు ఒక సామాజిక చైతన్య కేంద్రమే. 'జయ మిత్ర' సాహిత్య, సాంస్కృతిక సంస్థ కార్యాలయంగా ఆ ఇల్లు నల్లగొండలో సాహితీ స్ఫూహను నిరంతరం కలిగిస్తూ ఉంటుంది. తెలంగాణ రచయితల వేదిక ప్రధాన కార్యదర్శిగా తెలంగాణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసినవాడు వేణు సంకోజు. సాహిత్యసాంస్కృతిక రంగాల్లో జరుగుతున్న వివక్షను ప్రశ్నిస్తూ గళమెత్తారు. సమకాలీనతకు దర్పణంపట్టే వీరి కవిత్వం, వ్యంగ్యం, హాస్యం జోడిస్తూనే ఎంతటి సీరియస్ విషయాన్నయినా అలవోకగా శ్రోత మదిలోకి ఇంజెక్ట్ చేసే వీరి ఉపన్యాసం, 'జయహో' అంటూ ఆత్మీయమైన పలకరింపు, సప్తవర్ణశోభితమైన వీరి అక్షరాలు, తెలంగాణ నెనరు నింపుకున్న మనస్సు నిజమైన తెలంగాణ 'మట్టిమనిషి'గా వేణు సంకోజును మన ముందుంచుతాయి.

**అంకురం, నవతెలంగాణ**

# తెలంగాణ గుండె చప్పుడు 'రణగీతం'

అరవై ఏండ్ల తెలంగాణ తండ్లాట చరిత్రలో ఓ చీకటి అధ్యాయం. చైతన్యశీలత తెలంగాణ మట్టి లక్షణం. బలవంతంగా కలపబడిన రోజు నుండి స్వతంత్రత సిద్ధించిన దాకా తెలంగాణ తన గొంతుకను వినిపిస్తూనే ఉంది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వివక్షతలను ప్రశ్నిస్తూనే ఉంది. నీతిబాహ్యమైన 'వలస తెలివి'ని కవుల కలాలు నిలదీస్తూనే వచ్చాయి. అదిగో అటువంటి ఉద్యమ గొంతుక మన దాసోజు జ్ఞానేశ్వర్ 'రణగీతం'. ఉద్యమాల నేలగా ప్రపంచ చరిత్రలోనే ఓ విశిష్టస్థానం పొందిన తెలంగాణలో నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం దాకా ప్రజలలో చైతన్యబీజాలు నాటడంలో కవుల పాత్ర కీలకమైనది. నాటి సుద్దాల హనుమంతు నుండి నేటి దాసోజు జ్ఞానేశ్వర్ దాకా ఎందరో కవులు ఇది తమ గురుతర బాధ్యతగా భావించి తమ కలాలను పదునెక్కించారు. ప్రత్యేకించి తెలంగాణ మలి ఉద్యమంలో బలమైన కవిత్వం వచ్చింది. అలా వచ్చిన కవిత్వంలో కలికితురాయి ఈ 'రణగీతం'. "నిన్ను నీవు ఒత్తిగా మలచుకుని అఖండ దీపంగా వెలిగించుకున్న అమరుడా నీకు సలాం" అంటూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి నివాళి అర్పించారు. "ఎక్కాల్సింది ఉరికొయ్యలు కాదు విజయ సోపానాలు" అంటూ ఆత్మహత్యలు చేసుకోవద్దని యువతకు హితబోధ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దాదాపు పన్నెండు వందల మంది అమరుల త్యాగాలను చూసి చలించిన కవి గుండెల్లోంచి పెల్లుబికిన ఆవేదన 'వద్దు బిడ్డా' అనే కవిత. 'వలస తెలివి' అనే కవితలో తెలంగాణ చెట్టుకు పట్టిన చెదపురుగులుగా వలసవాదులను అభివర్ణిస్తారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వారితో సోపతి కుదరదని తేల్చిపారేశారు. "మొదలుకు నీళ్లు నాతో పోయించి కొమ్మల పండ్లు నువ్వేరు కుంటున్న"వని సోయి తెచ్చుకొని నిలదీస్తాడు. 'నిగ్రహం కూలింది' కవితలో నాలుగున్నర కోట్ల నిగ్రహాన్ని కూల్చిన చోట విగ్రహాలు కూలకేం చేస్తాయని ధర్మాగ్రహాన్ని ప్రకటిస్తున్నాడీకవి. "హుస్సేన్ సాగర్ నా గర్భసంచి ఇన్నాళ్లకైనా అవాంఛిత గర్భానికి అబార్షన్ జరిగినంత హాయిగా ఉంది" ఎంత చక్కని అభివ్యక్తి! మిలియన్ మార్చ్ సంఘటనను కవిత్వీకరించడానికి

ఇంతకంటే గొప్ప ప్రతీకలు ఉంటాయా? తెలంగాణ తల్లికి నిజంగా మాటలే వస్తే ఆమె నోటి నుండి వచ్చే ఆవేదన ఇలాగే ఉంటుందేమో! ఈ సంపుటిలో అడుగడుగునా తెలంగాణవాదం, వలసవాదుల దోపిడీ కనబడుతుంది. వలసవాదుల దుర్మార్గాలను చీల్చిచెండాడాడు జ్ఞానేశ్వర్. "మేం తొడగొట్టక ముందే తొవ్వ చూసుకుంటే మంచిద"ని హెచ్చరిస్తాడు. జనచేతన సునామీగా వెల్లువెత్తిన ఉద్యమాన్ని అద్భుతంగా అక్షరబద్ధం చేశాడు. "అయిందేదో అయ్యింది. నీ జాగలకు నీవెళ్ళు, లేదంటే నీవు వెయ్యి గొడ్లను తిన్న రాబందు లాగా రాలిపోతావ"ని శపిస్తాడు. జ్ఞానేశ్వర్ గారి శైలిలో ఆర్తి, ఆవేశం, సమ్మిళితమై కనిపిస్తాయి. "కాసెను బిగించి కదం తొక్కుతూ పదం తొక్కుతూ పదం పాడుతూ విప్లవ వీరుడా లే... లే... లే..." కవిత్వంలో శ్రీశ్రీ నడక కనిపిస్తోంది. పాఠకులలో ఉద్విగ్నభావాల్ని రగిలిస్తుంది. మిలియన్ మార్చ్ సంఘటన రోజు టాంకు బండ్‌పై కూలిన విగ్రహం బోర్లా పడి ఉన్న చిత్రం ఆనాటి దిన పత్రికల్లో పతాక శీర్షిక అయిన విషయం మనకు విదితమే. ఈ ఘటన కవి దృక్కోణం నుంచి "పాల్కుర్కి, పిల్లలమర్రి, రుద్ర కవులకు, కవిత్రయం/ దాశరథి, కాళోజీలకు – శ్రీ శ్రీ/ మాడపాటి, భాగ్యరెడ్డివర్మలకు – వీరేశలింగం/ కొమరం భీమ్ కు – అల్లూరి/ క్షమించమని వేడుతూ సాష్టాంగపడినట్లు ఉంది. కానీ కూల్చితే బొక్క బోర్లాపడ్డట్లు ఉన్నాయా!?" అంటూ తన దృష్టికోణంలో నాటి ఘటనలను ఆవిష్కరిస్తారు. ఈ సంపుటిలోని 19 కవితలు ఉన్నాయి. తెలంగాణ కోసం తన కవితల ద్వారా ఊతమిచ్చిన సాహితీప్రపూర్ణ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య గారికి ఈ సంపుటి అంకితమిచ్చారు. కొంత ఆలస్యమైనా అప్పటికే మలి తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేసిన గొప్ప కవిత్వాన్ని తెలంగాణ సమాజానికి అందిస్తున్న దాసోజు జ్ఞానేశ్వర్ అభినందనీయులు. అందమైన ముఖచిత్రాన్ని అందించి గ్రంథ స్వభావాన్ని ముందు అట్ట పైనే చూపిన కూరెళ్ళ శ్రీనివాస్ అభినందనీయులు. ప్రతి తెలంగాణ బిడ్డ చదువవలసిన గ్రంథమిది.

**01.03.2017, అంకురం**

**నవతెలంగాణ**

33

# కష్టజీవికి అరుదైన గౌరవం

సామాజిక, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానికాది రంగాలలో సమున్నతులైన వారి జీవిత చరిత్రలను వెలువరించడం సాహితీలోకంలో సర్వసాధారణం. కానీ సామాన్యుడిగా కనిపించే వారిలోనూ అసామాన్యులు ఉంటారని, వారు ముందుతరాలకు స్ఫూర్తిగా నిలువగలరని గుర్తించి అటువంటి ఓ అసామాన్యుని జీవితాన్ని తనదైన శైలిలో రికార్డు చేశారు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బెల్లి యాదయ్య. జీవితచరిత్ర రాయడానికి కొలమానాలు ఆర్థిక స్థితిగతులో, చేసిన ఉన్నతోద్యోగాలో, సమాజంలో పదవులో, హెూదానో కాదని, మానవీయవిలువలు మనిషిని ఉన్నతంగా నిలబెడతాయని నిరూపించారు. తన రెక్కల కష్టాన్ని నమ్ముకుని కష్టాలకు ఎదురీది తర్వాత తరానికి చక్కని చదువులను అందించడం ద్వారా దారి దీపమై మార్గదర్శనం చేసిన డ్రైవర్ మల్లయ్య (బొబ్బల మల్లయ్య) గారి జీవితమే 'రెక్కల మనిషి' గ్రంథం. నార్కట్‌పల్లి సమీపంలోని నైబాయి అనే మారుమూల గ్రామంలో చదువుసంధ్యలు లేని యాదవ సామాజి కవర్గానికి చెందిన కుటుంబంలో పుట్టిన గొర్లగాసే పిల్లవాడు బతుకుతెరువు కోసం పట్నంబాట పట్టి సమాజాన్ని చదివి లోకం పోకడను అర్థం చేసుకొని తదనుగుణంగా తన బతుకును దిద్దుకున్న తీరును, అందులో తాను పడిన కష్టాలను 'రెక్కల మనిషి' చక్కగా ఆవిష్కరించింది. ఈ గ్రంథం చదువుతున్నంతసేపు ఒక జీవితచరిత్రను చదువుతున్నట్టుకాక మన జీవితాలను మన పూర్వికుల జీవితాలను మననం చేసుకుంటున్న అనుభూతి కలుగుతుంది. ఈ 'రెక్కల మనిషి' ఒక డ్రైవర్ మల్లయ్య జీవితచరిత్రే కాదు. ఉత్పత్తి కులాల నుండి ఎదిగి తమ ముందుతరాలను విద్యావంతులుగా తీర్చిదిద్దిన సగటు బడుగు, బలహీనవర్గాల వారందరి జీవితచరిత్ర. జీవితచరిత్రను సాధారణంగా ఆ వ్యక్తి జీవితాన్నే కాక సమకాలీన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. 'రెక్కల మనిషి'లోను రజాకార్ల కాలం నుండి నేటిదాకా మల్లయ్య సమకాలీన సామాజిక చరిత్ర ఇమిడి ఉంది. దీనికితోడు మల్లయ్య వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే క్రమంలో వ్యక్తిత్వ వికాసానికి మహనీయులు చెప్పిన మాటలు అన్వయిస్తూ మల్లయ్య జీవితాన్ని అత్యంత సహజంగా ఆవిష్కరించారు. లోతైన అధ్యయనం

విస్తృతమైన సామాజిక అవగాహన కలిగిన చేయితిరిగిన రచయితలు మాత్రమే రాయగలిగిన గ్రంథం 'రెక్కల మనిషి'. పరీక్షల కోసం 'పాఠ్యపుస్తకాలు చదివినట్టే బతకడానికి దారి కోసం, స్ఫూర్తి కోసం పూర్వికుల జీవిత కథనాలను నిత్యం చదువుకోవాలె' అంటారు రచయిత. అందుకే మన మూలాలను తెలుసుకోవడానికి, ముందు తరాలకు అందించడానికి ఇలాంటి రెక్కల మనుషులను చదవాల్సిందే. 'రెక్కల మనిషి' ఒక వ్యక్తి స్థితప్రజ్ఞత భార్యాభర్తల అన్యోన్య దాంపత్యం, దూరదృష్టి, జీవన తాత్వికత రంగరించిన శ్రమకావ్యం. "అవగాహన తోటి బతికినం. అప్పు చెయ్యలే, తప్పు చెయ్యలే. ఉన్నదాంట్లోనే సర్దుకున్నం" అన్న దుర్గమ్మ మాటలు జీవితానుభవ సారాన్ని పట్టిస్తాయి. 'పిల్లలు కలుగుతున్నారు కంచాలు పెరుగుతున్నాయి' అని సంసార బాధ్యతను ఆలుమగలు కలిసి పంచుకున్న తీరు నేటి తరానికి మార్గదర్శనం చేస్తున్నది. డ్రైవర్ మల్లయ్యకు ఏడు దశాబ్దాలుగా తోడు నీడై నిలిచిన అర్ధాంగి బొబ్బల దుర్గమ్మకు ఈ గ్రంథం అంకితమివ్వడం, 'వర్గమూలం' అన్న శీర్షికన ప్రముఖ కవి మునాసు వెంకట్ ముందుమాట ఈ గ్రంథానికి అదనపు ఆకర్షణలు. ఈ గ్రంథం మూలాలను వెతుక్కునే ప్రతి ఒక్కరూ చదువదగినది. కష్టజీవికి దక్కిన అరుదైన గౌరవమిది.

**11.04.2018, అంకురం**

**నవతెలంగాణ**

34

# పిల్లల సృజనాత్మకతకు పట్టాభిషేకం

మానవజాతి భవిష్యత్తు బాలలు. బాలలు లేని ప్రపంచాన్ని ఊహించలేం. శారీరకంగా మానసికంగా బాలలు వికాసం చెందినప్పుడే ఆరోగ్యకరమైన భావిసమాజాన్ని నిర్మించగలుగుతాము. బాలల ప్రగతి మూడు అంశాలపైన ఆధారపడి ఉంటుంది. అవి జ్ఞాపకశక్తి, సృజనాత్మకత, పరిసరాలు. ఈ మూడు అంశాలలో ఏ ఒక్కటి నిర్లక్ష్యం చేయబడినా భవిష్యత్ అంధకారం అవుతుంది. దురదృష్టవశాత్తు విద్యావిధానంలో కొనసాగుతున్న 'బట్టీ' విధానం వల్ల, ఎక్కువ మార్కులు సాధించడమే పిల్లవాడి ప్రతిభకు గీటురాయి కావడం వల్ల, మనం జ్ఞాపకశక్తికి ఇస్తున్న ప్రాధాన్యం మిగిలిన అంశాలకు ఇవ్వడం లేదు. దీనివల్ల పిల్లలలో సృజనాత్మకత లోపిస్తున్నది. సమాజం నుంచి, పరిసరాల నుంచి నేర్చుకోవాలనే స్పృహ కూడా విద్యార్థులకు కలగనివ్వడం లేదు. నగరీకరణ, ప్రకృతితో సంబంధం తెగిపోవడం, సమిష్ఠితత్వానికి దూరం కావడం తదితర కారణాలు బాలలను సహజ వాతావరణానికి దూరం చేస్తున్నాయి. విద్యాబోధనతో పాటు వారిలోని సృజనాత్మక శక్తులను గుర్తించి పెంపొందించడం వారి సమగ్ర మూర్తిమత్వానికి బాటలు వేయడం మనందరి బాధ్యత. ఆధునిక ఎలక్ట్రానిక్ మీడియా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చి విద్యార్థులకు ఆలోచించే శక్తి కూడా లేకుండా చేస్తుంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల్లో సృజనాత్మకతను మేల్కొల్పుతూ విద్యార్థుల ద్వారా కథారచన చేయిస్తూ వాటిని పుస్తకాలుగా అచ్చు వేస్తూ ఒక బృహత్తరమైన సామాజిక బాధ్యతలు నిర్వహిస్తున్నది 'మంచి పుస్తకం'. ఈ నేపథ్యంలోనే యావత్ తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ జిల్లాలలోని బడి పిల్లల చేత కథలు రాయించి 'తీయని పలకరింపు' పేరిట తెలంగాణ బడి పిల్లల కథలను అచ్చు వేసింది మంచిపుస్తకం సంస్థ.

బాలసాహిత్య పరిషత్, పిల్లల లోకం సంస్థల సహకారంతో తెలంగాణలోని ఉన్నత పాఠశాలస్థాయి బడి పిల్లలకు కథారచన పోటీ నిర్వహించింది మంచి పుస్తకం. ఆ పోటీలో ఎంపికైన 59 మంచి కథల సమాహారమే 'తీయని పలకరింపు'. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లు పసివయసులోనే సామాజిక స్పృహతో కథలు రాశారు ఈ బాల కథకులు.

పిల్లల సృజనాత్మకశక్తికి, ఊహాశక్తికి దర్పణంగా నిలిచిన అనేక కథలు ఇందులో ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా తడపాకల్ గ్రామానికి చెందిన రఘు రాసిన కథలో స్నేహం గొప్పదనాన్ని వివరించాడు. వెన్నెల రాసిన కథలో స్వేచ్ఛ అవసరాన్ని తెలియజెప్పింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన తూముకుంట్ల సాయికుమార్ రాసిన 'ఫేస్‌బుక్ జనరేషన్' కథలో మానవసంబంధాలు ఆర్థికసంబంధాలుగా మారుతున్న తీరును చక్కగా వివరించాడు. పెరుగుతున్న టెక్నాలజీ మనుషులను దూరం చేయడానికి కాదు, దగ్గర చేయడానికి అంటూ గొప్ప సందేశాన్ని అందించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని సాయి దీప్తి రాసిన కథలో కొడుకైనా కూతురైనా సమానమేనని తేల్చిచెప్పింది. గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన కృష్ణప్రియ రాసిన కథ అత్యాశ వల్ల అసలుకే మోసం వస్తుందని తెలియచెప్పింది. సిద్దిపేట జిల్లా జక్కాపూర్ విద్యార్థి నవనీత్ రెడ్డి తప్పు చేసిన వాడు తన మిత్రుడైనా శిక్ష తప్పదని, ధర్మం తప్ప రాదు అనే సందేశాన్ని తన కథ ద్వారా వెలిబుచ్చాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన అభినయ మూర్ఖత్వంతో వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు వస్తుందని ఎలుక, కప్ప పాత్రల ద్వారా తెలియజెప్పింది. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మోడల్ స్కూల్ విద్యార్థి అభిశేఖర్ రెడ్డి రాసిన కథా 'తీయని పలకరింపు'. కని, పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించి, వారిని వీధిపాలు చేసిన కసాయి కొడుకుల కాఠిన్యతను చక్కగా వివరించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వై. సంధ్య నిజాయితీగా వ్యవహరిస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని తెలియజేసింది. నిజామాబాద్ విజయ హైస్కూల్ విద్యార్థిని శ్రీహిత రాసిన కథలో చదువుకోవడమే స్వర్గంతో సమానం అని తెలియజెప్పింది. సిద్దిపేట జిల్లా ఏటిగడ్డ కిష్టాపూర్ విద్యార్థిని కీర్తన ఉపాయంతో అపాయాన్ని అధిగమించవచ్చునని తన కథ ద్వారా చాటింది. రాజన్న సిరిసిల్ల జిల్లా లింగన్నపేట విద్యార్థిని కే. మంగ రాసిన కథలో పర్యావరణ స్పృహ దాగి ఉన్నది. ముస్తాబాద్ విద్యార్థిని పి. శ్రావణి ఐక్యమత్యమే మహాబలం అనే సందేశాన్ని ఇచ్చింది. కొండపాక విద్యార్థిని జి .అక్షిత వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ కొడుకులలో వచ్చిన పరివర్తనను చక్కగా తెలియజెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సఫాయి బస్తి ప్రాథమిక పాఠశాల నాలుగవ తరగతి విద్యార్థిని ఎస్కే తస్లీమ్ రాసిన చిన్న కథ 'తాత సంతోషం'. ఈ కథలో అనాధ అయిన బిక్షగానికి పిల్లలు సహాయం చేశారన్నది ఇతివృత్తం.

పసిమనసులలో ఉత్తమగుణాలను ప్రోది చేయడానికి ఈ సంకలనం దోహదపడింది అనడానికి ఈ కథ ఓ ఉదాహరణ. ఇదే పాఠశాలకు చెందిన సింధూశ అనే మూడవ తరగతి విద్యార్థిని అరటి తొక్క తొక్కి జారిపడకుండా పాపను కాపాడిన ఆవు ద్వారా పరులకు సహాయం చేయాలనే నీతిని తెలిపింది.

చదువే సకలసమస్యలకు శాశ్వత పరిష్కారమని, చదువు జీవితాలను తీర్చిదిద్దుతుందని తెలియజెప్పింది సిద్దిపేట ఇందిరానగర్ విద్యార్థిని నికిత. సంగారెడ్డి జిల్లా బొల్లారం విద్యార్థి బి.సాయి కిషోర్, జీవితంలో కష్టాలకు ఎదురీదుతూనే సుఖాలను అనుభవించాలని సీతాఫలం ఉదాహరణగా చెప్పాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి విద్యార్థి విష్ణువర్ధన్, చేసిన మేలు మరువవద్దని విశ్వాసం విధేయత ప్రకటించాలని కుక్క పాత్ర ద్వారా నిరూపించాడు. లింగన్నపేట విద్యార్థిని గౌతమి, తాగుడు వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ తాగుడు మానిన వెంకటాపురం ఆదర్శాన్ని లోకానికి చాటింది. బంధనకల్ విద్యార్థిని సాయి ప్రియ, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే సందేశాన్ని తన కథ ద్వారా అందజేసింది. ఖమ్మం జిల్లా నిదానపురం విద్యార్థి ఇంద్రసేనారెడ్డి, వినాయక నిమజ్జనం పేరిట చెరువులను కలుషితం చేయవద్దని హితవు పలికాడు. మట్టి వినాయకులను నిలబెట్టాలనే సందేశం ఇచ్చాడు. భద్రాద్రి జిల్లా మల్లెల మడుగు విద్యార్థిని పూజిత, ప్రపంచంలో అతి తీయనైనది మాటలలోని సౌమ్యత్వమే అని తన కథ ద్వారా తెలియజేసింది.

ఈ విధంగా చక్కని వస్తు వైవిధ్యంతో, సామాజిక ఇతివృత్తాలతో చక్కని కథలు అందించిన విద్యార్థులు, వీరిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు అభినందనీయులు. ఈ బృహత్ సంకలనం వెలుగుచూడడానికి గరిపల్లి అశోక్ గారు చేసిన శ్రమ వెలకట్టలేనిది. కథల ఎంపికలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ప్రముఖ బాల సాహితీవేత్తలు డాక్టర్ భూపాల్ గారు, డాక్టర్ వి ఆర్ శర్మ గారు చక్కని కథలు ఎంపిక చేయడంలో కృతకృత్యులయ్యారు. ఇంకా కొన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం లేకపోవడం లోటుగా కనిపిస్తున్నా ఒక సాహిత్య అకాడమీ చేయదగిన గొప్ప కార్యాన్ని ఒంటిచేత్తో 'మంచిపుస్తకం' నిర్వహించడం అభినందించదగ్గ విషయం. ఈ బాల కథకులను చూస్తుంటే భవిష్యత్తు తెలంగాణ కథకు భరోసా సంతకంగా నిలుస్తారు అనిపిస్తుంది. ప్రతి పాఠశాలలో ఉండదగిన పుస్తకమిది.

**అంకురం, నవతెలంగాణ**

# వినూత్న ఆలోచన

**భా**ష ఒక ఆలోచనా సాధనం. భాష పొందిన అనుభూతులను ప్రతిస్పందింప చేసే సాధనం కూడా. పిల్లలు తమ అనుభవాలను అనుభూతులను స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యక్తీకరించగలిగినప్పుడే పిల్లల భాష పరిపుష్టమవుతుంది. తరగతి నాలుగు గోడల మధ్య విద్యార్థిని నిస్తేజంగా ఉంచుతూ ఉపాధ్యాయుడు ఎంతో శ్రమించి బోధించడమంటే నిజంగా విద్యార్థిని బాధించడమే. అలా కాకుండా విద్యార్థికి ప్రత్యక్ష అనుభవాలను ఉపాధ్యాయులు కల్పించినప్పుడే అభ్యసనం పరిపూర్ణమవుతుంది. అందుకు దోహదపడేవి క్షేత్ర పర్యటనలు, విజ్ఞాన విహార యాత్రలు. బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు ప్రత్యక్షానుభవాలు కలిగించడానికి, వారి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధికి, ప్రకృతి దృగ్విషయాల పరిశీలనకు ఈ పర్యటనలు దోహదపడతాయి. ఇవి విద్యార్థి పాఠశాల జీవితంలో సాధారణమే. కానీ తాను పొందిన అనుభవాలు కలిగిన అనుభూతులకు అక్షర రూపం కల్పించడం వినూత్నమైన అంశం. ఈ వినూత్న ఘట్టం నేను చదువుకున్న మా వట్టిమర్తి పాఠశాలలో ఆవిష్కృతమవుతుండడం నాకు అమితానందాన్ని కలిగిస్తుంది. అలాగే నా ప్రియమిత్రుడు బాలల కథా రచయిత పెండెం జగదీశ్వర్‌గారికి ఈ పుస్తకాన్ని అంకితమివ్వడం సముచిత గౌరవం ఇవ్వడంగా భావిస్తున్నాను. సంపాదకుల ఆలోచనకు అభినందనలు తెలియజేస్తున్నాను.

వట్టిమర్తి గ్రామం... హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి పక్కన అటు పరిశ్రమలూ... ఇటు పంటపొలాలు... కలిగి ఉండి పట్నానికి తక్కువ పల్లెకు ఎక్కువ అన్నట్లుగా కనబడే చిన్న గ్రామం. నాటి సాయుధ పోరాట కాలం నుండి నేటి వరకు మిక్కిలి చైతన్యశీలమైన గ్రామమది. ఇటువంటి గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు గ్రామస్తులలో ఐక్యతను, విద్య పట్ల మరింత అవగాహనను పెంచింది. ఏ గ్రామంలో విద్య వికసిస్తుందో ఆ గ్రామం సమగ్రాభివృద్ధి చెందుతుందనడానికి నిదర్శనం మా వట్టిమర్తి.

వట్టిమర్తి గ్రామం ఉన్నత పాఠశాలకు గత సంవత్సరం ఉపాధ్యాయ బదిలీల అనంతరం వచ్చిన ఉపాధ్యాయులు, గతం నుండి పనిచేస్తున్న ఉపాధ్యాయులు వెరసి ఓ

చక్కని టీం రావడం మా పాఠశాల అదృష్టంగా భావిస్తాను. ఇటీవల పాఠశాల నుండి విజ్ఞాన విహార యాత్రకు పాపికొండలకు వెళ్లారు. అక్కడి అనుభవాలను వ్యాసాలుగా, కవితలుగా చిన్నారులు రాసిన యాత్రాస్మృతుల కలబోత ఈ 'రెక్క విప్పిన బాల్యం'. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోకూరు శ్రీనివాస రెడ్డి గారు సమర్థవంతమైన నాయకులు. వారి మార్గదర్శకత్వంలో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీ పెరుమాళ్ళ ఆనంద్ గారు, తెలుగు ఉపాధ్యాయులు శ్రీ పొట్టబత్తుల రామకృష్ణగారు ఈ యాత్రారచన ప్రచురణకు నడుంబిగించడం ముదావహం. పెరుమాళ్ళ ఆనంద్ గారు ప్రముఖ కవిగా, రచయితగా, సృజన సాహితీ నల్లగొండ నిర్వాహకులుగా సుప్రసిద్ధులు. వారు పనిచేసిన ప్రతి చోటా విద్యార్థులలో సృజనను వెలికితీసిన ఉత్తమ ఉపాధ్యాయులు. గతంలో పనిచేసిన ఉరుమడ్లలోనూ పిల్లలను సృజనశీలురుగా తీర్చిదిద్దారు. ఇటువంటి ఉపాధ్యాయ వర్గం రావడం మా పిల్లల అదృష్టంగా భావిస్తున్నాను. పిల్లల చేత యాత్రారచన (travelogue) రాయించి పుస్తకంగా వేయడం బహుశా తెలుగు సాహిత్య చరిత్రలోనే అరుదు.

ఇక పుస్తకం విషయానికి వస్తే ఒక్కో వ్యాసం ఒక్కో ఆణిముత్యం. చెప్పదలుచుకున్న విషయం ఒక్కటే అయినా వ్యక్తీకరణలో ఎంతో వైవిధ్యాన్ని కనబరిచారు. అలంకారయుక్తంగా, అందమైన ఊహలను జోడించి రాసిన వ్యాసాలివి. నూకల కృష్ణవేణి అనే విద్యార్థిని చలికాలం వేళ మంచు కురుస్తుండగా మంచులో వెళ్తున్న బస్సును వర్ణిస్తూ "మంచు మధ్యలో బస్సు వెళ్తుంటే మేఘాలలో దూసుకెళుతున్నట్లుగా ఉన్నది" అని రాసింది. ఎంత గొప్ప ఊహ! ఇంత చిన్న వయసులో చేయి తిరిగిన రచయిత్రిలా తన వ్యాసాన్ని మలిచింది. దోటి వినేష్ "గోదావరి మాతో విష్ యు హ్యాపీ న్యూ ఇయర్ చెప్పినట్టు ఉంది" అనడం అతని సృజనాత్మకతకు ప్రతీక.

పిల్లలు ఎంతో సూక్ష్మ పరిశీలనా దృష్టి కలిగి ఉంటారనడానికి ఈ వ్యాసాల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. బాతుక సునీల్ కూసుమంచిలో బస్సు ఆగినప్పుడు పరిసరాలను వర్ణిస్తూ "అక్కడొక డొక్కు బడి ఉంది. ఆ బడి గోడలమీద ఆకుపచ్చ పాకురు ఉంది". అని రాశాడు. సాగర్ల లోకేష్ కొండ రాశి అనే జంతువుని చూసినట్టు రాశాడు. ఇది పిల్లల సూక్ష్మ పరిశీలనకు నిదర్శనం. ఈ రచనలను చదువుతున్నప్పుడు 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులతో కాశ్మీర్ దర్శించి యాత్రా చరిత్ర రాసిన నాయని కృష్ణకుమారి "కాశ్మీర దీప కళిక" గ్రంథం గుర్తొస్తుంది. పిల్లలు సామాజిక దృష్టితోనూ తాము చూసిన అంశాలను విశ్లేషించారు. బొడ్డుపల్లి ప్రజయ్ గోదావరి తీరంలో నివసించే ప్రజల జీవన విధానాన్ని చూసి "ప్రజలు ఇక్కడ ఎలా నివసించ

గలుగుతున్నారు?” అనే ఆవేదన వ్యక్తం చేశాడు. ‘వాళ్ల జీవితాలు ఇంకా గుడిసెల్లోనే’ అనే రూపని నిస్మిత మాటలు పాఠకులను ఆలోచింపజేస్తాయి.

అంతేకాదు పిల్లలు విహారయాత్రలో పరవశించిపోయి రాసిన మాటలు మనసుకు హత్తుకునేలా ఉన్నాయి. “పాపికొండల అందాలు నా మనసులో ఫోటో లాగా ముద్రించబడ్డాయి” అంటుంది దండిగ పూజిత. “మా నృత్యాలకు బస్సు ఉయ్యాల లూగింది” అనే కొంపెల్లి భవాని మాటలు, “జ్ఞాపకాల నిధిని పదికాలాలపాటు పదిలంగా దాచుకుంటా” అనే బెల్లపు ప్రియాంక మాటలు పిల్లల సృజనను ప్రతిఫలిస్తాయి.

“ఈ మట్టిలోనే ఉందేమో ఏదో మహత్తు
అందుకే వారసత్వాన్ని అందిస్తుంది
మా వట్టిమర్తి పిల్లలు
నక్షత్ర పుష్పాల కోసం
నిచ్చెన లేదా ఏమంటారు
విహంగాలలో విహరించి
విజ్ఞానం అందుకోవాలని
ఆరాటపడుతుంటరు”

అనే పెరుమాళ్ళ ఆనంద్ గారి మాటలతో ఏకీభవిస్తూ మా ఊరి పిల్లలను సృజనశీలురుగా తీర్చిదిద్దుతున్న గురువులకు ప్రణమిల్లుతూ బాల (భావి) రచయితలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**(‘రెక్క విప్పిన బాల్యం’ కు ముందుమాట)**

# రచయిత పరిచయం

రచయిత పేరు : సాగర్ల సత్తయ్య

విద్యార్హతలు : MA, B.Ed, NET (Ph.D)

తల్లిదండ్రులు : సాగర్ల పార్వతమ్మ-ధర్మయ్య

చిరునామా : వట్టిమర్తి గ్రా. చిట్యాల మం. నల్లగొండ జిల్లా - 508254
సెల్: 9966549991, 7989117415(వాట్సప్)

వృత్తి : ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
చింతగూడెం, అనుముల మండలం, నల్లగొండ జిల్లా

రచనలు : 1. కంద మకరందం(శతకం) 2. "కుందెన" (సాహిత్య వ్యాసాలు)
3. 'బొడ్డు గురిగి' వచనకవితల సంపుటి (అముద్రితం )

సంపాదకత్వం : 1. మూడు పదుల ముచ్చట(సంపాదకుడు) 2. ఒక సందర్భం(సహసంపాదకుడు) 3. డా. కూరెళ్ళ విఠలాచార్య జీవితం సాహిత్యం సంక్షిప్త పరిచయం (సహ సంపాదకుడు) 4. అవని-అక్క-ఆకాశం (సహ సంపాదకుడు) 5. బాసలు- సేసలు (సంపాదకుడు) 6. జనం మనిషి (జీవిత చరిత్ర రచయితల బృందం సభ్యుడు) 7. మీకోసం (దోరవేటి బాలసాహిత్యం -సంపాదకుడు) 8. 'బాల సాహితీ రత్న' పెండెం జగదీశ్వర్ సాహిత్యానుశీలనం (సహ సంపాదకుడు) 9. 'తెలంగాణ వైభవం' ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక (రచయితల బృందం సభ్యుడు)

పొందిన పురస్కారాలు: 1. అక్షరాల తోవ ఉత్తమ కవితా జాతీయ పురస్కారం 2019. 2. శ్రీరామదాసి రాజా రామ్ మహారాజ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారం 2019. 3. అక్షర కళాభారతి రాచకొండ పురస్కారం 2017. 4. తెలుగు సాహితీ పీఠం సాహిత్య పురస్కారం 2016. 5. ఎల్లోజు కౌసల్య ఆంజనేయులు స్మారక పురస్కారం 2015.

గుర్తింపు: * తెలంగాణ 8వ తరగతి పాఠ్య పుస్తక రచయితలలో ఒకరు * అవధాన రాజధాని కార్యక్రమంలో పృచ్ఛకుడిగా మాడుగుల వారిచే డిల్లీలో సన్మానం * ప్రపంచ తెలుగు మహా సభలలో శతావధానంలో పృచ్ఛకుడిగా పాల్గొన్నాడు. * తెలుగు భాషా పరిరక్షణ సమితి, చిట్యాల వ్యవస్థాపక కార్యదర్శి మరియు ప్రస్తుత అధ్యక్షులుగా సాహితీ సేవ * అహల్య సాహితీ సంగమం, హాలియా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి.

**email:** sathaiah.sagarla@gmail.com



సాగర్ల సత్తయ్య

"ఇది సాహిత్య విమర్శ పుస్తకం. నా విద్యార్థుల్ల ఎక్కువ మంది కవులు. సత్తయ్య విమర్శ మార్గాన్నెంచుకున్నడు. విమర్శకుల కొరత శాన ఉంది. ఆ మార్గంల వెలుగు కావడం మంచిదేగద. విమర్శకుడికి ఒక ఐఏఎస్ కంటే, ఒక ముఖ్యమంత్రి కంటే, ఒక ప్రధానమంత్రి కంటే ఎక్కువ జ్ఞానం ఉండాలె. ఈ లక్షణాలను సత్తయ్య క్రమక్రమంగా సంతరించుకుంటున్నాడనడానికి ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాలు నిదర్శనంగా నిలుస్తున్నవి."

డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి

"ఇప్పుడు సాగర్ల సత్తయ్య 'కుందెన' పేరిట 35 విభిన్నమైన విమర్శా వ్యాసాలను మన ముందుకు తెస్తున్నారు. భవిష్యత్తులో మంచి విమర్శకుడిగా ఎదగడానికి పటిష్టమైన పునాదులు ఈ పుస్తకం ద్వారా పడ్డాయంటే అతిశయోక్తి కాదు. ఎనుకట మిల్లులు లేని కాలంలో ధాన్యాలను దంచేప్పుడు అవి చిల్లం కల్లం కాకుండా కాపాడుకునేందుకు 'రోలు'పై 'కుందెన' ఉంచేవారు. సాహిత్యంలో కూడా సత్తయ్య తాలుని ఏరేసి సత్తువ ఉన్న ఇత్తుల్ని జల్లెడబట్టి మనకందించిండు. ఏ 'రోటి'కాడి పాట ఆ 'రోటి' కాడ పాడే వాళ్ళు చాలా మంది ఉన్నరు. అది విమర్శకన్నా పరామర్శగానే ప్రసిద్ధి. అందుకు విరుద్ధంగా సత్తయ్య ఇందులోని రచనలన్నింటినీ సమదృష్టితో పరిశీలించి, విశ్లేషించి వ్యాఖ్యానించారు. రాళ్ళు తాలుతో కూడిన వాటిని చెరిగి మనకందించిండు."

సంగిశెట్టి శ్రీనివాస్

"ఏ వ్యాసానికైనా లోతైన పరిశీలన, వివేకవంతమైన విశ్లేషణ, సహజ సుందరమైన భాష, ధారాశుద్ధి వన్నెతెస్తాయి. సాగర్ల సత్తయ్య వ్యాసాల్లో ఈ నాలుగు లక్షణాలకు తోడు 'సహృదయత' అనే పంచమ లక్షణం చేరి సనార్ద్రతనద్దినాయి. వ్యాసాల నిండా ఆత్మీయాభిమానం పరచుకుని, పఠితలను అతనికి, అతని సాహిత్యానికి అభిమానులుగా మారుస్తాయి."

దోరవేటి

"ఒక అంశానికే కట్టుబడి ఉన్న రచనలు కాకుండా వస్తువైవిధ్యం ఉన్న రచనలను తన విమర్శకు వస్తువులుగా తీసుకోవడం సత్తయ్యలోని ప్రత్యేకత. తమ వ్యాసాల ద్వారా విస్మృత సాహిత్యకారులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయాలనుకునేవారికి సత్తయ్య 'కుందెన' ఒక దిక్సూచిలాంటిది."

రాపోలు సీతారామారాజు

ISBN 978-93-5391-817-0
9 789353 918170